www.jagritiweekly.com
సంపుటి : 75 సంచిక : 08 పుటలు : 52

# జాగృతి

కలి 5124 - శ్రీ శుభకృత్ మార్గశిర బహుళ చవితి
12-18 డిసెంబర్ 2022
వెల : ₹15/-



# జీరో కొవిడ్‌తో జిన్‌పింగ్ జీరో

జీ జిన్‌పింగ్ భవితవ్యం మీద అనుమానాలు రేకెత్తిస్తున్న పరిణామం
ఇప్పుడు మహాకుడ్యం వెనుక శరవేగంగా జరుగుతున్నది

జాగృతి చందాను చెల్లించడానికి పక్కనున్న క్యు.ఆర్.కోడ్‌ను మీ మొబైల్‌తో స్కాన్ చేయండి. లేదా http://payit.cc/S18970 అని బ్రౌజర్‌లో టైప్ చేయండి.

75 ఏళ్లుగా వెలువడుతున్న జాతీయ తెలుగు వారపత్రిక




# నో థూ థూ

భారతదేశంలో రోజూ నేల నుంచి వెలికి తీసే బొగ్గు ఎంత ఉంటుంది! సరిగ్గా అంతే పరిమాణంలో మరొకటి భూమి మీద పడుతోంది. అది– ఉమ్ము. వినడానికి జుగుప్సాకరంగా ఉన్నా ఇది నిజం. ఇది పాతిక ముప్పయ్యేళ్ల నాటి లెక్క. ఇప్పుడు ఈ పరిమాణం పెరగవచ్చు. కాస్త తగ్గి ఉండవచ్చు. కానీ సమస్య మాత్రం అంతే తీవ్రంగా ఉందని ఇందోర్ కార్పొరేషన్ సభ్యులు ప్రారంభించిన ఉద్యమాన్ని చూస్తే తెలుస్తుంది. ఇందోర్ అంటే మొదటిగా గుర్తుకు వచ్చేది, అక్కడ కనిపించే పరిశుభ్రత. దేశంలోనే అత్యంత పరిశుభ్రమైన నగరంగా అది ఆరు సంవత్సరాల నుంచి వరసగా ఎంపికవుతున్నది కూడా. మనకు ఎప్పుడూ అంతటి గౌరవం దక్కలేదు కాబట్టి మనకెందుకు అని ఏ భారతీయ పట్టణం అనుకోరాదు. ఎందుకంటే, ఇందోర్ వారు ప్రారంభించినది 'నో థూ థూ' ఉద్యమం. అంటే ఉమ్మొద్దురా నాయనా! అని సగౌరంగా హెచ్చరించే ఉద్యమమే.

ఉమ్మేవాళ్లకి విజ్ఞత కాస్త తక్కువే అంటే ఎవరికీ అభ్యంతరం ఉండనక్కరలేదు. ఎవరూ గింజుకోనక్కరలేదు కూడా. ఆఖరికి ఆసుపత్రుల గోడలని కూడా వదలరు మరి! ఇక బస్టాండ్లు, రైల్వే స్టేషన్లు, మార్కెట్లు అయితే చెప్పక్కరలేదు. ఉత్పత్తిలో బొగ్గుతో ఉమ్ము పోటీ పడుతున్న మాట నిజమేనని నమ్మక తప్పదు. ఇవన్నీ చూసే కాబోలు ఇందోర్ కార్పొరేషన్ 'నో థూ థూ' ఉద్యమం డిసెంబర్ 5న ఆరంభించింది. అన్నట్టు ఈ ఉమ్ము వ్యతిరేకోద్యమం రెండు దశలలో సాగుతుంది. మొదటి దశలో గుట్కా, జర్దా, తాంబూలం, ఇతరత్రా చర్వణాలని మానాలని ప్రజలకు సవినయంగా మనవి చేస్తారు. తరువాత దశ మాట వినని వారికి జరిమాన విధించడమే. నగరానికి ఆరేళ్లు వరసగా పరిశుభ్రతకు అవార్డులు వచ్చినా ఉమ్ముల బెడద తప్పడం లేదు కాబట్టి ఇలాంటి ఉద్యమం అవసరమైంది.

# హుక్కా మీద నిషేధం

కోల్‌కతా, బిధాన్‌నగర్ ఒక మంచి నిర్ణయం తీసుకున్నాయి. మొదట కోల్‌కతా, తరువాత బిధాన్‌నగర్ హుక్కా సేవనాన్ని నిషేధించాయి. ఎక్కడ హుక్కా పార్లర్ ఉన్నా దాని మీద చర్య తీసుకోవాలని బిధాన్‌నగర్ మున్సిపల్ కార్పొరేషన్ చైర్మన్ సవ్యసాచి దత్తా పోలీసులను ఆదేశించారు. హుక్కా తాగడం వల్ల వచ్చే ఆరోగ్య సమస్యలు తక్కువేమీ కాదు. కేవలం రెండు రోజుల క్రితమే కోల్‌కతా నగర కార్పొరేషన్ ఈ మేరకు ఆదేశాలు ఇచ్చింది.




దేశ చరిత్రలో చిరస్మరణీయమైన
1971 డిసెంబర్ 16న పాకిస్థాన్‌ను మట్టి కరిపించి,
భారత శౌర్య, పరాక్రమాలను ప్రపంచానికి
చాటి చెప్పిన వీర జవానుల స్ఫూర్తికి చిహ్నంగా
రాష్ట్ర ప్రజలకు, బీజేపీ నాయకులకు, కార్యకర్తలకు
విజయ్ దివస్
(డిసెంబర్ 16)
శుభాకాంక్షలు
అర్వింద్ ధర్మపురి
(పార్లమెంట్ సభ్యులు నిజామాబాద్)

Printed & Published by **Nagol Sreenivas Reddy** on behalf of **Jagriti Prakashan Trust** and printed at Kala Jyothi Process Ltd, CFC 1&2, Raviryala, Maheswaram, Rangareddy - 501 359. And published at Jagriti Bhavan, 3-4-228/4/1, Lingampalli, Kachiguda, Hyderabad - 500 027.

**Editor : Dr. Goparaju Narayana Rao.**

**సర్క్యులేషన్ వివరాలు, ఫిర్యాదులు, వ్యాపార ప్రకటనల వివరాల కోసం (ఉ॥11 నుండి సా॥ 6 గంటల మధ్య) సంప్రదించండి.**

జి. తుకారాం సర్క్యులేషన్ మేనేజర్ 040-27561453/9959997013

## జాగృతి చందా – సూచనలు

**5 సం॥ల చందా రూ.3000, సంవత్సర చందా రూ.650, విడి ప్రతి రూ.15**

- ✦ అడ్రసులో పేరు, ఇంటి నెం., గ్రామం, మండలం, జిల్లా, పిన్‌కోడ్, మొబైల్ నెం. సమగ్రంగా ఉండాలి. లేకుంటే కంప్యూటర్ ఆమోదించదు.
- ✦ తాత్కాలిక రసీదు చేరిన 15 రోజుల తర్వాత చందా నెం., ప్రారంభ తేది వివరాలు మీకు ఎస్.ఎం.ఎస్. చేస్తాం. ఆ వెంటనే సంచిక కూడా అందుతుంది. మీరు చందా నెం. నోట్ చేసుకోవాలి.
- ✦ పత్రిక అందకపోతే వెంటనే సంప్రదించగలరు. చిరునామా మారితే కార్యాలయానికి విధిగా తెలపండి.

**చందా కట్టించే వారికి సూచనలు :**

- ✦ చందాలు వసూలు చేసి పంపేవారు తమ పూర్తిపేరు, సెల్ నెం. రాయాలి.
- ✦ రశీదుపై చందాదారుని పూర్తి చిరునామా, పిన్‌కోడ్, సెల్ నెం., ఈమెయిల్ ఉండాలి. వివరాలు jagritiweeklysub@gmail.comకు మెయిల్ చేయాలి.
- ✦ ఆన్‌లైన్/చెక్ ద్వారా కూడా చెల్లించవచ్చు. డబ్బు పంపాక 040-27561453/ 9959997013 నంబర్లకు తెలియజేయాలి.
- ✦ మరిన్ని వివరాలకు చందాపుస్తకంలో మొదటి రసీదు వెనుక చూడగలరు.

**చందా పంపవలసిన చిరునామా :**

- ✦ 3-4-228/4/1, కాచిగూడ, హైదరాబాద్-500 027.

**జాగృతి బ్యాంకు ఖాతా వివరాలు :**

- ✦ **A/c Name & No. Jagriti Prakashan Trust, 920010061405325, Axis Bank, Kothapet Branch. IFSC : UTIB0002157, PAN : AAATJ3829L**
- ✦ చెక్కు, డిడిపై Jagriti Prakashan Trust అని ఆంగ్లంలో రాయాలి.

**సంపాదక మండలితో సంప్రదింపుల కోసం (ఉ॥11 నుండి సా॥ 6 గంటల మధ్య)**

| | | |
|---|---|---|
| కె. దుర్గారెడ్డి | అసోసియేట్ ఎడిటర్ | |
| కె. హరీష్ | సబ్ ఎడిటర్ | 9959991304 |

డిజైనర్లు : సిహెచ్. కుమార్, ఎం. అనిత

ప్రపంచపటం రూపురేఖలను పరమ వికృతంగా, అసహజంగా మార్చేసిన ఘనత మత మార్పిళ్లకు ఉంది. ఇస్లాం, క్రైస్తవం వంటి మతాలు మూలవాసుల ఉనికినే తుడిచిపెట్టేశాయి. మతం మారడానికి కొన్ని వందల కారణాలు కనిపిస్తాయి. మత మార్పిళ్ల చరిత్ర అంతా రక్తసిక్తమే కూడా. ఇదంతా ఎందుకు? మతం మారడమంటే ఒక సమూహాన్ని తమదైన జీవనం నుంచి దూరంగా విసిరివేయడమే. ఒక సమాజం వేల ఏళ్లుగా నమ్ముకుంటూ వచ్చిన విశ్వాసాలకు పాతర వేయడమే. వారందరినీ కట్టి ఉంచిన బంధాన్ని తెంపివేయడమే. మత మార్పిడిలో ఈ కోణాన్ని చూడకపోతే అది వాస్తవమనిపించుకోదు. ఈ వాస్తవాన్ని డిసెంబర్ 5న భారత సర్వోన్నత న్యాయస్థానం ఇచ్చిన అద్భుతమైన తీర్పులో (బలవంతపు మతమార్పిడి రాజ్యాంగ విరుద్ధం) మరొకసారి గమనిస్తాం. భారతదేశంలో ఏ మతం వారైనా, ఏ ప్రాంతం వారైనా గుర్తు పెట్టుకు తీరవలసిన చరిత్రాత్మకమైన సందేశం కూడా ఆ తీర్పులో ఉంది. అది – 'భారతదేశంలో నివసిస్తున్న వారంతా ఇక్కడి సంస్కృతి సంప్రదాయాల ప్రకారం నడుచుకోవాలి.'

మతస్వేచ్ఛ అంటే 'ఇతర మతాలు బతకరాదు' అన్నట్టు వ్యవహరిస్తున్న వారందరికీ కూడా అది కనువిప్పు. వారు కనువిప్పుగా భావిస్తారా? కవ్వింపు చర్యగా భావిస్తారా? అన్నది ఆయా మతాల వారి విజ్ఞత మీద ఆధారపడి ఉండవచ్చుకానీ, మతం మారినంత మాత్రాన వారి శాశ్వత చిరునామా మారదన్న నిత్యసత్యాన్ని గుర్తించకతప్పదు. ఈ నేల మీద పుట్టినవారంతా తాము భారతీయులుగా భావించి, భారతీయులుగా జీవించి తీరాలన్నదే అత్యున్నత న్యాయస్థానం మనోగతం.

చరిత్రలో చాలా అంశాలు మరుగున ఉండిపోతాయి. కొన్నింటిని కొందరు చీకటిమాటున ఉంచుతారు కూడా. అలాంటి వాటిలో 1944లో బొంబాయిలో జిన్నా, మహాత్మా గాంధీ మధ్య జరిగిన చర్చ ఒకటి. ఆ నగరంలోని మలబార్ హిల్స్‌లోని జిన్నా భవంతిలో దాదాపు రెండువారాలు జరిగిన చరిత్రక చర్చలవి. ఆ సందర్భంలో గాంధీజీ చెప్పిన విషయాలు

**శాలివాహన 1944 శ్రీ శుభకృత్ మార్గశిర బహుళ చవితి**

**లోపలి పేజీలలో...**



ముఖపత్ర కథనం

**జీరో కొవిడ్‌తో జిన్‌పింగ్ జీరో**

6లో



జాతీయం

కశ్మీర్ ఫైల్స్ మీద రాద్ధాంతం

**టూల్ కిట్ కుట్రలో భాగమేనా?**

13లో



ధారావాహిక నవల

**ఆనందమఠం**

– బంకించంద్ర చటర్జీ

20లో

# జాగృతి

## సంపాదకీయం

# మరో మంచి తీర్పు

మననం చేసుకోదగినవి. సుప్రీం కోర్టు తాజా తీర్పుతో ఆ చర్చ లోతెంతో అంచనా వేసే అవకాశం వచ్చింది. అనేక కారణాలతో మీ పెద్దలు, ఆ తరువాత మీరు ఇస్లాంలోకి వెళ్లి ఉండవచ్చు. కానీ మీరంతా మొదట భారతీయులు అన్న విషయాన్ని జిన్నాకు ఎరుక పరచడానికి గాంధీజీ శతథా యత్నించారు. మతం మారినంతనే వారి మూలాలు మారిపోవు అని గాంధీజీ కుండబద్దలు కొట్టినట్టే చెప్పారు. మతం మారితే మాతృభూమి మీద చిరునామా చెరిగిపోదు. విదేశాల నుంచి వచ్చిన మతాలు ఇక్కడ మతం మారిన వారి మూలాలను స్పృశించలేవు. అందుకు ఇష్టపడవు కూడా. 1947 వరకు దేశంలో ముస్లింలు, క్రైస్తవులు చాలా వరకు ఈ దేశ ఆచారాలను, సంప్రదాయాలను గౌరవించారని చెప్పవచ్చు. 1980 దశకంలో విదేశీ మతాలను ఆశ్రయించినవారిలో, వారి వారసుల వైఖరిలో కచ్చితమైన మార్పు రావడం మొదలయింది. అది భారతదేశాన్ని, ఇక్కడి మెజారిటీ ప్రజల విశ్వాసాలను గౌరవించవలసిన అవసరం తమకు లేదని, అలా గౌరవించడం తమ మత సూత్రాలకు విరుద్ధమన్న వాదన ఒకటి బయలుదేరిన మాట నిజం. భారతజాతిని విదేశీ పాలన నుంచి విముక్తం చేయడానికి స్ఫూర్తిదాయకంగా నిలిచిన వందేమాతరం గీతాన్ని నిరాకరించడం, ఈ దేశ పతాకానికి వందనం చేయడాన్ని కూడా మత విశ్వాసంతో ముడి పెట్టడం వంటి పరిణామాలు చొచ్చుకు వచ్చాయి. ఆఖరికి బాబర్‌ను వ్యతిరేకించడమంటే అల్లాను వ్యతిరేకించడమనే ధోరణికీ, చరిత్రలో రాబర్ట్ క్లైవ్ అకృత్యాలను చర్చించినా అది క్రీస్తుకు వ్యతిరేక పంథా అన్న దృక్పథానికీ వచ్చినట్టు కనిపిస్తున్నది. కానీ అది వాస్తవిక దృష్టి కాలేదు. బాబర్ ఈ దేశానికి వచ్చిన దురాక్రమణదారుడు. క్లైవ్ ఈ దేశాన్ని కొల్లగొట్టడానికి పునాదులు వేసిన దోపిడీ దొంగల ముఠా నాయకుడు. ఈ తేడాను గుర్తించాలి. ఈజిప్ట్‌లో ఇప్పుడు అధికార మతం ఇస్లాం. పిరమిడ్లు కట్టినవారితో, ఆ తరాలతో, అసలు ఆ కట్టడాలతో తమకు సంబంధం లేదని వాదించే ధోరణి అక్కడ ప్రబలింది. ఎందుకంటే అవి కట్టినప్పుడు అక్కడ ఇస్లాం లేదు. ఇప్పుడు ఇస్లాం అధికార మతం. అంతమాత్రాన తమ గతాన్ని, అందుకు సంబంధించిన అవశేషాలను నిరాకరించడం సరికాదంటారు నోబెల్ సాహిత్య పురస్కార గ్రహీత వీఎస్ నయిపాల్. ఇది వాస్తవిక దృష్టి అనిపించు కుంటుంది. కాబట్టి తమ గతంతో, తమ పూర్వికులతో తెగతెంపులు చేసుకోవడం కూడా మతమార్పిడిలో భాగం చేయడం సుస్పష్టంగా కనిపిస్తుంది. సుప్రీంకోర్టు తాజా తీర్పులోని ఆ ఒక్క వాక్యం వీటికి గొప్ప సమాధానమే అవుతుంది. బాబర్ సమాధి అఫ్ఘానిస్తాన్‌లో ఉండేదనీ, దానిని తరువాతి కాలాలలో పెకలించి వేశారనీ చెబుతారు.

ఆసుపత్రులలో బాధలను అనుభవిస్తున్నవారిని ప్రలోభపెట్టి, పురిటినొప్పులతో సతమతమవుతున్న మహిళలను భయపెట్టి మతం మార్చే ప్రబుద్ధులు ఉన్నారు. ఈ నేపథ్యంలోనే సుప్రీంకోర్టు బలవంతపు మతమార్పిడి రాజ్యాంగ విరుద్ధమేనని మరొకసారి తీర్పు చెప్పింది. విశ్వాసాల ప్రాతిపదికగా కాకుండా, విద్రోహబుద్ధితో ఇక్కడ మత మార్పిడులు జరుగుతున్నాయి. వాటిని నిరోధించాలి. సుప్రీం కోర్టు కూడా ఆ వాస్తవాన్ని అంగీకరిస్తూనే ఉంది. ఈ దేశంలో పుట్టిన వారు ఏ మతాన్నీ, ఏ పూజా విధానాన్నీ ఎంచుకున్నా, పూర్వం నుంచి ఈ దేశంలో కొనసాగుతున్న కొన్ని సంప్రదాయాలను మాత్రం గౌరవించాలి. అది జరగని నాడు ఇక ఐక్యత ఎక్కడ? అయితే ఇలాంటి తీర్పులను అమలు చేయడంలో ప్రభుత్వాలు అలసత్వం వహిస్తున్నాయి. ఇప్పుడున్న ప్రభుత్వం ఈ తీర్పు మీద తక్షణ చర్యలు తీసుకుంటుందని ఆశించవచ్చు. ★

12 డిసెంబర్ 2022, సోమవారం | అసతో మా సద్గమయ తమసో మా జ్యోతిర్గమయ మృత్యోర్మా అమృతంగమయ – బృహదారణ్యకోపనిషత్



38లో

కథ

**కళ్యాణము చూతము రారండీ!**

– నందిరాజు పద్మలతాజయరాం





కొవిడ్: డ్రాగన్ పాలు పోసి పెంచిన నాగు (తాజా వార్త) - 11
'గర్జన' సరే... నీటి ప్రాజెక్టులపై చిత్తశుద్ధి ఏది? (ఆంధ్రప్రదేశ్) - 16
విష్ణుదేవుని మాసం మార్గశీర్షం (ప్రత్యేక వ్యాసం) - 26
రజాకారులపై 'గుతుపల' ప్రతిఘటన (అమృతోత్సవాలు) - 30
భిన్న సంస్కృతుల ఏకత్వం భారతీయత (సంస్కృతి) - 32
ప్రపంచ ఫుట్‌బాల్‌లో ధృవతారలు (క్రీడ) - 43
బాలజాగృతి - 46
విజయం సరే, 'హిట్-2'లో విషయం లేదు! (సినిమా) - 50



# జీరో కొవిడ్‌తో జిన్‌పి

చైనా కమ్యూనిస్టు ప్రభుత్వం కఠినంగా అమలు చేస్తున్న 'జీరో కొవిడ్' విధానం భస్మాసుర హస్తం మాదిరిగా మారడం వర్తమాన చరిత్ర . జీ జిన్‌పింగ్ భవితవ్యం మీద అనుమానాలు రేకెత్తిస్తున్న పరిణామం ఇప్పుడు మహాకుడ్యం వెనుక శరవేగంగా జరుగుతున్నది. నాలుగేళ్ల క్రితం ఊహాన్ నగరంలో మొట్టమొదటి కరోనా వైరస్ కేసును కనుగొన్న తర్వాత లాక్‌డౌన్, పెద్దఎత్తున పరీక్షలు, క్వారంటైన్ వంటి కొవిడ్-19 నిరోధక చర్యలు చైనా ప్రజల జీవితాల్లో భాగమైపోయాయి. కానీ కొవిడ్ కేసులు పెరుగుతూనే ఉన్నాయి. ప్రభుత్వం తన ఉక్కు పిడికిలిని ఇంకాస్త బిగిస్తూనే ఉంది. ఈ నేపథ్యంలోనే ప్రజలు తిరగబడుతున్నారు. 1989 నాటి తియనాన్మెన్ స్క్వేర్ హింసాత్మక చరిత్రను పునరావృతం చేయడానికేనన్నట్టు ప్రభుత్వ చర్యలు కనిపిస్తున్నాయి. ఎన్ని గట్టి చర్యలు తీసుకుంటున్నా ఇటీవల ఒక్కరోజులో నలభయ్ వేల కేసులు నమోదై కలవర పెట్టాయి. సాధారణ ప్రజలు, విద్యార్థులు అంతా వీధులకెక్కారు. కొవిడ్ పేరుతో నిర్బంధం ఇంకానా అని గొంతెత్తుతున్నారు. ప్రజల్లో వెల్లువెత్తుతున్న నిరసనల నేపథ్యంలో చైనా కమ్యూనిస్టు ప్రభుత్వం తక్షణమే కొన్ని ఉపశమన చర్యలు చేపట్టింది. ముఖ్యంగా ఉరుమ్‌కిలోని చాలా ప్రాంతాల్లో లాక్‌డౌన్ ఎత్తేయడం, చెంగ్డూలోని క్వారంటైన్ కేంద్రాన్ని తక్షణమే మూసేయడం, వృద్ధులకు వ్యాక్సినేషన్ ప్రక్రియను వేగంగా పూర్తిచేస్తామని ప్రకటించడం ఇందులో భాగమే. అయితే ఉన్నఫళంగా లాక్‌డౌన్ ఎత్తేస్తే మరణాలు ఒక్కసారిగా పెరిగిపోతాయని ప్రభుత్వం భయపడుతోంది. ఇందుకు కారణం ఉంది. నవంబర్ మొదట్లో వచ్చిన వారంరోజుల ప్రభుత్వ సెలవు దినాల నుంచి చైనాలో కొవిడ్ కేసులు పెరగడం మొదలై అదే నెల 29 నాటికి రోజువారీ కేసుల సంఖ్య 71 వేలు నమోదు కావడం ప్రభుత్వంలో ఆందోళన పెంచింది. మోడెలింగ్ అధ్యయనాల ప్రకారం చైనా ప్రభుత్వం

అత్యంత కఠినమైన సామాజిక క్రమం ఉండే చైనాలో ఇటువంటి 'అరుదైన' నిరసనలు వ్యక్తం కావడం ఒకరకంగా విశేషమే. ముఖ్యంగా జిన్ జియాంగ్ ప్రావెన్స్‌కు చెందిన ఉరుమ్‌కిలోని ఒక పెద్ద అపార్ట్‌మెంట్‌లో గత నవంబర్ 24న అగ్ని ప్రమాదం సంభవించిన తర్వాత దేశంలోని వివిధ విశ్వవిద్యాలయాలకు చెందిన విద్యార్థుల్లో నిరసనలు తీవ్రస్థాయికి చేరుకున్నాయి. కేవలం 'జీరో కొవిడ్' విధానం, దానిలోని అమానుష ఆంక్షల వల్లనే ఈ అగ్ని ప్రమాదంలో పది మంది నిస్సహాయంగా మరణించడానికీ, మరో తొమ్మిది మంది గాయ పడడానికీ కారణమయ్యాయని ప్రజలు ఆరోపిస్తున్నారు. 'కొవిడ్ నిబంధనల' పేరుతో భవనం చుట్టూ అమర్చిన బ్యారికేడ్ల వల్ల అగ్నిమాపక సిబ్బంది నిస్సహాయంగా ఉండిపోవాల్సిరావడంతో సమయానికి సహాయం అందక ప్రాణనష్టం జరిగిందన్న వాస్తవం ప్రజానీకంలో ఆగ్రహాన్ని పెంచింది.

నిజానికి ఉరుమ్‌కి నగరంలో సుదీర్ఘకాలంలో కొవిడ్ నిబంధనలు అమలవుతున్నాయి. 'జీరో కొవిడ్' విధానం పేరుతో ప్రభుత్వం ఈ ఆంక్షలను మరింత కఠినతరం చేసింది. ఈ నిబంధనల పట్ల ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. ఈ నేపథ్యంలో చైనాలో అత్యంత ప్రాచుర్యంలో ఉన్న సోషల్ మీడియా వేదికలైన 'వుయ్‌బో', 'వుయ్‌చాట్' ద్వారా ప్రజలు తమ అసంతృప్తిని పెద్దఎత్తున వ్యక్తం చేస్తున్నారు. ఆర్థిక వ్యవస్థను తీవ్రంగా దెబ్బతీయడమే కాకుండా, తమ జీవితాలను అస్తవ్యస్తం చేస్తున్న 'జీరో కొవిడ్' విధానాన్ని తక్షణమే ఎత్తేయాలని ప్రజలు డిమాండ్ చేయడమే కాదు, ఉరుమ్‌కి అపార్ట్‌మెంట్ బాధితులను ప్రభుత్వమే ఆదుకోవాలని కూడా సోషల్




మీడియా వేదికల ద్వారా కోరుతున్నారు. అపార్ట్‌మెంట్‌లో అగ్నిప్రమాదం జరిగిన రోజున, సోషల్ మీడియా వేదికల్లో, ప్రభుత్వం అత్యంత సున్నితంగా పరిగణించే అంశాలపై అభిప్రాయాలు ట్రోల్ కావడం నిజంగా ఆశ్చర్యకరమే. అంతేకాదు చైనా సోషల్ మీడియాలో ఈ విషయంపై చర్చలు జరగడం అత్యంత అరుదైన విషయం!

**ఉత్ప్రేరకంగా పనిచేసిన ఉరుమ్‌కి సంఘటన**

చైనాలో నిరసనలు అరుదైనవేం కావు. కార్మిక, ఆస్తులు, ఆర్థిక సమస్యలపై నిరసనలు జరగడం చాలా సహజం. కాకపోతే అవి కొన్ని ప్రాంతాలకు మాత్రమే పరిమితమయ్యేవి. ప్రస్తుతం కేవలం ఒకే ఒక్క అంశం దేశవ్యాప్తంగా ఆగ్రహం వ్యక్తం కావడానికి కారణమవుతుండటం విశేషం. అదే జిన్‌పింగ్ అనుసరిస్తున్న 'జీరో కొవిడ్' విధానం. అయితే ఉరుమ్‌కి సంఘటన ప్రజల్లో రగులుతున్న కోపాగ్ని మరింతగా ప్రజ్వరిల్లడానికి ఒక ఉత్ప్రేరకంగా పనిచేసిందనే చెప్పాలి.

నవంబర్ 26న షాంఘై నగరంలోని ఉలుమ్‌కి రోడ్డులో (దీనికే ఉరుమ్‌కి అని పేరుంది) చైనా కమ్యూనిస్టు పాలన చరిత్రలో ఒక అరుదైన నిరసన వ్యక్తమైంది. 'కమ్యూనిస్టు పార్టీ గద్దె దిగాలి', 'జిన్‌పింగ్ పదవి నుంచి తప్పుకోవాలి' అన్న నినాదాలు ఇక్కడ వినిపించడం ఎంతో మందిని ఆశ్చర్యానికి గురిచేసిన అంశం. ఈవిధంగా షాంఘై నగరంలో వందలాది మంది ప్రదర్శనకారులు వీధుల్లోకి రావడంతో అప్రమత్తమైన పోలీసులు వీరందరినీ బలవంతంగా క్వారంటైన్ కేంద్రానికి తరలించడం మరో సంఘటన. లాక్‌డౌన్ వల్ల నగర ప్రజలు నిత్యావసరాలు, మందులు ఇతర అవసరాల కోసం బయటకు రావడం కుదరడం లేదు. వారాల తరబడి ఇదే పరిస్థితి కొనసాగడం వారిలో తీవ్ర అసహనాన్ని, అసంతృప్తిని రగిల్చి, చివరకు ఆందోళనకు దారితీసింది. అదే విధంగా నవంబర్ 27 రాత్రి, బీజింగ్ నగరంలో వందలాది మంది నిరసనకారులు 'పత్రికా స్వేచ్ఛ' కోరుతూ నినాదాలు చేయడం, చెంగ్డూలో 'చైనాకు ఇప్పుడు చక్రవర్తి అవసరం లేదు' అనే నినాదాలు వినిపించడం, చైనా ప్రజల్లో స్వేచ్ఛ పట్ల గూడుకట్టుకున్న మక్కువను వెల్లడిస్తున్నాయి. ఇవన్నీ రాజ్యాంగాన్ని సవరించి మూడోసారి అధికార పీఠాన్ని హస్తగతం చేసుకున్న జిన్‌పింగ్‌కు వ్యక్తమవుతున్న వ్యతిరేకతకు ప్రత్యక్ష నిదర్శనాలని వేరే చెప్పాల్సిన అవసరం లేదు. గంగ్‌ఝూవూలో ప్రజలు 'ఏవిధమైన సంకెళ్లు లేని స్వేచ్ఛ కోసం నా జీవితం పడుతున్న ఆరాటాన్ని నువ్వు అర్థం చేసుకుంటావనుకోవడం లేదు' అనే అర్థంతో వచ్చే పాటను కాంటొనీస్ భాష (సైనో-టిబెటన్ భాష)లో పాడుతూ తమ నిరసన తెలిపారు. సరిగ్గా 1989లో తియానెన్మెన్ స్క్వేర్ వద్ద 59 ట్యాంకులకు ఎదురుగా ధైర్యంగా నిలబడి నిరసన తెలిపిన ఒక గుర్తు తెలియని ఆందోళనకారుడిని (ట్యాంక్‌మాన్)ను గుర్తుచేసే విధంగా ఇప్పుడు పోలీసు జీపునకు ఎదురెళ్లి ముగ్గురు నిరసన తెలపడం, వారిని పోలీసులు అరెస్ట్ చేయడం వెంటవెంటనే జరిగిపోయాయి. దీనికి సంబంధించిన వీడియో కూడా చైనాలో వైరలైంది.

చైనా ప్రజల్లో ప్రభుత్వమంటే భయం కంటే, గూడుకట్టుకున్న తీవ్ర అసహనం ఎక్కువని ఈ పరిణామాలు వెల్లడిస్తున్నాయి. ఒక్క మాటలో చెప్పాలంటే, చైనా ప్రజలు 'కమ్యూనిస్టు ప్రభుత్వ పాలన కింద బానిసత్వపు సంకెళ్ల నుంచి బయటపడేందుకు చేస్తున్న పోరాటం ఇది'. బానిసలా బతకొద్దు, పౌరుడిగా బతుకు అన్న నినాదం వినిపిస్తున్నది. ప్రస్తుతం దేశంలో నిరసనలు, ఆందోళనలు కొనసాగుతున్న తరుణంలో అత్యంత సున్నితమైన, ప్రభుత్వానికి ఆగ్రహం తెప్పించే 1989 తియనాన్మెన్ స్క్వేర్ వద్ద ఆందోళన సంఘటన గురించి కూడా ప్రజలు ధైర్యంగా చర్చించుకోవడం మరో విశేషం. అంతేకాదు ఉరుమ్‌కి ప్రమాదంలో పది మంది మృతి చెందిన సంఘటనకు బాధ్యత వహిస్తూ ప్రభుత్వం క్షమాపణలు చెప్పాలని కూడా

కొవిడ్ నిబంధనలను తొలగిస్తే, 160 నుంచి 280 మిలియన్ ప్రజలకు వైరస్ సోకి, 1.3 నుంచి 2.1 మిలియన్ ప్రజల మరణాలకు దారితీయవచ్చు. ముఖ్యంగా వ్యాక్సినేషన్ చేయని వృద్ధుల్లో మరణాల సంఖ్య అధికంగా ఉంటుందని ఈ అధ్యయనం స్పష్టం చేసింది. ప్రభుత్వ కఠిన వైఖరికి ఇది ప్రధాన కారణం. ఈ నేపథ్యంలో వచ్చే ఏడాది మార్చి, ఏప్రిల్ వరకు చైనాలో లాక్‌డౌన్ ఇదే విధంగా కొనసాగుతాయన్నది సర్వత్రా వ్యక్తమవుతున్న అభిప్రాయం. ఇదే సమయంలో, లాక్‌డౌన్ వల్ల తమ జీవితాలు అస్తవ్యస్తమవుతున్నాయని యువకుల్లో ఆందోళన వ్యక్తమవుతుండటం కూడా సహజమే. జీరో కొవిడ్ విధానం పుణ్యమాని దేశంలో లక్షలాది మంది ప్రజలు నెలల తరబడి తమ ఇళ్లకే పరిమితం కావాల్సి వస్తోంది. కొవిడ్ వైరస్ కనిపించి నాలుగేళ్లయినా, ఆ వైరస్ వ్యాప్తి నిరోధానికి ఇంకా సతమతమవుతున్న దేశం ఒక్క చైనానే! ఇతర దేశాలను కొవిడ్ అతలాకుతలం చేసినప్పటికీ, ఇప్పుడు ఆయా దేశాలు వైరస్ బారి నుంచి బయటపడి, క్రమంగా సాధారణ స్థితికి చేరుకుంటే, చైనాలో అందుకు భిన్నమైన పరిస్థితి నెలకొనడం విచిత్రం!



నిరసనకారులు డిమాండ్ చేస్తున్నారు.

**కప్పిపుచ్చే యత్నం**

దేశంలో నిరసనలు ప్రారంభమైన కొద్ది గంటల వరకు ప్రభుత్వ మీడియాలో వీటికి పెద్దగా చోటు లేకపోయినా ‘విదేశీ శక్తులు’ అనే పడికట్టు మాటలతో కప్పిపుచ్చే యత్నం జరిగింది. ఇదే సమయంలో వివిధ నగరాల్లో పోలీసుల సంఖ్య విపరీతంగా పెరిగింది. నిరసనల్లో పాల్గొన్న వారిని గుర్తించే జీపీఎస్, ఫోన్ సర్వీసుల ద్వారా ప్రయత్నాలు చేసింది. అయితే కోవిడ్ నిబంధనలను నిరసిస్తూ షాంఘై నగరంలో నవంబర్ 27న ప్రారంభమైన నిరసనలు చాలా వేగంగా ఇతర నగరాలకు వ్యాపించాయి. కేవలం కొద్ది గంటల్లోనే సోషల్ మీడియా పుణ్యమాని ఇవి ఏడు నగరాలకు విస్తరించడమే కాదు, నిరసన కారులు పోలీసులతో ఘర్షణలకు దిగిన దృశ్యాలు ఆవిష్కృతమయ్యాయి. దేశ రాజధాని బీజింగ్ సహా, డజన్ల కొద్దీ విశ్వవిద్యాలయాలకు చెందిన విద్యార్థులు వీధుల్లోకి వచ్చారు. మావో తర్వాత అత్యంత శక్తిమంతుడిగా పేరుపొందిన జిన్‌పింగ్‌కు వ్యతిరేకంగా ఈ ఆందోళనలు జరగడమే చైనాలో చోటు చేసుకున్న అసాధారణ పరిణామం. తర్వాత క్రమంగా సోషల్ మీడియాలో ప్రసారమైన వీడియోల ప్రకారం దేశంలోని 50 యూనివర్సిటీలకు చెందిన విద్యార్థులు ఆందోళనల్లో పాల్గొన్నట్టు తెలుస్తోంది. తూర్పున నాన్‌జింగ్, దక్షిణాన గంగ్‌ఝౌ, ఉత్తరాన బీజింగ్‌ల్లో తెల్లటి రక్షణ దుస్తులు ధరించిన నిరసనకారులు బ్యారికేడ్లు ధ్వంసం చేస్తూ పోలీసులతో తలపడుతున్న దృశ్యాలు సోషల్ మీడియాలో విపరీతంగా వైరల్ అయ్యాయి. చెంగ్డూ, దాలి, లాన్‌ఝువు వంటి నగరాల్లో కూడా ఇటువంటి ప్రదర్శనలే కనిపించాయి. నవంబర్ 27న బీజింగ్‌లోని ప్రఖ్యాత సింఘువా యూనివర్సిటీ విద్యార్థులు ఉరుమ్‌కి మృతులకు నివాళులు అర్పిస్తూ ప్రదర్శన జరిపారు.

**ఒకే గళంతో నిరసన**

చైనాలో ఇటువంటి ప్రదర్శనలు 1919, మే నెలలో, 1989 తియానాన్మెన్ స్క్వేర్ వద్ద మాత్రమే చోటుచేసుకున్నాయి. ఇప్పటివరకు కమ్యూనిస్టు ప్రభుత్వం తమను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తుందన్న భయంతో ప్రజలు ఎక్కువగా ప్రదర్శనల్లో పాల్గొనకపోవడం జరిగేది. ఎందుకంటే ఇప్పటికే వారు ప్రభుత్వ నిబంధనల పుణ్యమాని అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఒకవేళ అటువంటి ఆందోళనలు జరిగితే, ప్రభుత్వం కఠినంగా అణచివేయడమో లేక అవి పెద్దగా ప్రాచుర్యంలోకి రాకపోవడమో జరిగేది. కానీ ఈసారి పరిస్థితి అందుకు భిన్నం. గడచిన కొన్ని రోజులుగా దేశవ్యాప్తంగా ప్రజలు ఒకే గళంతో ప్రభుత్వంపై ఎదురుతిరగడం ప్రపంచవ్యాప్తంగా ఆశ్చర్యానికి గురిచేస్తున్న అంశం. తాజా పరిణామాలు చైనా ప్రజలు, జిన్‌పింగ్‌ను నియంతగా చూడడానికి అంగీకరించడం లేదని స్పష్టం చేస్తున్నాయి. గతంలోని నిరసనలు కేవలం వలస కార్మికులు, వేరేచోట గృహాలు కేటాయించినవారు తమకు కలుగుతున్న ఇబ్బందులకు వ్యతిరేకంగా చేసే ఆందోళనలకే పరిమితం. ఇందులో మధ్యతరగతి ప్రజలు పాలుపంచుకునేవారు కాదు. కానీ ప్రస్తుతం చైనా మధ్యతరగతి ప్రజలు కూడా రోడ్డెక్కడం కీలకాంశం. నిజానికి 1989 నాటి ఆందోళనకు, ఇప్పటి ప్రజల వ్యతిరేకతకు అసలు పోలిక లేకపోయినప్పటికీ, కమ్యూనిస్టు ప్రభుత్వానికి ఎదురైన అతిపెద్ద సవాలుగా దీనిని పరిగణించవచ్చు. ప్రస్తుతం సంపూర్ణ మెజారిటీ, సాంకేతిక ఆధిపత్యాన్ని కలిగిన సీసీపీకి ఈ ఆందోళనలను కఠినంగా అణిచి వేస్తామన్న ధైర్యం ఉండవచ్చు. కానీ తమ విధానాలు సాధారణ ప్రజల్లో ఎంతటి తీవ్రస్థాయి వ్యతిరేకతకు దారితీస్తాయనేది చైనా పాలకులకు అర్థమయ్యే ఉండాలి. జిన్‌పింగ్ అధికారంలోకి వచ్చిన తర్వాత ‘చైనా పునరుజ్జీవం’ క్రమంగా ధ్వంసమవుతూ వస్తోంది. ప్రస్తుతం ఆందోళనలు విస్తరిస్తున్న తీరు చూస్తుంటే, దీన్ని అణచి వేయడంలో ప్రభుత్వం ఎంతమేర విజయం సాధిస్తుందనేది ప్రశ్నార్థకమే. ప్రస్తుత పరిణామాలు చైనా, జిన్‌పింగ్‌ల ప్రతిష్ఠను మసకబారుస్తున్నాయన్నది మాత్రం అక్షరసత్యం.



జిన్‌పింగ్

**ప్రపంచ దేశాల ఆసక్తి**

చైనాలో కొనసాగుతున్న నిరసనలు క్రమంగా ప్రపంచ దేశాల దృష్టిని ఆకర్షిస్తుండటం విశేషం. నవంబర్ 28న ఐక్యరాజ్య సమితి ఒక ప్రకటన చేస్తూ, ప్రదర్శనకారుల న్యాయబద్ధమైన హక్కులను కాపాడాలని చైనాను కోరింది. ప్రస్తుతం చైనాలో మధ్యతరగతి ప్రజలు, యాపిల్ సరఫరాదారు ఫాక్స్‌కాన్‌కు చెందిన బ్లూ-కాలర్ శ్రామికులు కోవిడ్-19 నిబంధనలకు వ్యతిరేకంగా ఏకతాటిపైకి వచ్చి ఉద్యమించడం జిన్‌పింగ్ నేతృత్వంలోని కమ్యూనిస్టు ప్రభుత్వానికి కొరుకుడు పడని అంశంగా మారింది. విచిత్రమేమంటే ప్రజల్లో నిరసనలు ఒకేసారి కాకుండా, క్రమంగా విస్తరిస్తుండటం తాజా పరిణామంలోని ప్రత్యేకత. లాక్‌డౌన్ నిరసనలు రాజకీయ మార్పును, పత్రికాస్వేచ్ఛను డిమాండ్ చేయడం ఇప్పుడు జిన్‌పింగ్‌కు విషమ పరీక్షను పెడుతున్నాయి. ఎంతోకాలంగా అపరిష్కృతంగా ఉన్న తక్కువ వేతనాలకు వ్యతిరేకంగా కూడా ఈ నినాదాలు తోడు కావడం కమ్యూనిస్టు ప్రభుత్వాన్ని ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి.

బీజింగ్‌లోని సింఘువా యూనివర్సిటీ విద్యార్థులు ‘ప్రజాస్వామ్య అనుకూల గళం’ వినిపించడం 1989 నాటి తియానన్మెన్ సంఘటన తాలూకు జ్ఞాపకాలు.. కమ్యూనిస్టు ప్రభుత్వాన్ని నీడలా వెంటాడుతున్నాయన్న సత్యాన్ని వెల్లడిస్తున్నాయి. అంతేకాదు ‘తెల్ల పేపర్ల’తో నిరసన తెలపడం, ఆందోళనకారుల్లో సృజనాత్మకతను మరోసారి బయటపెట్టాయి. ప్లకార్డుల ప్రదర్శన నిషేధం కాబట్టి, తెల్లపేపర్ల ప్రదర్శన ద్వారా ఆందోళనకారులు ‘ఆగ్రహం తీవ్రం.. అరెస్టు అసాధ్యం’ అంటూ ప్రభుత్వాన్ని హెచ్చరిస్తున్నారు. ఇంత జరుగుతున్నా జిన్‌పింగ్ నేతృత్వంలోని అగ్రనాయకత్వం ‘జీరో కోవిడ్” విధానాన్ని విడనాడటానికి ఎంతమాత్రం సుముఖంగా లేకపోవడం మొండిపట్టుకు నిదర్శనం. 20వ కాంగ్రెస్ సమావేశాలు మార్పులకు దోహదం చేస్తాయన్న ఆశ ప్రజల్లో ఉండేది. కానీ, జిన్‌పింగ్ మళ్లీ అధికారంలోకి రావడం, విధానాల్లో ఎటువంటి మార్పులు లేకపోవడం వారిలో తీవ్ర నైరాశ్యానికి దారితీసింది. జెన్‌ఘావు నగరంలోని ఐఫోన్ ఫ్యాక్టరీలో వరుసగా ఐదురోజుల పాటు లాక్‌డౌన్ విధించడం, జెన్‌ఘావుకు చెందిన ఎనిమిది జిల్లాల్లో ‘హైరిస్క్’ అపార్ట్‌మెంట్ల చుట్టూ బ్యారికేడ్లను ఉంచి ప్రజలను బయటకు రాకుండా నిషేధించడంతో అరవై లక్షలమంది ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. ముఖ్యంగా కరోనా రిస్క్ చాలా తక్కువ ఉన్నప్పటికీ, కఠిన నిబంధనలు వీరిని ఆగ్రహానికి



**జమలాపురపు విఠల్‌రావు**
సీనియర్ జర్నలిస్ట్

గురిచేశాయి. చైనా ఆగ్నేయ ప్రాంతానికి చెందిన తయారీ హబ్ గన్‌ఝూవు నగరంలోని ప్రజలను కొవిడ్ నెగెటివ్ సర్టిఫికెట్లు లేకుండా బయటకు రాకూడదన్న ఆదేశాలు జారీ అయ్యాయి. ఇక హైఝు జిల్లాలో ప్రజలు బ్యారికేడ్లను ధ్వంసం చేసి బయటకు వచ్చే వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి.

**అంత తేలిక కాదు!**

కొన్ని రోజుల క్రితం వరకు, చైనా వ్యాప్తంగా 60 పట్టణాలు, నగరాల్లో లాక్‌డౌన్ పుణ్యమాని మిలియన్ల కొద్దీ ప్రజలు ఇళ్లకే పరిమితయ్యారు. మూడో సారి దేశాధినేతగా ఎన్నికైన జిన్‌పింగ్‌పై ఈ పరిస్థితి తీవ్ర వత్తిడిని కలుగజేస్తోంది. ప్రస్తుతం కమ్యూనిస్టు ప్రభుత్వం అనుసరిస్తున్న 'డైనమిక్ జీరో–కొవిడ్ విధానం' విజయం అనేది, జిన్‌పింగ్ రాజకీయంగా విజయం సాధించినంత తేలిక కాదనేది వర్తమాన పరిస్థితులు స్పష్టం చేస్తున్నాయి. ఒకవేళ ఇది విఫలమైతే, ఇంతటి ధైర్యశాలిగా పేరుపొందిన జిన్‌పింగ్‌కు నష్టం కలిగించకమానదు. విచిత్రమేమంటే, ప్రపంచంలోని మిగిలిన దేశాలు వ్యాక్సిన్‌లు ఉపయోగిస్తూనే, వైరస్‌తో జీవితాలను ఏవిధంగా గడపాలన్నది నేర్చుకుంటే, చైనాలో అందుకు పూర్తి భిన్నస్థితి నెలకొంది. అసలు వైరస్‌ను సమూలంగా అంతం చేయాలన్న లక్ష్యంతో అనుసరిస్తున్న జీరో–కొవిడ్ విధానం లాక్‌డౌన్‌కు దారితీస్తోంది. లాక్‌డౌన్‌ను కచ్చితంగా అమలు పరచడం, పెద్దఎత్తున వైరస్ పరీక్షల నిర్వహణ, ప్రయాణాలపై విధించిన ఆంక్షల కారణంగా చైనా ఆసుపత్రులకు కొవిడ్ రోగులు వెల్లువెత్తడం ఆగిపోయింది. కానీ దీని ప్రతికూల ఫలితం మరోరూపంలో అంటే నిరుద్యోగం రూపంలో వ్యక్తమవుతోంది. అధికారిక లెక్కల ప్రకారం లాక్‌డౌన్ కారణంగా దేశంలో నిరుద్యోగం ఏకంగా 18.7%కి చేరుకుంది. ఈ ఏడాది మొదట్లో ఇది 20%కి కాస్త అటు ఇటుగా కొనసాగింది. అయితే ఎంతటి సామాజిక, ఆర్థిక వత్తిళ్లు ఎదురైనా ప్రభుత్వం తన జీరో కొవిడ్ విధానం నుంచి వెనక్కి తగ్గడానికి ఇష్టపడటం లేదు. ఇదే సమయంలో ప్రభుత్వం వ్యాక్సినేషన్‌ను తప్పనిసరి చేయకపోవడం గమనార్హం. అంతేకాదు, ప్రజల్లో వ్యాక్సినేషన్‌పై అవగాహన కల్పించేందుకు విస్తృతంగా కార్యక్రమాలను చేపట్టడానికి ప్రభుత్వం అంత ఉత్సాహం చూపడంలేదు. అదీ కాకుండా దేశీయంగా తయారైన వ్యాక్సిన్లనే ఉపయోగించాలన్న దృఢ నిర్ణయంతోనే ప్రభుత్వం ముందుకెళుతోంది. అంతర్జాతీయంగా తయారైన వ్యాక్సిన్లు, చైనా తయారీ వ్యాక్సిన్‌ల కంటే సమర్థవంతంగా పనిచేస్తున్నప్పటికీ ప్రభుత్వం తన నిర్ణయాన్ని మార్చుకోవడం లేదు. ఫలితంగా ప్రపంచంలో ఐదోవంతు జనాభా కలిగిన చైనాలో అంతర్గత జీవనం ఒక పెద్ద 'బుడగ'ను తలపిస్తోంది. ముఖ్యంగా ప్రజల జీవనోపాధులు దాదాపు దెబ్బతిన్నాయి. లాక్‌డౌన్‌ను, ఆంక్షలను ఎంత పకడ్బందీగా అమలు చేస్తున్నా, వైరస్ వ్యాప్తి ఆగడంలేదు. గత అక్టోబర్‌లో జిన్‌జియాంగ్ నుంచి చాలా పశ్చిమ ప్రాంతాలకు రవాణా సౌకర్యాలు నిలిపేసి, లాక్‌డౌన్ అమలు పరచినా వైరస్ వ్యాప్తిని నిలువరించలేకపోయామని ప్రభుత్వ అధికారులే అంగీకరిస్తున్న పరిస్థితి.

**ప్రైవేటు రంగం కుదేలు!**

జీరో కొవిడ్ విధానం ప్రైవేటు రంగంపై ప్రతికూల ప్రభావం చూపుతోంది. ముఖ్యంగా చైనా పట్టణ ఉద్యోగ కల్పనలో 4/5శాతం పాత్ర ప్రైవేటు రంగానిదే. ఆలీబాబా, టెనిసెంట్, దిది వంటి చైనా టెక్ దిగ్గజాలు పెద్దమొత్తంలో లాభాలను కోల్పోవడమే



తెల్లకాగితాలతో నిరసనలు తెలుపుతున్న చైనీయులు

కాకుండా, తమ ఉద్యోగుల నుంచి అసంతృప్తిని ఎదుర్కొంటున్నాయి. చైనాలో జీరో కొవిడ్ విధానం అమల్లో భాగంగా పాక్షిక లేదా పూర్తి లాక్‌డౌన్ పుణ్యమాని జీడీపీలో వృద్ధి నాలుగోవంతు దెబ్బతిన్నది. చైనా తయారీ హబ్ షాంఘై నగరం రెండు నెలలుగా లాక్‌డౌన్‌లో కొనసాగుతోంది. మిగిలిన నగరాల పరిస్థితి ఇంతకంటే భిన్నంగా ఏమీ లేదు. చైనాలో పరిశ్రమల కార్యకలాపాలు ఒక్కసారిగా నిలిచి పోవడంతో, వాటిపై ఆధారపడిన ముఖ్యంగా ఎలక్ట్రానిక్స్, ఆటోమోటివ్ రంగాల పరిశ్రమల్లో ఉత్పత్తి తీవ్రంగా దెబ్బతిన్నది. ఈవిధంగా సరఫరా మార్గాలు వరుసగా దెబ్బతినడంతో ప్రపంచ వ్యాప్తంగా ద్రవ్యోల్బణం పెరగడం మరో విపరిణామం. చైనాలో కొవిడ్ ఆంక్షలు, అమెరికా–చైనాల మధ్య సంబంధాల్లో నెలకొన్న ఉద్రిక్తతలకు తోడు ఉక్రెయిన్ యుద్ధ ప్రభావం ప్రపంచ మార్కెట్లపై ప్రతికూల ప్రభావం చూపుతోంది. చైనా ఆర్థిక వ్యవస్థ కుదేలు కావడంతో విదేశాలకు 140 బిలియన్ డాలర్ల మేర ఎగుమతులు పడిపోయే ప్రమాదం ఏర్పడింది. ముఖ్యంగా హాంకాంగ్, యూఎస్, జపాన్, దక్షిణ కొరియా, జర్మనీ దేశాలు ఈ ప్రతికూల ప్రభావానికి గురవుతాయి. ఎలక్ట్రానిక్స్, ఆటోమోటివ్ రంగాల్లో 1.3 ట్రిలియన్ డాలర్ల మేర చైనా ఉత్పత్తులను ప్రపంచ దేశాలు వినియోగిస్తున్నాయి. ప్రస్తుతం ఈ రంగం దెబ్బతినడంతో ప్రధానంగా దక్షిణ కొరియా, వియత్నాం, భారత్, జర్మనీ దేశాలు ఇబ్బందులు ఎదుర్కొనక తప్పదు. ఇక ఇతర దేశాలకు షిప్పింగ్ కార్యకలాపాలు 2022లో మొత్తం నిదానించాయి. 2022 మార్చి, ఏప్రిల్ నెలల కాలంలో చైనా పోర్టుల్లో నిలిచి ఉన్న కంటైనర్‌షిప్‌ల సంఖ్య బాగా పెరిగింది. అయితే పోర్టుల్లో కార్యకలాపాలు కొనసాగుతుండటం ఒక అదృష్టంగా చెప్పాలి. ఉక్రెయిన్ యుద్ధం కారణంగా వస్తుమార్కెట్‌లో డిమాండ్, సప్లై–డిమాండ్‌ల మధ్య పొంతన లేకపోవడంతో ఉద్రిక్తతలు నెలకొంటున్నాయి. ఆర్థికంగా చైనా పనితీరు నిరాశాజనకంగా ఉండటానికి కొవిడ్ నిబంధనలే కారణమని అంతర్జాతీయ ద్రవ్యనిధి సంస్థ, ప్రపంచ బ్యాంకు వార్షిక సమావేశాలు అభిప్రాయపడటం గమనార్హం. నిజానికి కొవిడ్ మహమ్మారి చైనాపై మాత్రమే కాదు ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై తీవ్రస్థాయిలో ప్రతికూల ప్రభావాన్ని చూపింది.

**భారత్‌పై ప్రభావమెంత?**

కొవిడ్–19 నేపథ్యంలో చైనాలోని వివిధ నగరాల్లో లాక్‌డౌన్ కొనసాగుతుండటం భారత్‌పై ప్రతికూల ప్రభావాన్ని చూపుతున్నాయి. ముఖ్యంగా తయారీ, సరఫరా వ్యవస్థ దెబ్బతినడం ఇందుకు ప్రధాన కారణం. చైనాలో ఈ సరఫరా వ్యవస్థ ఇదే మాదిరి కొనసాగితే, అత్యధిక దిగుమతుల భాగస్వామిగా ఉన్న భారత్‌పై ఈ ప్రభావం తప్పక పడి తీరుతుంది. 2022లో భారత్ మొత్తం దిగుమతులు 609 బిలియన్ డాలర్లు కాగా, ఇందులో చైనా వాటా 15%. అంటే 94.2 బిలియన్ డాలర్లు. అదే 2021లో భారత ఆర్థిక వ్యవస్థ 6.6% మందగించినప్పుడు చైనా నుంచి దిగుమతులు 17% తగ్గిపోయి, 65.2 బిలియన్ డాలర్లు నమోదు చేశాయి. చైనాలో కొవిడ్ తీవ్రత అధికంగా ఉన్నా



భారత్ నుంచి ఎలక్ట్రానిక్ వస్తువులకు డిమాండ్ తగ్గకపోగా పెరగడం గమనార్హం. చైనా నుంచి 16 రకాల వస్తువులు ప్రధానంగా భారత్ దిగుమతి చేసుకుంటున్నది. కేవలం వీటి కారణంగానే మనదేశం చైనాకు అతిపెద్ద దిగుమతి భాగస్వామిగా కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో చైనా నుంచి దిగుమతులు మందగిస్తే, ఇప్పటికిప్పుడు ఆ లోటును భర్తీ చేయడం భారత్‌కు కష్టం. ముఖ్యంగా మనదేశంలోని తయారీ పరిశ్రమకు అవసరమైన, ఎలక్ట్రానిక్ వినియోగ వస్తువుల సరఫరా వ్యవస్థ దెబ్బతింటుంది. కేవలం ఈ కారణంగానే చైనా నుంచి దిగుమతులను తగ్గించుకోవడం భారత్‌కు సాధ్యం కావడంలేదు. మరి భారత్ ఎగుమతుల విషయానికి వస్తే ఈ ఏడాది జనవరి–మార్చి మధ్యకాలంలో 30.3% క్షీణించాయి. విచిత్రమేమంటే చైనా నుంచి డిమాండ్ తగ్గడం వల్ల మన ఎగుమతులు మందగించిన ప్రభావం పెద్దగా కనిపించలేదు. ఎందుకంటే 2022లో చైనాకు మన ఎగుమతులు 5.1% మాత్రమే!

**పెట్టుబడుల లక్ష్యంగా భారత్!**

చైనా లాక్‌డౌన్ పుణ్యమాని భారత్‌కు పెట్టుబడుల విషయంలో ప్రయోజనం కలిగే అవకాశాలు మెండుగా కనిపిస్తున్నాయి. సానుకూల అభివృద్ధి, ద్రవ్యోల్బణం అదుపులో ఉన్న నేపథ్యంలో భారత్‌లో పెట్టుబడులకు సానుకూల వాతావరణం ఉన్నదని, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా నివేదిక పేర్కొంది. ప్రపంచ వ్యాప్తంగా వివిధ దేశాల్లో సానుకూల పరిస్థితులు లేకపోవడంతో, భారత్‌కు ప్రత్యామ్నాయం మరొటి కనిపించడంలేదు. చైనాలో నిర్మాణ రంగం పూర్తిగా దెబ్బతినడం కూడా దీర్ఘకాలంలో భారత్‌కు ప్రయోజనకరంగా మారుతుందని అంచనా. అదీ కాకుండా చైనాలో ఇళ్ల కొనుగోలుదారులు రుణాలు తిరిగి చెల్లించబోమని తెగేసి చెబుతుండటం పెద్ద సమస్యగా మారింది. దీని ఫలితంగా ప్రాపర్టీ ప్రాజెక్టులు నిలిచిపోతున్నాయి. ఇది దేశాన్ని పెను రుణ సంక్షోభంలోకి నెట్టే ప్రమాదం పొంచి ఉంది. ముఖ్యంగా చైనాలో అతిపెద్ద నిర్మాణ కంపెనీ ఎవర్‌గ్రాండ్ గ్రూపు రుణాలు తిరిగి చెల్లించలేని స్థితికి దిగజారిపోయింది. దీని ప్రభావం దేశంలోని పెద్ద, మధ్య తరహా కంపెనీలపై పడుతోంది. గత పదేళ్లకాలంలో చైనాలో మొట్టమొదటిసారి రియల్ ఎస్టేట్ రంగానికి ఇచ్చే బ్యాంకు రుణాలు తగ్గిపోయాయి. చైనా జీడీపీలో నిర్మాణ రంగం వాటా 20%. ఎన్నో ఏళ్లుగా చైనా వృద్ధికి నిర్మాణరంగం చోదకశక్తిగా కొనసాగుతోంది. 2016 నుంచి ఈ రంగం క్రమంగా క్షీణతను నమోదు చేసినా, కొవిడ్ సమయంలో ఒక్కసారిగా కుదేలైంది. ఇదిలా ఉండగా చైనాలో మరోకొత్త సమస్య జనాభా వృద్ధి పడిపోవడం! ప్రస్తుతం జపాన్ ఎదుర్కొంటున్న పరిస్థితే చైనాలో కూడా ఏర్పడితే కుటుంబాలు కుంచించుకొనిపోయి కొత్త సమస్యలకు దారితీస్తుందన్న భయాలు వ్యక్తమవుతున్నాయి. చైనా పరిస్థితి ఈవిధంగా ఉంటే భారత్‌లో పరిస్థితి ప్రస్తుతం పూర్తి భిన్నంగా ఉంది. ఈ ఏడాది జనవరి–జూన్ మధ్య కాలంలో దేశంలో ఇళ్ల అమ్మకాలు గరిష్ట స్థాయిలో జరిగాయి. ఇందుకు ఇళ్ల ధరలు అందుబాటులో ఉండటం, తక్కువ వడ్డీరేట్లు, వీటికి తగ్గట్టు ఇళ్లకు డిమాండ్ ఉండటం ప్రధాన కారణాలు.




రష్యా–ఉక్రెయిన్ యుద్ధం, తైవాన్‌పై దురాక్రమణకు చైనా యత్నాల నేపథ్యంలో యూఎస్ నేతృత్వంలోని పశ్చిమ దేశాల వైఖరుల్లో మార్పులు వచ్చాయి. ముఖ్యంగా చైనాపై ఆధారపడటాన్ని తగ్గించాలన్న నిర్ణయానికి వచ్చాయి. భారత్ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. ముఖ్యంగా తయారీ రంగాన్ని బలోపేతం చేస్తే, విదేశీ పెట్టుబడులను పెద్దఎత్తున ఆకర్షించవచ్చు. ఆవిధంగా ‘ప్రపంచ తయారీ హబ్’గా మనదేశం రూపొందవచ్చు. చైనాలోని యాపిల్ కంపెనీ ఐఫోన్–14 మోడల్ తయారీని భారత్‌కు తరలించాలని నిర్ణయించడం, కొవిడ్ నిబంధనల కారణంగా ఫాక్స్‌కాన్ కంపెనీలో నెలకొన్న సంక్షోభం నేపథ్యంలో చెన్నైలోని తన కేంద్రానికి తయారీని బదిలీ చేయాలని ఆ కంపెనీ యోచిస్తున్నదన్న వార్తలు భారత్‌కు సానుకూలమైనవే. చైనా సంక్షోభం వల్ల చోటు చేసుకునే మరో ముఖ్య పరిణామం అంతర్జాతీయంగా చమురు ధరలు తగ్గడం. ఒకవేళ చమురు ధరలు తగ్గితే, మనదేశానికి చమురు బిల్లు తగ్గుతుంది. ఇది రూపాయిపై వత్తిడి తగ్గించి, ఫారెక్స్ నిల్వలు పెరగడానికి దోహదం చేయగలదు. ఆసియాలో భారత్ ఎదుగుదలను ఎంతమాత్రం ఓర్వని చైనా, తన స్వీయ తప్పిదాల కారణంగా క్రమంగా సంక్షోభంలో కూరుకుపోతోంది. జిన్‌పింగ్ ‘జీరో కొవిడ్ విధానం’ ఆ దేశాన్ని ఆర్థికంగా నిండా ముంచుతోంది. అమెరికా–చైనాల మధ్య నెలకొన్న సంఘర్షణ వాతావరణం, రష్యా–ఉక్రెయిన్ యుద్ధం వంటి అంతర్జాతీయ పరిణామాలు భారత్‌కు క్రమంగా సానుకూల పరిస్థితులను కల్పిస్తున్నాయి. మన ప్రభుత్వం కూడా ఈ పరిణామాల వల్ల కలిగే ప్రయోజనాలను అందిపుచ్చుకునేందుకు సర్వసన్నద్ధంగా ఉన్నదనడంలో ఎంతమాత్రం సందేహం లేదు. ★

**'పాముకు పాలు పోసి పెంచినా కాటేస్తుంది' అని నానుడి. ఇప్పుడు వైరస్ విషయంలోను, చైనా విషయంలోను ఇదే రుజువైంది. చైనా తను పెంచి పోషించిన నాగు తననే కాటు వేసింది. ఈ విషయాన్ని ఎక్కువ కాలం దాచి ఉంచలేమన్న వాస్తవమే కాదు, దేశంలో పెల్లుబుకుతున్న కొవిడ్ నిబంధనల వ్యతిరేకోద్యమం నుంచి కూడా తనను తాను రక్షించుకునే పనిలో చైనా పడిపోయింది. మూడేళ్ల క్రితం కొవిడ్ పతాకస్థాయిలో ఉన్నప్పుడు దాని సృష్టికర్త చైనాయేనంటూ తీవ్ర ఆరోపణలు వచ్చాయి. ఇప్పుడు మరొకసారి అదే ఆరోపణ తెర మీదకు వచ్చింది. కొవిడ్-19 వైరస్ చైనాలో ఉన్న ఊహాన్ వైరాలజీ ఇన్‌స్టిట్యూట్ నుంచే వెలువడింది. ఇది నిజం. కానీ ఈసారి మాత్రం జాగ్రత్తలు సరిగా పాటించని కారణంగా పొరపాటున వైరస్ విడుదలైందని మాత్రం ఒక సవరణ కనిపించింది. పొరపాటు సరే. అసలు ఇలాంటి ఒక ప్రాణాంతక వైరస్‌ను ఎందుకు తయారు చేయవలసి వచ్చింది? దానికైనా చైనా సమాధానం ఇవ్వవలసి ఉంటుంది. కానీ ఈ పాపంలో అమెరికాకు కూడా భాగం ఉందని చెప్పడమే కొత్త విషయం. ఈ సంగతి చెప్పినవారు అమెరికా శాస్త్రవేత్త. ఇంతకీ ఈ శాస్త్రవేత్త ఒకప్పుడు అదే ఊహాన్ ప్రయోగశాలలో పనిచేశారు.**




# కొవిడ్: డ్రాగన్ పాలు పోసి పెంచిన నాగు

కొవిడ్ బాధల నుంచి, కఠిన ఆంక్షల నుంచి ప్రపంచం మొత్తం దాదాపు విముక్తమయింది. జపాన్ మాత్రం మళ్లీ ఏదో విడత కొవిడ్‌ను ఎదుర్కొంటున్న దన్న వార్తలు వచ్చాయి. అది అలా ఉంచితే కొన్ని దేశాలు మాస్క్‌ల వినియోగాన్ని సైతం నిలిపివేశాయి. మార్కెట్లు, హోటళ్లు, కళాశాలలు సాధారణ స్థాయికి చేరాయి. సామాజిక దూరం నిబంధన కూడా దాదాపు లేదు. కానీ నాలుగేళ్ల తరువాత కూడా చైనాలో కొన్ని ప్రాంతాలలో లాక్‌డౌన్ అమలవు తున్నది. అది కూడా కమ్యూనిస్టు ప్రభుత్వం శైలిలో కర్కశంగా, అమానుషంగానే ఉన్నది. దీనికి వ్యతిరేకంగా కొన్ని రోజులుగా అక్కడ ప్రజలు ఆగ్రహావేశాలు వ్యక్తం చేస్తున్నారు. 1989 నాటి తియనాన్మెన్ స్క్వేర్ అలజడిని ఇవి గుర్తు చేస్తున్నాయని ప్రపంచం అభిప్రాయపడుతున్నది. ఈ అలజడులకు భయపడి ఆందోళనకారులకు కమ్యూనిస్టు ప్రభుత్వం పెద్ద పెద్ద శిక్షలు విధిస్తున్నది. ఇక ప్రభుత్వ హింస సరేసరి. కరోనా వైరస్‌ను ఎదుర్కొనడంలో అధ్యక్షుడు జీ జిన్‌పింగ్ అసమర్థంగా వ్యవహరించారని ప్రజలు ఘోషిస్తు న్నారు. ఏమైనా చైనాతో ప్రపంచం ఇప్పటికే ఎదుర్కొంటున్న బెడద కరోనాతో, కరోనా తరువాతి పరిణామాలతో మరింత తీవ్రమైందని ప్రపంచ దేశాలు భావిస్తున్నాయి.

'జీరో కొవిడ్' పేరుతో విశ్వవిద్యాలయాలలో అమలు చేస్తున్న కఠిన నిబంధనలకు వ్యతిరేకంగా విద్యార్థులు ఆందోళనలకు దిగారు. ఊహాన్ విశ్వవిద్యాలయం అలజడులతో అట్టుకుతున్నది. వారంతా సమాచారంలో, పరిపాలనలో పారదర్శకత ఉండాలంటూ నినదిస్తున్నారు. అడ్డూ ఆపూ లేకుండా సాగుతున్న కొవిడ్ పరీక్షలు, నిబంధనల పేరుతో విశ్వవిద్యాలయ ప్రాంగణాలలో కనీసం ఆహారం లేకుండా చేయడం పట్ల కూడా వారు ఆక్రోశం వెళ్లగక్కుతున్నారు. నిజానికి కొన్ని రోజుల క్రితం నుంచే చాలా నగరాలలో విద్యార్థులు ఆందోళనలు చేస్తున్నారు. కొందరు జీ జిన్‌పింగ్ పదవి నుంచి తప్పుకోవాలని కూడా నినదిస్తున్నారు. తాజా వార్తలను బట్టి అంత కరడుగట్టిన చైనా కమ్యూనిస్టు సర్కారు కూడా ఒక్కొక్క మెట్టు దిగిరాక తప్పడం లేదు. అందులో జీరో కొవిడ్ నిబంధనల సడలింపు కూడా ఉన్నది. నిజానికి ఈ ఆగ్రహం వెనుక కొవిడ్ పేరుతో సాగిన నాలుగేళ్ల అణచివేత ఉంది. చైనా అనుసరించిన వ్యాక్సినేషన్ విధానం కూడా అత్యంత నిర్లక్ష్య ధోరణిలో సాగింది. ప్రతి పదిమంది చైనీయులలో ఒక్కరికి మాత్రమే వ్యాక్సినేషన్ అందింది. మొదటి దశ వ్యాక్సిన్ తీసుకున్నవారు 66 శాతం. బూస్టర్ డోస్ తీసుకున్నవారు 40 శాతం. ఇందుకు కారణం, చైనా ఏ విదేశీ వ్యాక్సిన్‌ను అనుమతించకపోవడమే. దేశంలో తయారైన వ్యాక్సిన్‌ను మాత్రమే వినియోగించాలన్నది ఆ దేశం పెట్టుకున్న నిబంధన. కానీ దాని సామర్థ్యం మిగతా దేశాల వ్యాక్సిన్‌లతో పోలిస్తే తక్కువ అని నిపుణులు ఎప్పుడో తేల్చి చెప్పారు. లాక్‌డౌన్ నిబంధనలు, విదేశీ వ్యాక్సిన్ మీద నిషేధం ఇలాగే కొనసాగితే అక్కడ మిలియన్‌ల కొద్దీ మరణాలు సంభవించే అవకాశం ఉందని కూడా నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఆ గణాంకాలు దారుణంగా ఉన్నాయి. ఈ నిబంధనలు, ఆంక్షలు కారణంగా భవిష్యత్తులో 13 లక్షల నుంచి 20 లక్షల వరకు మరణాలు సంభవించవచ్చునని వారు అంచనా వేస్తున్నారు. ఇన్ని సవాళ్లు ఎదురవుతున్నా అధ్యక్షుడు జీ జిన్‌పింగ్ మాత్రం పాశ్చాత్య దేశాల నుంచి వ్యాక్సిన్ దిగుమతి చేసుకోవడానికి అనుమతి ఇవ్వడం లేదు. చివరికి




పెల్లుబుకుతున్న ప్రజాగ్రహం నేపథ్యంలో కొన్ని సడలింపులు చేయక తప్పలేదని వార్తలు వెలువడుతున్నాయి.

ఈ నేపథ్యంలోనే అమెరికా శాస్త్రవేత్త ఊహాన్ గుట్టును మరొకసారి బయటపెట్టారు. అంటే ఇది గబ్బిలాల నుంచి లేదా పందుల నుంచి గాడిదల నుంచి సంక్రమించిన వైరస్ కాదు. మానవ నిర్మిత ప్రాణాంతక వైరస్ అని ఆయన తేల్చినట్టే. నిజానికి ఈయన ఈ విషయాన్ని రెండేళ్ల క్రితమే బయట పెట్టారు. అప్పుడు కూడా 'ది సన్' పత్రిక ఆ వార్తను నివేదించింది. ఇప్పుడు మాత్రం తన అనుభవాలు, వాస్తవాలు జోడించి పుస్తకం రాశారు.

అమెరికాకు చెందిన శాస్త్రవేత్త డాక్టర్ ఆండ్రూ హాఫ్ (ఎపిడిమియాలజిస్ట్) కొవిడ్–19 వైరస్ వ్యాప్తి గురించి తాజాగా కొంత సమాచారం లోకానికి తెలియచేశారు. 'ది ట్రూత్ ఎబౌట్ ఊహాన్' పేరుతో రాసిన పుస్తకంలో కొన్ని అంశాలను వెల్లడించారు. ప్రాణాంతకమైన ఈ జీవశాస్త్ర పరిశోధన కార్యక్రమాన్ని అజాగ్రత్తగా నిర్వహించడం వల్లనే ఇంత విపత్తు ప్రపంచం ఎదుర్కొనవలసి వచ్చిందని ఆయన చెప్పారు. ఈ ప్రయోగానికి అమెరికా కూడా నిధులు ఇచ్చినట్టు కూడా ఆయన ఆరోపిస్తున్నారు. 'ది సన్' పత్రిక ప్రతినిధితో మాట్లాడుతూ ఎకో హెల్త్ అలయెన్స్ అనే ప్రభుత్వేతర శాస్త్ర పరిశోధనల సంస్థ ఈ పరిశోధన కోసం నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హెల్త్ నుంచి నిధులు తీసుకుంది. ఎకో హెల్త్ అలయెన్స్ ఊహాన్ పరిశోధనా సంస్థతో కలసి పనిచేస్తున్నది. ఈ సంస్థకు డాక్టర్ హాఫ్ 2014 నుంచి 2016 మధ్య ఉపాధ్యక్షునిగా పనిచేశారు. కొవిడ్ వైరస్ సంగతులన్నీ మొదటి నుంచి చైనాకు పూర్తిగా తెలుసునని కూడా డాక్టర్ హాఫ్ రాశారు. ఆ దేశం మీద ఆరోపణలు వచ్చినప్పటికీ కొవిడ్ 19 మూలాల గురించి శోధించడానికి చైనా పూర్తి స్థాయిలో అనుమతించని సంగతి తెలిసినదే. ఆఖరికి ఐక్య రాజ్యసమితి ఆధ్వర్యంలో స్వతంత్ర దర్యాప్తు సంస్థ చేత తనిఖీ చేయించడానికి కూడా కమ్యూనిస్టు చైనా సహకరించ లేదు.

చాలా దేశాల ప్రయోగశాలలో జీవ పరిరక్షణ, భద్రతల కోసం సరైన రక్షణ చర్యలు తీసుకునే వ్యవస్థ, విధానం లేవని డాక్టర్ హాఫ్ ఆరోపణ. నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హెల్త్ ఇచ్చే నిధులతో గత దశాబ్ద కాలంగా కొన్ని ప్రయోగశాలలలో కరోనా వైరస్ గురించి పరిశోధనలు జరుగుతున్న విషయాన్ని కూడా ఆయన బయటపెట్టారు. ఊహాన్ ప్రయోగశాలలో డాక్టర్ హాఫ్ పనిచేసిన కాలంలో గబ్బిలాల నుంచి ఇతర ప్రాణులకు సంక్రమించే వైరస్‌ను అదుపు చేయడం గురించి పరిశోధనలు జరిగాయి.

కానీ ప్రాణాంతకమైన జీవ సాంకేతిక శాస్త్ర పరిజ్ఞానాన్ని చైనాకు అమెరికా అందచేయడం కచ్చితంగా తప్పిదమేనని ఆయన అభిప్రాయపడ్డారు. ఇంతకీ ప్రపంచ ప్రఖ్యాతి కోసం శాస్త్రరంగంలో అసాధారణం అనిపించే ఆవిష్కరణలు చేయాలని చైనా కమ్యూనిస్టు ప్రభుత్వం ఊహాన్ ప్రయోగశాల శాస్త్రవేత్తల మీద తీవ్రమైన వత్తిడి తెచ్చిందని ఆయన అంటారు. అయితే ఆ స్థాయిలో ఆవిష్కరణలు జరపడానికి అవసరమైనన్ని నిధులు మాత్రం సంస్థకు అందుబాటులో లేవు.

చైనా చుట్టూ ఉండే మహా కుడ్యం ఎంత గట్టిదైనా, కొన్ని వాస్తవాలు బయటకు రాకుండా ఉండవు. ఇది చక్రవర్తుల పాలన కాదు. కమ్యూనిస్టు చక్రవర్తుల పాలనే అయినా, వాస్తవాలు దాచలేరు. ఇవాళ కాకుంటే భవిష్యత్తులో అయినా వాస్తవం ఏమిటో చైనా ప్రపంచానికి చెప్పక తప్పదు. ఇప్పుడు తన పశుబలంతో దేశ ప్రజలను అణచివేస్తూ ఉండవచ్చు. కానీ, ఇన్ని కోట్ల మందిని బలితీసుకున్న ఆ మహమ్మారిని సృష్టించినందుకు చైనా మూర్ఖ కమ్యూనిస్టులు పశ్చాత్తాపపడక తప్పదు. ★

నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హెల్త్ ఇచ్చే నిధులతో గత దశాబ్ద కాలంగా కొన్ని ప్రయోగశాలలలో కరోనా వైరస్ గురించి పరిశోధనలు జరుగుతున్న విషయాన్ని కూడా ఆయన బయటపెట్టారు. ఊహాన్ ప్రయోగశాలలో డాక్టర్ హాఫ్ పనిచేసిన కాలంలో గబ్బిలాల నుంచి ఇతర ప్రాణులకు సంక్రమించే వైరస్‌ను అదుపు చేయడం గురించి పరిశోధనలు జరిగాయి. కానీ ప్రాణాంతకమైన జీవ సాంకేతిక శాస్త్ర పరిజ్ఞానాన్ని చైనాకు అమెరికా అందచేయడం కచ్చితంగా తప్పిదమేనని ఆయన అభిప్రాయపడ్డారు.



# కశ్మీర్ ఫైల్స్ మీద రాద్ధాంతం
# టూల్ కిట్ కుట్రలో భాగమేనా?

**అతిథిగా వచ్చిన వాడు ఆతిథ్యం ఇచ్చిన వారిని పొగడకున్నా పర్వాలేదు. వ్యతిరేకంగా మాట్లాడకుండా ఉంటే చాలు. వారి గురించి అబద్ధాలు చెప్పాల్సిన అవసరం లేదు. ఇది కనీస మర్యాద, ఇంగిత జ్ఞానం. గోవాలో జరిగిన అంతర్జాతీయ భారతీయ చలనచిత్రోత్సవానికి జ్యూరీ హెడ్‌గా వ్యవహరించిన ఇజ్రాయెల్ దర్శకుడు నడావ్ లాపిడ్‌కు ఈ ఇంగిత జ్ఞానం లోపించి ఏకంగా ఇండియాకు వ్యతిరేకంగా మాట్లాడేశాడు. 'ది కశ్మీర్ ఫైల్స్' చిత్రం మీద అనాలోచిత వ్యాఖ్యలు చేసేశాడు. ఆయన చేసిన పనిని ఇజ్రాయెల్ ప్రభుత్వం ఖండించడంతో పాటు క్షమాపణలు చెప్పుకొని విజ్ఞత చాటుకుంది.**



నడావ్ లాపిడ్

ప్రపంచం ఎదుర్కొంటున్న అతిపెద్ద సమస్య ఉగ్రవాదం. ప్రపంచశాంతికి ఈ సమస్య అతిపెద్ద ముప్పుగా మారింది. ఐక్యరాజ్య సమితితో పాటు చాలా దేశాలు ఉగ్రవాదాన్ని ప్రపంచ శత్రువుగా గుర్తించి, ఈ సమస్యపై అంతర్జాతీయ స్థాయిలో పోరాటం చేయాలనే అభిప్రాయాన్ని పలు సందర్భాల్లో వ్యక్తం చేయడం మనందరికీ తెలుసు. ఉగ్రవాద బాధిత దేశాల జాబితాలో భారత్ పేరు ప్రముఖంగా కనిపిస్తుంది. అందునా మన దేశంలో ఉగ్రవాద బాధితుల్లో మొదటి స్థానం కశ్మీర్ పండితులదే. 1990వ దశకంలో వారిపై సాగిన మారణకాండను 'ది కశ్మీర్ ఫైల్స్' చిత్రం కళ్లకు కట్టినట్లు చూపింది. ఆలాంటి చిత్రంపై విదేశీయులు ఏమైనా మాట్లాడితే వారికి సమస్య అంతగా అర్థం కాలేదని భావించవచ్చు. కానీ మన మిత్ర దేశానికి చెందిన వ్యక్తి తప్పుగా మాట్లాడితే ఎలా సహించగలం? ఇజ్రాయెల్ దర్శకుడు నడావ్ లాపిడ్ చేసిన పని ఇదే.

ప్రతి సంవత్సరం మాదిరిగానే ఈసారి కూడా గోవాలో 53వ అంతర్జాతీయ భారతీయ చలన చిత్రోత్సవం (ఇఫి) అట్టహాసంగా జరిగింది. నవంబర్ 20వ తేదీ నుంచి 28వ తేదీ వరకు నిర్వహించిన ఈ మహోత్సవానికి మన దేశ చలనచిత్ర పరిశ్రమతో పాటు పలు దేశాల చిత్ర పరిశ్రమలకు చెందిన ప్రముఖులు వచ్చారు. 79 దేశాలకు చెందిన 280 సినిమాలు ప్రదర్శించారు. ఇందులో భారత్‌కు చెందిన 25 ఫీచర్ ఫిల్మ్స్‌తో పాటు 20 నాన్–ఫీచర్ ఫిల్మ్స్‌ను 'ఇండియన్ పనోరమ'లో ప్రదర్శిం చారు. 183 చలన చిత్రాలు అంతర్జాతీయ ప్రోగ్రామింగ్‌లో భాగంగా ప్రదర్శించారు. ఇఫి కార్యక్రమాల నిర్వహణతో పాటు ఇక్కడ ప్రదర్శించే చిత్రాలకు సంబంధించిన విషయాలను పర్యవేక్షించడానికి ఒక జ్యూరీ ఉంటుంది. దానికి హెడ్ (నాయకుడు)గా ఇజ్రాయెల్ దర్శకుడు నడావ్ లాపిడ్ వ్యవహ రించారు. అంతర్జాతీయ భారతీయ చలన చిత్రోత్సవం విజయవంతంగా ముగిసినందుకు అందరూ సంతోషంగా ఉన్న సమయంలో ఆతిథ్య దేశమైన భారత్‌ను ఇబ్బంది పెట్టే ఘటన చోటు చేసుకుంది. ఇందుకు స్వయంగా ఇఫి హెడ్ బాధ్యుడు

కావడం విచారకరం.

**విషం కక్కిన నడావ్**

ప్రముఖ దర్శకుడు వివేక్ అగ్నిహోత్రి తెరకెక్కించిన 'ది కశ్మీర్ ఫైల్స్' చిత్రాన్ని అంతర్జాతీయ భారతీయ చలనచిత్రోత్సవంలో భాగంగా నవంబరు 22న ప్రత్యేకంగా ప్రదర్శించారు. 'ఈ సినిమా చూసి దిగ్భ్రాంతి చెందా. ఇది ప్రచారం కోసం తీసిన అసభ్యకర చిత్రం. ఇలాంటి ప్రతిష్ఠాత్మక సినీ మహోత్సవంలో ప్రదర్శించేందుకు ఈ సినిమా తగదు. కళలకు, జీవితానికి అవసరమైన విమర్శ నాత్మక చర్చను ఈ ఫెస్టివల్ ఎప్పటికీ స్వాగతిస్తుంది. అందుకే నేను నా అభిప్రాయాన్ని స్వేచ్ఛగా చెబుతున్నా' అని జ్యూరీ హెడ్ నడావ్ లాపిడ్ ముగింపు వేడుకల్లో చేసిన వ్యాఖ్యలు అందరిని దిగ్భ్రాంతి పరిచాయి.

స్వయాన జ్యూరీ హెడ్ ఇలాంటి వ్యాఖ్యలు చేయడం దుమారం రేపింది. దీంతో ఇఫి జ్యూరీ బోర్డు ఓ ప్రకటన విడుదల చేస్తూ, కశ్మీర్ ఫైల్స్ చిత్రంపై లాపిడ్ చేసిన వ్యాఖ్యలు.. పూర్తిగా ఆయన వ్యక్తిగత అభిప్రాయమేనని, దీనిపై జ్యూరీ బోర్డుకు ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేసింది. 'జ్యూరీ సభ్యులుగా.. ఒక సినిమా సాంకేతికత, నాణ్యత, సామాజిక–సాంస్కృతిక ఔచిత్యాన్ని మాత్రమే మేం అంచనా వేస్తాం. అంతేగానీ సినిమాలపై ఎలాంటి రాజకీయ వ్యాఖ్యలు చేయబోం. ఒకవేళ జ్యూరీ సభ్యులెవరైనా అలా చేస్తే.. అది పూర్తిగా వారి వ్యక్తిగత అభిప్రాయం మాత్రమే' అని జ్యూరీ బోర్డు ప్రకటనలో పేర్కొంది. జ్యూరీ సభ్యుడు సుదీప్తో సేన్ మాట్లాడుతూ, లాపిడ్ వ్యాఖ్యలతో తనకు, జ్యూరీలోని ఇతర సభ్యులకు సంబంధం లేదని ప్రకటించారు. అవి ఆయన వ్యక్తిగతమైనవని తేల్చి చెప్పారు. ఈ వివాదానికి దూరంగా ఉండే ప్రయత్నం చేసింది జ్యూరీ. అయితే నడావ్ లాపిడ్ వ్యాఖ్యలపై తీవ్రస్థాయిలో విమర్శలు వచ్చాయి. కశ్మీరీ పండిట్ల


వివేక్ అగ్నిహోత్రి


అనుపమ్ ఖేర్

బాధల పట్ల ఆయనకు ఎలాంటి విచారం లేదంటూ పలువురు ప్రముఖులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

**ఆ వ్యాఖ్యలు సిగ్గుచేటు: అనుపమ్ ఖేర్**

ఇఫి జ్యూరీ హెడ్ నడావ్ లాపిడ్ 'కశ్మీర్ ఫైల్స్' చిత్రంపై చేసిన వ్యాఖ్యలపై ప్రముఖ నటుడు అనుపమ్ ఖేర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆయన స్వయంగా ఈ చిత్రంలో ముఖ్యపాత్రను పోషించారు. 'యూదులపై దారుణమైన మారణహోమం వంటి బాధలను అనుభవించిన వర్గానికి చెందిన ఓ వ్యక్తి ఇలాంటి వ్యాఖ్యలు చేయడం సిగ్గుచేటు. నాడు యూదులపై నరమేధం నిజమైతే.. కశ్మీరీ పండిట్ల ఊచకోత కూడా నిజమే. దేవుడు ఆయనకు తెలివిని ఇవ్వాలని కోరుకుంటున్నా' వ్యాఖ్యానించారు.

'కశ్మీర్ ఫైల్స్' సినిమాలో వాస్తవాలను చూపించడం కొందరికి రుచించట్లేదంటూ అనుపమ్ ఖేర్ మండిపడ్డారు. 'నిజాలు చూడలేకపోతే.. నోరు మూసుకుని కూర్చోవాల'ని సూచించారు. 'కొందరికి ఉన్నది ఉన్నట్లుగా చూపించే అలవాటు ఉండదు. దాన్ని తమకు ఇష్టమొచ్చినట్లుగా మార్చి చూపిస్తుంటారు. అలాంటి వారు కశ్మీర్ నిజాలను జీర్ణించుకోలేకపోతున్నారు. గత 25–30 ఏళ్లుగా కశ్మీర్‌ను మరో కోణంలో చూపిస్తున్నారు. దాన్ని కశ్మీర్ ఫైల్స్ బహిర్గతం చేసింది. ఇది మా విషాద చరిత్రలో ఒక భాగం. మీకు అది తెలియకపోతే.. ఆ విషాదాన్ని అనుభవించిన వారిని కలిసి తెలుసుకోండి. ఎందుకంటే ఇదే మా కశ్మీర్‌లో జరిగిన నిజం' అని విమర్శలు చేస్తున్న వారిని ఉద్దేశిస్తూ ఇన్‌స్టాగ్రామ్‌లో వీడియో విడుదల చేశారు ఖేర్.

భారత్, ఇజ్రాయెల్.. రెండు దేశాలూ ఉగ్రవాదాన్ని ఎదుర్కొంటున్నాయి అని గుర్తు చేశారు అనుపమ్ ఖేర్. 'కశ్మీరీ హిందువుల బాధను ఇజ్రాయెల్‌లో సామాన్య వ్యక్తి కూడా అర్థం చేసుకోగలరు. అయితే.. ప్రతి దేశంలోనూ దేశ ద్రోహులు ఉంటారు కదా' అని అనుపమ్ ఖేర్ మండిపడ్డారు. తమది కేవలం సినిమా మాత్రమే కాదని, ప్రజల్లో చైతన్యం తీసుకొచ్చే ఉద్యమమని ఖేర్ ఈ సందర్భంగా అన్నారు. ఈ ఉద్యమాన్ని అడ్డుకునేందుకు టూల్‌కిట్ గ్యాంగ్‌లు ప్రయత్నిస్తూనే ఉంటాయని ఆరోపించారు.

**అవాస్తవం అయితే తప్పుకుంటా: వివేక్ అగ్నిహోత్రి**

'ది కశ్మీర్ ఫైల్స్'లో ఒక్క అవాస్తవ దృశ్యం ఉన్నా సినిమాల నుంచి తప్పుకుంటానని ప్రకటించారు ఆ చిత్ర దర్శకుడు వివేక్ అగ్నిహోత్రి. తన సినిమాలో ఒక్క కల్పిత సన్నివేశం చూపించినా ఇకపై చిత్రాలు తీయబోనని నడావ్ లాపిడ్‌కు సవాల్ విసిరారు. 'ప్రపంచ మేధావులకు, ఈ మహా గొప్ప ఇజ్రాయెల్ దర్శకుడికి ఇదే నా సవాల్... ది కశ్మీర్ ఫైల్స్ చిత్రంలో ఒక్క ఫ్రేమ్ కానీ, ఒక్క డైలాగ్ కానీ, ఒక్క ఘటన కానీ అసత్యం అని నిరూపించండి చాలు... నేను ఇక సినిమాలు తీయడం మానేస్తా' అని వివేక్ అగ్నిహోత్రి పేర్కొన్నారు. 'సత్యమనేది అత్యంత ప్రమాదకరమైన విషయం. అందుకే ప్రజలు అసత్యాలు చెబుతుంటారు'' అని అగ్నిహోత్రి ట్విటర్‌లో పేర్కొన్నారు. ఉగ్రవాద మద్దతుదారులు, నరమేధానికి పాల్పడలేదని చెప్పుకునేవారు ఎప్పటికీ నా నోరు మూయించలేరు అని స్పష్టం చేశారు. తన వ్యతిరేకులతో ఘర్షణను కొనసాగిస్తానని స్పష్టం చేశారు.

**ఇజ్రాయెల్ దౌత్యవేత్తల క్షమాపణలు**

ఇజ్రాయెల్ దర్శకుడి వ్యాఖ్యలపై భారత్‌లోని ఇజ్రాయెల్ రాయబారి నావొర్ గిలాన్ స్పందించారు. లాపిడ్ వ్యాఖ్యలను ఖండించడమేకాక భారత ప్రభుత్వానికి క్షమాపణలు తెలియజేశారు. 'భారతీయ సంప్రదాయంలో అతిథిని దేవుడితో సమానంగా చూస్తారు. అలాంటి దేశానికి వచ్చి ఇఫిలో జడ్జి ప్యానెల్‌కు హెడ్‌గా ఉన్న మీరు(లాపిడ్).. ఆతిథ్యమిచ్చిన దేశాన్నే అవమానించారు. చారిత్రక ఘటనల గురించి పూర్తిగా తెలుసుకోకుండా వాటి గురించి వ్యాఖ్యానించడం సరికాదు. మీ వ్యాఖ్యల పట్ల ఇజ్రాయెల్ దేశస్థుడిగా నేను సిగ్గుపడుతున్నా. భారత ప్రభుత్వానికి క్షమాపణలు తెలియజేస్తున్నా' అని గిలాన్ ట్విటర్‌లో పోస్టులు పెట్టారు.

భారత్‌లోని ఇజ్రాయెల్ కాన్సుల్ జనరల్ కొబ్బి షోషానీ కూడా లాపిడ్ వ్యాఖ్యలను తీవ్రంగా వ్యతిరేకించారు. ఈ విషయం తెలియగానే ఆయన అనుపమ్ ఖేర్‌కు స్వయంగా ఫోన్ చేసి క్షమాపణలు తెలియజేశారు. 'లాపిడ్ వ్యాఖ్యలు పూర్తిగా ఆయన వ్యక్తిగతమే. దీనికి ఇజ్రాయెల్‌తో అధికారికంగా గానీ, అనధికారికంగా గానీ ఎలాంటి సంబంధం లేదు. అయితే ఈ విషయం గురించి తెలియగానే నేను నా స్నేహితుడు అనుపమ్ ఖేర్‌కు ఫోన్ చేసి క్షమాపణలు చెప్పాను. 'కశ్మీర్ ఫైల్స్' ప్రచార చిత్రం కాదు. కశ్మీరీల బాధలను చెప్పిన బలమైన చిత్రం' అని షోషానీ అన్నారు.

## ఇజ్రాయెల్ రాయబారికి విద్వేష సందేశాలు

మరోవైపు నడావ్ లాపిడ్ చేసిన వ్యాఖ్యలను ఖండించిన ఇజ్రాయెల్ రాయబారి నావొర్ గిలాన్‌కు ట్విటర్ వేదికగా ద్వేషపూరిత సందేశాలు వచ్చాయి. స్వయంగా ఆయన ఈ విషయం తెలిపారు. ‘మీలాంటి వ్యక్తులను అంతం చేసిన హిట్లర్ గొప్ప వాడు. వెంటనే భారత్ నుంచి వెళ్లిపోండి. హిట్లర్ గొప్ప వ్యక్తి’ అని అందులో రాసి ఉంది. పీహెచ్‌డీ చేసిన ఓ వ్యక్తి ఈ మెసేజ్‌ను పంపినట్లు తెలుస్తోందని చెబుతూ.. అతని వివరాలు గోప్యంగా ఉంచారు. ఈ క్రమంలోనే పలువురు గిలాన్‌కు మద్దతుగా నిలిచారు. అనంతరం ఆయన మరో ట్వీట్ చేస్తూ.. ‘ఇంకా కొందరిలో జాతివివక్ష భావాలు ఉన్నాయని ఈ పోస్ట్ ద్వారా గుర్తుచేయాలనుకున్నా. మనమంతా కలిసికట్టుగా దీన్ని వ్యతిరేకించాలి’ అని పేర్కొన్నారు.

## అన్ని వర్గాల నుంచి ఆగ్రహం

ఇజ్రాయెల్ దర్శకుడు నడావ్ లాపిడ్ చేసిన వ్యాఖ్యలపై బీజేపీతో పాటు వివిధ వర్గాల నుంచి వ్యతిరేకత వ్యక్తమైంది. ‘హిట్లర్ హయాంలో లక్షలాది యూదులను హతమార్చిన హోలోకాస్ట్‌ను ప్రజలు చాలాకాలం విశ్వసించలేదు. అలాగే షిండ్లర్స్ జాబితాను ప్రచారంగా పేర్కొన్నారు.. ప్రస్తుతం ‘ది కశ్మీర్ ఫైల్స్’పై కొందరు అదే విధంగా వ్యవహ రిస్తున్నారు. సత్యమే చివరకు విజయం సాధిస్తుంది” అని బీజేపీ ఐటీ విభాగం అధిపతి అమిత్ మాలవీయ పేర్కొన్నారు. ‘క్షేత్రస్థాయిలో వాస్తవాలు తెలియని వ్యక్తుల నుంచే అటువంటి వ్యాఖ్యలు వస్తాయి. నిరాశ్రయులైన కశ్మీరీ పండిట్లు ఆశ్రయం పొందుతున్న జమ్ము–కశ్మీర్‌లోని క్యాంపులను లాపిడ్ సందర్శించాలి’ అని జమ్ము–కశ్మీర్ బీజేపీ అధ్యక్షుడు రవీందర్ రైనా సూచించారు. ‘ది కశ్మీర్ ఫైల్స్’పై లాపిడ్ వ్యాఖ్యలు... గతంలో భయానక పరిస్థితులను ఎదుర్కొన్న కశ్మీర్ హిందువులను అవమానించడమే నని బీజేపీ గోవా అధికార ప్రతినిధి సావియో రోడ్రిగ్స్ అభివర్ణించారు. ద్వేషం ఎప్పటికైనా నాశనమవు తుందని కాంగ్రెస్ అధికార ప్రతినిధి సుప్రియా శ్రీనాటే వ్యాఖ్యానించారు.

## నడావ్ లాపిడ్ క్షమాపణలు

నడావ్ లాపిడ్ చేసిన వ్యాఖ్యలపై అనూహ్యంగా వ్యతిరేకత వ్యక్తం కావడంతో ఆయన కొంత దిగి రాక తప్పలేదు. అయితే డొంక తిరుగుడుగానే స్పందించారు.. తాను చేసిన వ్యాఖ్యలతో బాధపడి ఉంటే వారికి క్షమాపణలు చెబుతున్నానన్నారు. తానెప్పుడూ ఎవరినీ అవమానించాలనుకోనని, అది తన ఉద్దేశం కూడా కాదని తెలిపారు. చిత్ర దర్శకుడు వివేక్ అగ్నిహోత్రి కోపాన్ని తాను అర్థం చేసుకు న్నానని పేర్కొన్నారు నడావ్. కశ్మీరీ పండిట్ల పట్ల తనకు సానుభూతి ఉన్నదని తెలిపారు. తాను కేవలం సినిమా గురించి మాట్లాడుతున్నానని, ఘటన




గురించి కాదని చెప్పారు.

కశ్మీరీ పండిట్లను లేదా వారి బంధువులను కించపరచలేదని, బాధితులను తాను గాయపరచ లేదని చెబుతూనే తన వ్యాఖ్యలను డావ్ లాపిడ్ సమర్థించుకున్నారు. తనతో పాటు తోటి జ్యూరీ సభ్యులు కూడా ఆ సినిమా ఒక వల్గర్ ప్రాపగాండ గానే చూశారని, అలాంటి ప్రతిష్ఠాత్మక ఫిలిం ఫెస్టివల్‌లో ఈ సినిమా పోటీ పడటం సరికాదని, ఇదే విషయాన్ని మళ్లీమళ్లీ చెప్పమన్నా చెబుతానని అన్నారు. కశ్మీర్ ఫైల్స్ సినిమాటిక్ మ్యానిపులేషన్‌లో ఉన్నదని చెప్పారు. హింస, విద్వేషం చిమ్మడానికే ఈ సినిమాను వినియోగించుకున్నట్టు తామంతా భావించామని నడావ్ లాపిడ్ తెలిపారు.

ఇఫి జ్యూరీ హెడ్ నడావ్ లాపిడ్ ఇజ్రాయెల్ పౌరుడు కాబట్టి మిత్రదేశమైన భారత్ పట్ల సానుభూతితో ఉంటారని భావించాల్సిన అవసరం లేదు. మనదేశంలో ఇజ్రాయెల్ పట్ల భిన్నాభి ప్రాయాలు ఉన్నట్లే, అక్కడా భారత్ విషయంలో మాట్లాడేవారున్నారు. లాపిడ్ ఈ కోవకు చెందిన వాడే. స్వతహాగా నడావ్ లాపిడ్ వామపక్ష భావజాలం ఉన్న వ్యక్తి. గతంలో ఆయన తమ దేశానికి వ్యతిరేకంగా మాట్లాడిన సందర్భాలున్నాయి. ఆయన సినిమాల్లో పాలస్తీనా అనుకూల వైఖరి, ఇజ్రాయెల్ పట్ల వ్యతిరేకత కనిపిస్తుంది. పాలస్తీనా హక్కులను ఇజ్రాయెల్ తీవ్రంగా అణచివేస్తున్నట్లు తన సినిమాల్లో చూపించే లాపిడ్, కశ్మీర్ విషయంలో ఆయన ఆలోచనలు ఎలా ఉంటాయో ఊహించుకోవచ్చు..

సొంత దేశానికే వ్యతిరేకంగా మాట్లాడే లెఫ్టిస్టు ఇజ్రాయెలీ పౌరుడైన నడావ్ లాపిడ్‌కు భారతదేశంపై గౌరవం ఎలా ఉంటుంది? యూదులపై జరిగిన అరాచకాల గురించే మాట్లాడని వాడు, కశ్మీరీ పండిట్ల కష్టాలపై ఎలా మాట్లాడతాడు? ఆయన్ని గోవా ఫిల్మ్ ఫెస్టివల్‌కు ఆహ్వానించే ముందే ఆలోచించి ఉండాల్సింది. ఆహ్వానితుల అర్హతలను పరిగణనలోకి తీసుకొని ఉంటే ఇలాంటి పొరపాట్లు తప్పేవి... అని విశ్లేషకులు భావిస్తున్నారు. ఈ ఫిల్మ్ ఫెస్టివల్‌లో ఆయన కొందరు భారత చిత్ర పరిశ్రమకి చెందిన వ్యక్తులతో సమావేశమయ్యారు. వారిలో కొందరు ‘కశ్మీర్ ఫైల్స్’ చిత్రం విషయంలో నడావ్‌కు తప్పుడు అభిప్రాయాలు కలిగేలా చెప్పి ఉంటారు. ఈ విషయంలో నిజానిజాలను ఆయన నిర్ధారించు కోవాలి. కానీ ఆ పని చేయలేదు. అనుపమ్ ఖేర్ అన్నట్లు నడావ్ ఇజ్రాయెల్ పౌరుడు, యూదు జాతీయుడు కావొచ్చు కానీ లెఫ్టిస్ట్.. లెఫ్ట్ లిబరల్ టూల్ కిట్‌లో ఆయన కూడా ఒక భాగం.

**వ్యాసకర్త : సీనియర్ జర్నలిస్ట్**





# 'గర్జన' సరే... నీటి ప్రాజెక్టులపై చిత్త

సీమగర్జన పేరుతో వైకాపా నాయకులు తమను మోసం చేస్తున్నారని రాయలసీమవాసులు భావిస్తున్నారు. రాయలసీమలో హైకోర్టు ఏర్పాటు చేయాలనేది సెంటిమెంటుగా మారిన తరుణంలో అమరావతిలోనే హైకోర్టు ఉంటుందని రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టులో పేర్కొనడాన్ని ఏ రకంగా సమర్థించుకుంటుందని ప్రభుత్వాన్ని సీమవాసులు ప్రశ్నిస్తున్నారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి తన పాదయాత్రలో ఎన్నో హామీలు ఇచ్చారు. ఆ హామీలతో రాయలసీమకు మంచి జరుగుతుందని భావించి ఈ ప్రాంత ఓటర్లు వైకాపాకు భారీ మెజారిటీ కట్టబెట్టారు. రాయలసీమ 4 జిల్లాల్లో 54 సీట్లుంటే 51 వరకు గెలిపించారు.

అయితే వైకాపా ప్రభుత్వం వారి ఆశలను అడియాశలు చేసింది. అధికారం పొంది మూడున్నరేళ్లయినా పాదయాత్రలో ఇచ్చిన హామీల్లో దేనిని నెరవేర్చలేదు. అపరిష్కృత సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేయలేదు. కొత్త ప్రాజెక్టు ఒక్కటీ చేపట్టలేదు. ఉద్యాన రైతులకు యంత్రపరికరాలు అందించలేదు. నిరుద్యోగులకు ఉపాధినిచ్చే భారీ ప్రాజెక్టు ఒక్కటీ నిర్మించలేదు. వ్యవసాయానికి ప్రోత్సాహకం అందక రైతులు, నిరుద్యోగులు ఉపాధి కోసం వలస పోతున్నారు. ఇప్పటికీ ప్రతి గ్రామం నుంచి వందలాది మంది వలస వెళ్లిపోవడం కనిపిస్తోంది. ఇక కడపలో స్టీల్ ఫ్యాక్టరీ ఏర్పాటు, రహదారులు, రైల్వేలైన్లపై తెదేపా, వైకాపా రెండూ ప్రజలను మభ్యపెట్టాయి. ఇవికాక వైకాపా ప్రభుత్వ వైఖరి వల్ల రాష్ట్రంలో ఉన్న పరిశ్రమలు ఇతర రాష్ట్రాలకు తరలిపోతున్నాయి. ఈ ప్రభుత్వం రాయలసీమ ప్రజలకు తాగడానికి నీరు ఇవ్వలేకున్నా మద్యాన్ని మాత్రం ఏరులై పారిస్తోంది. సీమగర్జన పేరుతో కర్నూలులో తిష్ఠవేసిన 9 మంది మంత్రులు తాము 'సీమ'కు చేసిన అన్యాయానికి సమాధానం చెప్పగలరా?




**రాజకీయ పైచేయి కోసమే**

రాయలసీమలో హైకోర్టు కోసం.. వికేంద్రీకరణకు మద్దతుగా కర్నూలు ఎస్‌టీబీసీ మైదానంలో జేఏసీ ఆధ్వర్యంలో 'రాయలసీమ గర్జన' పేరుతో వైసీపీ అధిష్ఠానం భారీసభ నిర్వహించింది. పేరుకు హైకోర్టు, వికేంద్రీకరణ అని చెబుతున్నా ప్రభుత్వ ఉద్దేశ్యం మాత్రం వేరు. మూడు రాజధానులకు ప్రజల మద్దతు ఉంది అని చెప్పించడమే ఈ సభ ప్రధాన లక్ష్యం. రాజకీయ పైచేయి కోసం తెదేపా నాయకులు చంద్రబాబు నాయుడు కర్నూలు జిల్లా పర్యటన చేస్తే, ఇప్పుడు తమదే పైచేయిగా చూపిస్తూ వైసీపీ ప్రభుత్వం రాయలసీమ గర్జన సభను వేదికగా చేసుకుంది. కాని ప్రజలు మాత్రం నమ్మే పరిస్థితుల్లో లేరు. వైకాపా, తెదేపా తమ ప్రాంతానికి చేసిన అన్యాయాన్ని ప్రజలు గుర్తు తెచ్చుకుంటున్నారు. ఈ పార్టీల ప్రభుత్వాలు చేసిన అభివృద్ధి ఏంటో చెప్పాలని ప్రశ్నిస్తున్నారు.

**సుప్రీంలో ఒక మాట.. సీమలో మరో మాట**

సీమ ప్రజలకు కర్నూలులో హైకోర్టు ఏర్పాటు సెంటిమెంటుగా మారింది. అందువల్లే భారతీయ జనతా పార్టీ కర్నూలులో హైకోర్టు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తోంది. కాని గత తెదేపా ప్రభుత్వం గాని, ఇప్పటి వైకాపా ప్రభుత్వం గాని సీమ ప్రజల సెంటిమెంటును గౌరవించలేదు. హైకోర్టు రాయలసీమకు రాకపోవడానికి టీడీపీ ఎంత కారణమో వైసీపీ కూడా అంతే కారణం. రాజధాని, హైకోర్టు రెండూ అమరావతిలోనే పెట్టాలని, ఆనాటి ముఖ్యమంత్రి చంద్రబాబు అసెంబ్లీలో తీర్మానం పెట్టగా ప్రతిపక్ష నాయకులు జగన్‌మోహన్‌రెడ్డి మద్దతు ఇచ్చారు. అందువల్లనే అమరావతిలో హైకోర్టు ఏర్పాటు చేస్తూ ఆనాటి రాష్ట్రపతి డిసెంబర్ 26, 2018న గెజిట్ నోటిఫికేషన్ ఇచ్చారు. ఈ నేపథ్యంలో రాయలసీమ గర్జన సభను ఏర్పాటు చేసే నైతిక హక్కు వైసీపీకి ఉందా? అని బీజేపీ ప్రశ్నిస్తోంది.

**'సీమ'కు వైకాపా హామీలు, చేసిన శంకుస్థాపనలు**

రాయలసీమ దుర్భిక్ష నివారణ మిషన్ పేరుతో రూ.33,862 కోట్లతో 23 సాగునీటి ప్రాజెక్టులకు సీఎం జగన్ హడావిడిగా శంకుస్థాపనలు చేశారు. ఏ ఒక్క ప్రాజెక్టు కూడా కనీసం 5 శాతం పనులు కూడా పూర్తిచేయలేదు.



# శుద్ధి ఏది?



**తురగా నాగభూషణం**
**సీనియర్ జర్నలిస్ట్**

**స్టీలు ప్లాంట్లు ఏం చేశారు?**

కడప జిల్లా మైలవరం మండలంలో టీడీపీ ప్రభుత్వం 3,500 ఎకరాల్లో రాయలసీమ స్టీల్ ప్లాంట్‌కు శంకుస్థాపన చేసింది. కాని దానిని నిర్మించ లేదు. జగన్ సీఎం అయ్యాక ఆ ప్లాంట్‌ను రద్దు చేసి.. జమ్మలమడుగు మండలం సున్నపురాళ్లపల్లె, పెద్దదండ్లూరు గ్రామాల్లో ఏపీ హైగ్రేడ్ స్టీల్ ప్లాంట్ (వైఎస్ఆర్ స్టీల్స్) నిర్మాణానికి డిసెంబరు 23, 2019న శంకుస్థాపన చేశారు. 3,148.69 ఎకరాలు ప్రభుత్వం కేటాయించింది. మూడున్నరేళ్లు గడిచినా ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్లుగా ఉంది. కర్నూలు జిల్లాలో 33 వేల ఎకరాల్లో ఓర్వకల్లు పారిశ్రామిక హబ్‌లో ఈ మూడున్నరేళ్లలో ఒక్క పరిశ్రమ కూడా ఏర్పాటే కాలేదు.

**సిద్దేశ్వరం అలుగు**

శ్రీశైలం జలాశయం ఎగువన 854 అడుగుల లెవల్‌లో సిద్ధేశ్వరం అలుగు నిర్మాణానికి పాద యాత్రలో జగన్ హామీ ఇచ్చారు. ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టి మూడున్నరేళ్లయినా దాని ప్రస్తావనే లేదు.

**'గుండ్రేవుల' జోలికీ పోలేదు**

గుండ్రేవుల జలాశయం నిర్మిస్తామని పాద యాత్రలో జగన్ హామీ ఇచ్చారు. కాని మూడేళ్లయినా దానిని పట్టించుకోలేదు. కేసీ కాలువ పరిధిలో కర్నూలు, కడప జిల్లాల్లో 2.60 లక్షల ఎకరాలకు సాగునీరు అందుతోంది. తుంగభద్ర నదీజలాల్లో కేసీ కాలువకు 39 టీఎంసీలు వాటా ఉంది. ఆ నీటిని నిలుపుకునే జలాశయం లేదు. సుంకేసుల ఎగువన 20 టీఎంసీల సామర్థ్యంతో గుండ్రేవుల జలాశయం నిర్మించాలని సీమ రైతుల డిమాండ్. గత టీడీపీ ప్రభుత్వం రూ.2,900 కోట్లు మంజూరు చేసి జీవో ఇచ్చి చేతులు దులుపుకుంది. జగన్ కూడా అదే తీరున దీని నిర్మాణ ఊసే ఎత్తలేదు.

**వేదావతి ఎత్తిపోతల పథకం ఏమైంది?**

కర్నూలు జిల్లా పశ్చిమ ప్రాంతంలో సాగు, తాగు నీటి అవసరాల కోసం నిర్మించ తలపెట్టిన వేదావతి ఎత్తి పోతల పథకం కూడా అసంపూర్తిగా మిగిలి పోయింది. రూ.1,985 కోట్లతో ఆర్డీఎస్ కుడి కాలువ, రూ.1,995 కోట్లతో వేదావతి ఎత్తిపోతల పథకం ఇక్కడ అమలుచేయాలి. వైసీపీ ప్రభుత్వం వచ్చిన మొదట్లో ఆ పనులు ఆపేసి.. ఆ తరువాత మొదలు పెట్టినా నిధులు లేక అసంపూర్తిగా ఆగిపోయాయి. వీటిని ఎందుకు పూర్తి చేయడం లేదు?

**హంద్రీనీవా ఎత్తిపోతల అంతేనా?**

హంద్రీనీవా ఎత్తిపోతల ప్రాజెక్టు ద్వారా 10 వేల క్యూసెక్కులు లిఫ్ట్ చేసేలా సమాంతర కాలువ నిర్మిస్తామని జగన్ పాదయాతలో చెప్పారు. ఈ ప్రాజెక్టు ద్వారా ప్రస్తుత సామర్థ్యం మేరకు 3,800 క్యూసెక్కులు లిఫ్ట్ చేయాల్సి ఉండగా 2 వేల క్యూసెక్కులు కూడా లిఫ్టు చేయడం లేదు. పూర్తి సామర్థ్యంలో లిఫ్టు చేయాలనే లక్ష్యంగా రూ.350 కోట్లతో విస్తరణ పనులు చేపట్టాలి. కాని వైకాపా ప్రభుత్వం వచ్చాక ఆ పనులు ఆపేశారు. సమాంతర కాలువ ఊసే లేదు.

**కడపలో నీటి వనరుల సంరక్షణపై శ్రద్ధ ఏదీ?**

కడప జిల్లాలో వర్షాధారంగానే వ్యవసాయం జరుగుతోంది. అడపాదడపా వచ్చే వర్షాలు, వరదలతో మాత్రమే నీరు కనిపిస్తుంది. ఇలా వచ్చిన నీటిని వడిసి పట్టడం వీలుకావడం లేదు. ఈ జిల్లాలో 77.287 టీఎంసీలు నిల్వ చేసేందుకు గండికోట, చిత్రావతి, బ్రహ్మసాగర్, మైలవరం, పైడిపాలెం, వామికొండ, సర్వరాయసాగర్.. వంటి జలాశయాలు ఉన్నాయి. సాగునీరు అందించే పిల్ల కాలువలు, వివిధ నిర్మాణాలు అసంపూర్తిగా ఉన్నాయి. సుమారు రూ.450 కోట్లు వెచ్చిస్తే పిల్లకాలువలను పూర్తి చేయ వచ్చని ఇంజనీర్లు అంటున్నారు. ఆ పనులు ఎందుకు చేపట్టలేదు? అని ప్రశ్నలు రేగుతున్నాయి. అమెరికా లోని అయోవా యూనివర్సిటీ సహకారంతో మెగా సీడ్ హబ్‌కు కర్నూలులో ఏర్పాటు చేయాల్సి ఉన్నా వైకాపా ప్రభుత్వం దానిని రద్దు చేసింది. సీడ్ హబ్ కొనసాగించి ఉంటే రైతులకు మేలు జరిగేది. ★

---

**'జాగృతి' నిర్వహించిన ఎండివై రామమూర్తి స్మారక నవలల పోటీలో**
**ప్రథమ బహుమతి పొందిన రచన**




**ధారావాహికంగా అతి త్వరలో**
**మీ ముందుకు వస్తోంది...**

**రచన: పాలంకి సత్య**



❄ పౌరాణికం ❄

# పండినా... ఎండినా...

సత్యనారాయణ స్వామి వ్రతం చేయాలంటే పురోహితుడు చెప్పే జాబితాలో మరో ప్రధానమైనది ఎండు ఖర్జూర. ఇది పండుగా ఎంత బాగుంటుందో, ఎండిన తర్వాత కూడా అంతే రుచిగా ఉంటుంది. హిందువులతో పాటు ముస్లింలు, క్రైస్తవులు వీటిని అధికంగా వాడతారు. దేవుడికి నివేదించడానికి ఏ పండూ లేనప్పుడు దీనిని సమర్పిస్తారు. పండుగా ఉన్నప్పుడూ, ఎండిపోయిన తర్వాత కూడా అంతే ప్రాశస్త్యం గలిగి ఉండటం ఎండు ఖర్జూరం సొంతం.

మెత్తని పండ్లకోసం అయితే ఇవి రంగు మారి దోర రంగులోకి రాగానే చెట్టు నుంచి తీస్తారు. అదే ఎండు ఖర్జూరాల కోసం అయితే చెట్టునే బాగా ఎండనిచ్చి తెంపి, కొంతకాలం తేమ వాతావరణంలో ఉంచి కాస్త మెత్తబడేలా చేస్తారు. వేసవిలో ఎండు ఖర్జూర నీళ్లు తాగని పసిపిల్లలు అరుదే. చిన్నపిల్లల ఎదుగుదలకు మంచి ఆహారం. స్వీట్లు, పుడ్డింగ్‌లు, కేకుల తయారీలో ఖర్జూరం ఉండి తీరాల్సిందే. ఖర్జూరంలో పిండి, చక్కెర పదార్థాలు ఎక్కువ. విటమిన్ సి మెండుగా లభిస్తుంది. ఫాస్ఫరస్, కాల్షియం లాంటి ఖనిజ లవణాలు వీటిలో ఎక్కువగా లభిస్తాయి. చక్కెర శాతం ఎక్కువగా ఉంటుంది కనుక మధుమేహంతో బాధపడే వారు ఖర్జూరాలకు దూరంగా ఉండటమే మంచిది

ఖర్జూరం చెట్టు నాటినప్పటి నుండి మూడవ సంవత్సరం నుండి దిగుబడి మొదలవుతుంది. గాలిలో తేమ తక్కువగా ఉండే ప్రాంతాలలోని అన్నిరకాల నేలలోనూ ఈ చెట్లు ఎదుగుతాయి. 75 అడుగుల దాకా

## ఓం ఆధ్యాత్మికం

❄ 'మొక్క'బడి ❄

రామాయణంలో అరణ్యకాండలో శరభంగ మహర్షి గురించి ప్రస్తావన ఉంది. దండకారణ్యంలో ఉండే ఆయన రామదర్శనం కోసం నిరీక్షించాడు. ఇంద్రుడు సహా దేవతలంతా ఈయన్ని స్వర్గానికి ఆహ్వానించినా సరే...రామ దర్శనం తరువాతే శరీరాన్ని విడుస్తానన్నాడు. చివరికి అలాగే చేశాడు. ఆయన ఆశ్రమం జాహ్నవి నదికి దగ్గర ఉంది. ఇంద్రుడు గాలిలో నిలిచి శరభంగ మహర్షితో మాట్లాడుతూ ఉండడాన్ని గమనించిన రాముడు సోదరుడు లక్ష్మణుడితో 'లక్ష్మణా! 'ఆకుపచ్చ గుర్రములు కట్టిన రథంపై వచ్చే ఇంద్రా..' అని సంబోధించాలని వేదంలో చదువుకున్నాం కదా? అదిగో ఆ ఇంద్రుడు ఇప్పుడు శరభంగ మహర్షితో మాట్లాడుతున్నాడు. అందరం ఒకేసారి లోపలికి వెళ్లకూడదు. మొదట నేను లోపలికి వెళ్లి ఇంద్రుడిని చూస్తాను' అంటూ రాముడు వెళుతుండగా, 'రాముడు వచ్చేస్తున్నాడు. ఆయన వంక నేను చూడను, మాట్లాడను. ఎందుకంటే ఆయన ముందుముందు సాధించవలసిన గొప్ప దేవకార్యం ఒకటి ఉంది. అప్పుడు వచ్చి రాముడిని అభినందిస్తాను. ఇక సెలవు మహర్షి' అని వెళ్లిపోయాడు. రాముడు సతీసోదరులతో శరభంగ ఆశ్రమంలోనికి వెళ్లి ప్రవర చెప్పుకున్నాడు.

'రామా! నువ్వు వస్తున్నావని నాకు తెలుసు. నేను నా తపఃశక్తితో ఇంద్ర, బ్రహ్మలోకాలను గెలిచాను. అందుకని నన్ను తీసుకెళ్లడానికి ఇంద్రుడు స్వయంగా వచ్చాడు. కానీ నాకు ప్రియమైన అతిథి వచ్చాడని, ఆయనకు



దోర్బల పూర్ణిమాస్వాతి

# ప్రశస్తం ఖర్జూరం

ఎదుగుతుంది. ఈ పంటకు చీడపీడలు తక్కువే. ఒక్కొక్క చెట్టుకు 300 నుంచి 500 వందల కిలోల దాకా దిగుబడి వస్తుంది. ఈ చెట్ల జీవితకాలం 150 సంవత్సరాలు అంటారు. ఈ చెట్టులోని ప్రతిభాగం విలువైనదే. కాండం కలపగా ఉపయోగ పడితే, పొడవైన వీటి ఆకులను బుట్టలు తయారీకి ఉపయోగిస్తారు.

ఈ చెట్ల జన్మస్థానం ఇరాక్ దేశమని చెబుతారు. ఉత్తర ఆఫ్రికా, మధ్య ప్రాచ్యంలోని ఎడారి ప్రాంతాలలో, ఈజిప్ట్, ఇరాన్, సౌది అరేబియా, ఇరాక్ దేశాలలో ఖర్జూరను ఎక్కువగా సాగుచేస్తారు. పాకిస్తాన్, ఇండియా, మెక్సికో దేశాలలో కూడా ఈ చెట్లను పెంచుతున్నారు. ఈ దేశాల నుండి ఇతర దేశాలకు ఎగుమతి చేస్తారు.

**ఉపయోగాలు**

ఖర్జూరం, పండుగానే కాక చెట్టుగా కూడా అనేక రకాలుగా ఉపయోగ పడుతుంది. లేత ఆకుల్ని కూరగా వండుకుంటారు. ఉత్తర ఆఫ్రికాలో ఆకుల్ని పూరిళ్లకు కప్పులుగా వాడటమూ ఎక్కువే. తాటి ఆకుల మాదిరిగానే చాపలు, తడికెలు, బుట్టలు, విసనకర్రల్లోనూ వీటికి ఎంతో ప్రాధాన్యం ఉంది. ఎండు టాకులు చీపుళ్లుగా, వంటచెరకుగానూ ఉపయోగపడతాయి. ఆకుల్లోని పీచుతో తాళ్లు, టోపీలు, నేతబట్ట... లాంటివీ అల్లుతారు.

వీటి విత్తనాల్ని పొడి చేసి గోధుమపిండిలో కలిపి రొట్టె చేసుకుని తింటారు. నానబెట్టి పొడికొట్టిన విత్తులు పశువుల మేతకి పనికివస్తాయి. విత్తనాల నుంచి తీసిన తైలం సబ్బులు, సౌందర్య సాధనాల తయారీలో వాడతారు.

ఖర్జూర ఫలాలే కాదు, పుష్పాలూ రుచికరమైనవే. అందుకే ఆయా దేశాల మార్కెట్లలో వీటిని ప్రత్యేకంగా అమ్ముతారు. పూమొగ్గల్ని సలాడ్‌లలో ఎండుచేపల కూరల్లో వాడతారు.

**ఖర్జూరంతో వైద్యం**

ఎముకలు బలంగా, పటుత్వంగా ఉండా లంటే, ఖర్జూరపండు తరచుగా ఎక్కువగా తినాలి.

ఎండాకాలం వడదెబ్బ తగులకుండా ఉండాలంటే, ఖర్జూరపండును రాత్రుళ్లు



నీటిలో నానబెట్టి మరుసటి రోజు ఉదయం ఆ నీటిని తాగితే వడదెబ్బ తగలకుండా ఉంటుంది.

మూత్రం సాఫీగా రానివారికి ఖర్జూర పండు పెడితే గుణం కనిపిస్తుంది. గొంతు నొప్పి, మంట, జలుబు, శ్లేష్మం లాంటివాటికి ఈ పండు గుజ్జు లేదా సిరప్ మంచి మందు. డయేరియా, మూత్రాశయ సమస్యల్ని నివారణకు కాండం నుంచి తీసిన జిగురును వాడతారు. చెట్టువేళ్లను నూరి పెట్టుకుంటే పంటినొప్పి తగ్గుతుంది. మూత్రపిండాలలో రాళ్లు కరగాలంటే ఖర్జూరపండు తినాలని వైద్యులు చెబుతారు. ★



# స్వర్గం కన్నా రామ దర్శనం మిన్న

ఆతిథ్యం ఇచ్చాక వస్తానని చెప్పాను. తపఃశక్తితో గెలుచుకున్న లోకాలను ధారపోస్తాను. మీరు యధేచ్ఛగా విహరించండి' అన్నాడు శరభంగుడు. ఆయన మాటలకు రాముడు మృదువుగా బదులిస్తూ, "మహానుభావా! మీ తపః ఫలాన్ని మాకు ధారపోయడం ఏమిటి? మేం ఆశ్రమం ఎక్కడ కట్టుకోవాలో చెప్పండి. అక్కడ నేను తపస్సు చేసుకుంటాను' అన్నాడు. రాముడి మాటలకు సంతోషించిన శరభంగుడు 'ఇక్కడికి దగ్గరలో సుతీక్ష్ణుడు అనే మహర్షి ఉన్నారు, ఆయనను దర్శించు' అని చెప్పాడు. 'రామా! నీకు ఒక విచిత్రమైన కార్యం చూపిస్తాను. నా శరీరం జర్జరీ భూతం (ముసలిదయిపోయి ముడతలు పడిపోయింది) అయిపోయింది కనుక ఈ శరీరాన్ని అగ్నిలో కాలుస్తాను" అంటూ శరభంగుడు అగ్నిహోత్రంలో నెయ్యి వేసి, తన శరీరాన్ని ఆ అగ్నిలో వేశాడు. సీతారామ లక్ష్మణులు ఆ సన్నివేశం చూసి ఆశ్చర్యంతో అలా ఉండిపోయారు. శరభంగుడి శరీరం కాలిపోగా, ఆయన కౌమారం వయస్కుడి ఉన్న శరీరంతో అగ్ని నుంచి బయటకి వచ్చి బ్రహ్మలోకానికి వెళ్లిపోయాడు. బ్రహ్మ ఆసనం నుంచి లేచి 'మహానుభావా! శరభంగ, స్వాగతం, సుస్వాగతం" అని సాదరంగా ఆహ్వానించాడు. ★



# ఆనందమఠం

13

సత్యానందుడు కొంతలో కొంత దుఃఖి తుడైనాడు. "ఏది ఏమైనా కానీండి. ఈ ప్రదేశమంతా ఇప్పుడు మన అధీనంలోనికి వచ్చింది. మనతో యుద్ధం చేయగలవారు ఇక్కడ ఎవరూ లేరు. ఈ వీరేంద్ర భూమిపై మనం సంతాన రాజ్యాన్ని ప్రతిష్ఠించాలి. ప్రజల నుండి పన్నులు వసూలు చేయండి. రాజధానిని ఆక్రమించుకుందుకు సేనను పోగు చేయండి. మనం గెలిచిన సంగతి తెలిస్తే చాలామంది సంతానులు వచ్చి మన జండా కిందకు చేరుతారు" అన్నాడు.

ఈ మాటలకు జీవానందుడు, మిగిలినవారు సత్యానందునకు ప్రణామం చేశారు. "తమ ఆజ్ఞ ఎట్లో, అట్లే మహారాజాధిరాజా! అయితే మేం ఈ అరణ్యంలోనే తమకు సింహాసనం నెలకొల్పుతాం" అన్నాడు.

సత్యానందుడు తన జీవితంలో ప్రథమ పర్యాయం కోపగించుకున్నాడు. "ఏమన్నారు? నాకు సింహాసనమా? నన్ను మట్టిబొమ్మతో సమానం చేస్తారా? మనం ఎవరం? సంతానులం! మనమె వరమూ మహారాజులం కాము. కేవలం సన్యాసులం. ఈ ప్రదేశానికి రాజు సాక్షాత్తు వైకుంఠనాథుడే. ఇక్కడ ప్రజాతంత్ర రాజ్యాన్ని స్థాపిస్తాం. నేనైతే, ఇప్పుడు బ్రహ్మచర్య వ్రతం తప్ప ఇంకే ఆశ్రమాన్నీ, దీక్షను స్వీకరించను. ఈ విషయం మాత్రం చక్కగా గమనించండి. ఇక మీరు మీ మీ పనులలో నిమగ్నులు కావచ్చును."

నలుగురు లేచి సత్యానందునకు ప్రణామం చేశారు. సత్యానందుడు మహేంద్రుని అట్టే ఉంచాడు. మిగిలిన ముగ్గురూ వెళ్లిపోయారు. మహేంద్రునితో సత్యానందుడు ఇలా అన్నాడు : "మీరందరూ విష్ణు మంటపంలో సంతాన దీక్ష స్వీకరించారు. భవానంద, జీవానందులు తమ దీక్షను అతిక్రమించి ప్రవర్తిం చారు. భవానందుడు ప్రతిజ్ఞా భంగానికి ప్రాయశ్చి త్తాన్ని నేటి యుద్ధంలో జరుపుకున్నాడు. ఏదో ఒక రోజున జీవానందుడు కూడా ప్రాయశ్చిత్తం నిమిత్తం దేహత్యాగం చేస్తాడేమోనని నాకు భయంగా ఉంది.

నీవొక్కడవే ఈ దీక్షను, వాగ్దానాన్ని సంపూర్ణంగా నెరవేర్చుకున్నావు. సంతానుల కార్యం నెరవేరింది. నీవిక మామూలు గృహస్థ జీవితం మొదలు పెట్టవచ్చు."

మహేంద్రుని కన్నులలో అశ్రువులు జలజల రాలినాయి. అతి కష్టం మీద ఇలా అన్నాడు : "మహారాజా! నేను ఎవరిని చూచుకుని సంసారిని అవగలను? భార్య ఆత్మహత్య చేసుకుంది. కుమార్తె ఎక్కడుందో తెలియదు. ఏమీ జాడ తెలియని దాన్ని గురించి ఎక్కడ వెదుకుతూ తిరగను? తిరిగితే మటుకు ప్రయోజనం ఏమిటి?"

సత్యానందుడు నవీనానందుని పిలిపించాడు. అతడిని మహేంద్రునకు ఎరుకపరుస్తూ "వీరు నవీనానంద గోస్వామి అనే మహాత్ములు. అతి పవిత్రులు.

నాకు పరమ ప్రియశిష్యులు. నీకు నీ కుమార్తెను వెదికి ఇవ్వగలరు" అన్నాడు. శాంతికి కనుసైగలతో ఏమో చెప్పాడు. శాంతి గ్రహించి సరేనని జవాబు చెప్పింది.

మహేంద్రుడు నవీనానందుని "మిమ్ము కలుసు కోవడానికి ఎక్కడ అవకాశం ఉంటుంది?" అని అడిగాడు.

"నా ఆశ్రమానికి రండి" అంటూ శాంతి ముందుగా నడిచింది.

మహేంద్రుడు సత్యానందునికి పాదాభివందనం చేసి సెలవు తీసుకున్నాడు. శాంతి వెంట వెళ్లి ఆమె ఆశ్రమంలో కూర్చున్నాడు.

అప్పటికి చాలా రాత్రి అయింది. అయినా, శాంతి విశ్రాంతి కోసం వేచి ఉండక నగరం వైపు నడిచింది.

అందరూ వెళ్లిపోయిన తరువాత సత్యానందుడు భగవంతుడిని తలుచుకుంటూ నేలమీదనే పక్క పరుచుకున్నాడు.

ఎవరో వచ్చి అతని తలను తాకి "నేను వచ్చాను" అన్నారు.

బ్రహ్మచారి లేచి నిర్ఘాంతపోయి, వ్యగ్రభావంతో "వచ్చారా? దేనికి?" అన్నాడు. "రోజులు ముగిశాయి!" "హే ప్రభూ! ఈరోజుకు క్షమించండి. రానున్న మాఘ పౌర్ణమికి మీ ఆజ్ఞ నెరవేర్చి అనుసరిస్తాను" అన్నాడు సత్యానందుడు.

## చతుర్థభాగము

### 1

ఆ రాత్రి హరిధ్వనితో దిగంతం అంతా నిండి పోయింది. సంతానులు 'వందేమాతరమ్', 'జయ జగదీశ హరే' గీతాలు పాడుకుంటూ అక్కడక్కడ గుంపులుగా గుమిగూడి సంచరిస్తున్నారు. శత్రుసేనల శస్త్రాలు, వస్త్రాలు లాక్కుంటున్నారు. గ్రామాల మీద, నగరాల మీద పడి అడ్డం వచ్చినవారితో "వందే మాతరం అను, లేకపోతే చంపివేస్తాం" అని బెదిరి స్తున్నారు. ఇళ్లలో దూరుతున్నారు. ఆస్తిపాస్తులను వశం చేసుకుంటున్నారు. సంపదలు కైవసం చేసు కుంటున్నారు. ఆ ఒక్కరాత్రి మాత్రం అన్ని నగరాల లోను, గ్రామాలలోను కోలాహలంగా ఉంది. సంతా



నుల చర్యలను ఎవరూ అడ్డగించలేకపోతున్నారు. నగరాధ్యక్షులు, పాలకులు ఏమీ చేయలేకపోతున్నారు. నగరంలోనివారు ఇదంతా వేడుకగా చూస్తున్నారు. "ఏమయింది, ఏమయింది?" అనుకుంటూనే రాత్రంతా గడిపివేస్తున్నారు.

హిందువులు "ఇక మహమ్మదీయ రాజ్యం అంతరించింది. హిందూరాజ్యం స్థాపితమయింది. మంచిపని జరిగింది" అని ఆనందిస్తున్నారు. మహమ్మదీయులు ఏడుపు దిగమింగుకుంటున్నారు.

ఈ సంగతులన్నీ కల్యాణి వరకు వెళ్లినాయి. బాలురు, వృద్ధులు, స్త్రీలు అందరికీ ఈ సంగతులు తెలిసినాయి. ఆమె తన మనసులో "ఓ జగదీశ్వరుడా! ఈనాటికి నీ కార్యం సఫలంగా నెరవేరిందా? నేడే నేను స్వామి దర్శనానికి బయలుదేరుతాను. నాకు సహాయం చేయి. అండదండలుగా ఉండు" అని భగవంతుని ప్రార్థించుకుంది.

కల్యాణి పక్కమీద నుండి లేచి కిటికీ తలుపు తెరిచి రహదారి వైపు చూచింది. రహదారి శూన్యంగా ఉంది. ఎవరూ కానరావడం లేదు. నెమ్మదిగా తలుపు తెరుచుకుని గౌరీదేవి గృహం విడిచింది. పూర్తిగా రోడ్డుమీదకు రాకుండానే మనసులో భగవంతుని స్మరించుకుంది, పదచిహ్న గ్రామానికి ఎలాగయినా తనను నిరపాయంగా చేరవేయమని.

కల్యాణి నగరద్వారం చేరుకుంది. కాపలామనిషి "ఎవరు వారు?" అని అడిగాడు. కల్యాణి భయపడిపోయి "నేను స్త్రీని!" అంది.

"వెళ్లటానికి అనుమతి లేదు" అన్నాడు కాపలాదారు. కాని ఈ మాటలు జమేదారు చెవిన పడ్డాయి. అతడు "వెళ్లటానికి అనుమతి అక్కర్లేదు. లోనికి రావటానికి మాత్రం అనుమతి కావాలి" అని హుకుం ఇచ్చాడు.

కాపలాదారు "అమ్మా! మీరు వెళ్లదలుచుకుంటే వెళ్లవచ్చును. నాకు అభ్యంతరం లేదు. కాని ఈ రాత్రి ఇలా ఒంటరిగా బయటకు వెళ్లడం అంత క్షేమకరం కాదు. ఎవరికి తెలుసునమ్మా, ఏ క్షణంలో ఏం విపత్తు జరుగుతుందో! దొంగల బారిన పడ్డావంటే చాల చిక్కులలో, ఇబ్బందిలో పడతావు. అందుకని ఇంతగా చెబుతున్నాను" అన్నాడు.

కల్యాణి, "బాబూ! నా దగ్గర ఏమున్నది దోచుకోవటానికి? దొంగలు నన్నేం చేయగలరు?" అంది.

"వయసు ఉందిగదమ్మా! పాపిష్టిది వయసు. దొంగలు నీ యవ్వనాన్నే దోచుకుంటారు" అన్నాడు.

కల్యాణి విపత్తును శంకించింది. కాని వడివడిగా ముందుకే నడిచింది.

ఆమె కొంతదూరం నడిచిన మీదట ఒక దుర్మార్గుడు కొంగుపట్టుకు లాగి "ఎవరు చంద్రముఖీ నీవు?" అని దారికి అడ్డుతగిలాడు. కాని అతడు అత్యాచారం చేయగలగడానికి ముందే వెనకనుంచి



బంకించంద్ర చటర్జీ

ఒక యువక సన్యాసి వచ్చి అతనిని దండించి పంపివేశాడు.

యువసన్యాసి కల్యాణితో "ఎక్కడకు వెడుతున్నావమ్మా?" అని అడిగాడు.

"పదచిహ్న గ్రామానికి."

సన్యాసి విస్మితుడైనాడు. "ఏమన్నావు? పదచిహ్నానికా?" ఇలా అంటూనే కల్యాణిని రెండు బాహువులలోను బంధించి ముఖకవళికలు పరిశీలించసాగినాడు. అకస్మాత్తుగా పురుషస్పర్శ కలగడంతో భయభీతితో రోమాంచిత అయి ఏడవసాగింది. పారిపోవటానికి శక్తి లేదు. అగంతకుడు ఆమె ముఖంలోనికి తీక్షణంగా చూచి "ఓహో! తెలిసింది. నీవు కల్యాణి అనే భూతానివి. కదూ?" అన్నాడు.



కల్యాణి భయవిహ్వల అయి "మీరెవరు?" అంది.

"నేను నీకు దాసానుదాసుడను. ఓ సుందరీ! నాపట్ల ప్రసన్నురాలవు అవు."

కల్యాణి గర్జిస్తూ "ఇలా అవమానించటానికేనా నన్ను మీరు ఆ దుర్మార్గుని నుండి రక్షించారు? బ్రహ్మచారులు, సన్యాసులు అవలంబించవలసిన ధర్మం ఇదేనా? ఇప్పుడు నేను నిస్సహాయను. లేకపోయి నట్లయితే జోడుతో నిన్ను దండించేదానను" అంది.

"నీవంటి కుసుమకోమల శరీరాన్ని స్పర్శించాలని చాలాకాలంగా కోరికగా ఉంది!" అంటూ బ్రహ్మచారి ఆమెను కౌగలించుకున్నాడు. ఆ కౌగలింతకు కల్యాణి నవ్వింది. "అలా చెప్పవేం మరి! నీవూ స్త్రీవేనంటే నేనంత ఉద్రేకపడకపోదునుగా" అంది. "అయితే మహేంద్రునికోసం వెదుక్కుంటూ వెదుతున్నావా?"

"నీవెవరు? నీకు అన్నీ తెలుసునా?"

"నేను సంతాన నాయకుడిని. మహేంద్రుడు కావాలంటే నీవిప్పుడు పదచిహ్నం వెళ్లనవసరం లేదు." కల్యాణి ఏడవసాగింది.

"ఎందుకు ఏడుస్తావు? నాతోరా. తీసుకు వెడతాను" అంది శాంతి. శాంతి కల్యాణిని తీసుకుని అరణ్యంలో ప్రవేశించింది.

**2**

శాంతి ఆ సాయంకాలం నగరంవైపు వెళ్లే ముందు జీవానందునితో ఇలా చెప్పింది. "నేను నగరానికి వెదుతున్నాను. మహేంద్రుని భార్యను తోడ్కొని వస్తాను. నీవు ఈలోపుగా మహేంద్రునకు అతడి భార్య జీవించే ఉన్నదని చెప్పు."

జీవానందుడు భవానందుని ద్వారా కల్యాణి వృత్తాంతం అంతా ఎరిగి ఉన్నాడు. ఈ కథనమంతా మహేంద్రునకు వినిపించాడు, క్రమక్రమంగా ముందు మహేంద్రుడు ఇదంతా యదార్థమని, తన భార్య జీవించే ఉన్నదని నమ్మటానికి నిరాకరించాడు. కాని చివరకు ఆనందాతిశయంతో అవాక్కయి ఉండిపోయాడు. ఆ రాత్రి నవీనానందుని సాయం వల్ల మహేంద్రుడు తన భార్యను కలుసుకోగలిగాడు.

మరునాడు ఉదయం నవీనానందునితో కల్యాణి "మీకు చాలా రుణపడి ఉన్నాం. మా అమ్మాయి సుకుమారి ఎక్కడున్నదో తెలియచేసి మీ ఉపకారానికి పరిపూర్ణతను తెచ్చుకోండి!" అంది.

శాంతి జీవానందుని వంక చూచి "నేనిప్పుడు నిద్రపోవాలి. రెండు రోజులుగా నాకు నిద్రలేదు. నేను కూడా మనిషినే కదా!" అంది.

కల్యాణి చిరునవ్వు నవ్వింది. మహేంద్రుని వంక చూచి జీవానందుడు "ఆ భారం నేను వహిస్తాను. మీరు పదచిహ్నా గ్రామానికి చేరుకోండి. మీ బిడ్డను మీకు అక్కడే అప్పగిస్తాను" అన్నాడు.

జీవానందుడు భర్కయాపుర నివాసి దగ్గరకి బిడ్డను తీసుకురావటానికి వెళ్లాడు.

నిమాయి పిల్లను ఇవ్వటానికి ముందు నిరాకరించింది. కాని జీవానందుడు ఊరడించి నచ్చ చెప్పిన మీదట సరేనంది.

**3**

పదచిహ్నా గ్రామంలో కొత్తదుర్గంలో నేడు మహేంద్రుడు, కల్యాణి, జీవానందుడు, శాంతి, నిమాయి, ఆమె భర్త, సుకుమారి అందరూ సమావేశం అయినారు. అందరూ ఆనందంగా ఉన్నారు. శాంతి ఇంకా నవీనానందుని వేషంలోనే వుంది. కల్యాణితో ఆమె ముందే చెప్పింది. తన ఉనికిగాని, తను జీవానందుని భార్యననిగాని మహేంద్రునితో చెప్పవద్దని!

ఒకరోజు కల్యాణి తన అంతఃపురంలోనికి నవీనానందుని పిలిపించింది.

నవీనానందుడు కాపలావారి అడ్డంకిని గమనించకుండానే అంతఃపురంలోనికి వెళ్లి "ఎందుకు నన్ను పిలిపించావు?" అంది.

"పురుషవేషంతో ఎన్నాళ్లుంటావు ఇంకా? నా పతి ముందు నీ వేషం విప్పివేద్దామని పిలిపించాను."

జీవానందుడు భవానందుని ద్వారా కల్యాణి వృత్తాంతం అంతా ఎరిగి ఉన్నాడు. ఈ కథనమంతా మహేంద్రునకు వినిపించాడు, క్రమక్రమంగా ముందు మహేంద్రుడు ఇదంతా యదార్థమని, తన భార్య జీవించే ఉన్నదని నమ్మటానికి నిరాకరించాడు. కాని చివరకు ఆనందాతిశయంతో అవాక్కయి ఉండిపోయాడు. ఆ రాత్రి నవీనానందుని సాయం వల్ల మహేంద్రుడు తన భార్యను కలుసుకోగలిగాడు.

"దీనివల్ల చాలా ఇబ్బందులు వస్తాయి కల్యాణీ!" అన్నాడు నవీనానందుడు, చాలాసేపు ఆలోచించి.

ఇద్దరూ ఈ విషయం తీవ్రంగా ఆలోచించసాగారు. నవీనానందుడు అంతః పురంలో ప్రవేశించాడని విని మహేంద్రుడు కూడా ఏమి జరుగుతుందో చూద్దామని వెనుకనే నడిచాడు. మహేంద్రుడు నేరుగా కల్యాణి గదిలోనికి వెళ్లాడు. నవీనానందుడు నిలువబడి ఉన్నాడు. కల్యాణి అతని వంటి మీది పులి చర్మాన్ని విప్పుతోంది. ఈ దృశ్యం చూచి మహేంద్రుడు ఆశ్చర్యపడ్డాడు. ఎంతో కోపంకూడా వచ్చింది.

నవీనానందుడు నవ్వుతూ మహేంద్రునివంక చూచి "ఏమి గోస్వామిజీ! సంతానులపై అవిశ్వాసం కలుగుతోందా?" అన్నాడు.

"భవానందుడు విశ్వసనీయుడేనా?" ,

"ఏమి, అతడి పులిచర్మాన్ని కల్యాణి విప్పినదా?" అంటూ నవీనానందుడు కల్యాణి చేతిని దొరకబుచ్చుకుని ఆమె పనికి అంతరాయం కలిగించాడు.

"అయితే ఏమి?" "నా పైన విశ్వాసము, కల్యాణి పట్ల అవిశ్వాసం ఎలా సాధ్యం అవుతాయి?"

మహేంద్రుడు అప్రతిభుడు అయినాడు. "అదేం? నేను అవిశ్వాసం ఎందుకు ప్రకటిస్తాను?"

"ఏమీ అనుమానం లేకపోతే నా వెనుకనే అంతఃపురంలోనికి చొరబడడం దేనికి?"

"కల్యాణితో కొద్దిగా మాట్లాడాలి. అందుకే వచ్చాను. అంతకంటే ఇంకేమీలేదు."

"అయితే ఇప్పుడు కాదు సమయం. నేను కూడా ఈమెతో ఏకాంతంలో కొంత మాట్లాడాలి. మీరు ఎప్పుడూ ఇక్కడే ఉంటారు గనుక తరువాత తీరుబడిగా మాట్లాడుకోవచ్చు. నాకు ఈ అవకాశాన్ని ఇవ్వండి" అన్నాడు నవీనానందుడు.

మహేంద్రుడు ఏమీ అనలేకపోయినాడు. అతడికి ఏమీ అర్థం కావడంలేదు. అపరాధం ఎక్కడ ఉన్నదో అసలు అర్థం కావడంలేదు. కల్యాణి వైఖరి కూడా విచిత్రంగా ఉంది. ఆమె కూడా తప్పు చేసినదాని మాదిరిగా పారిపోవడం లేదు. భయపడడంలేదు. సిగ్గు అభినయించడంలేదు. ఇటువంటి కల్యాణి అపరాధి ఎలా అవుతుంది? మహేంద్రుడు మనసు తర్కవితర్కాలతో నిండిపోయింది. శాంతి మహేంద్రుని మనసులో రగులుతున్న ఈ తర్జనభర్జనల దురవస్థ గమనించి కల్యాణికి ఏదో సైగచేసింది. కల్యాణి నవీనానందుని గడ్డం లాగివేసింది. నవీనానందుడు స్త్రీ అనే విషయం తేటతెల్లం అయింది. పులిచర్మం కూడా తీసి అవతల పెట్టింది. శాంతి దొరికిపోయినట్టుగా తలవాల్చుకుని నిలబడింది.

మహేంద్రుడు శాంతిని "నీవెవరు?" అని అడిగాడు.

"శ్రీమాన్ నవీనానంద గోస్వామి!"

"అది సరే! నీవు స్త్రీవి కదా?"

"చూస్తూనే వున్నారుగా!"

"సరే ఒకమాట చెప్పు, నీవు స్త్రీవయి ఉండి, జీవానందునితో పాటు ఎందుకు తిరుగుతున్నావు?"

"దీనికి జవాబు చెప్పకపోతేనేం?"

"నీవు స్త్రీవని జీవానందుడికి తెలుసా?"

"తెలుసు"

విశుద్ధాత్ముడైన మహేంద్రుడు ఇప్పుడు చాలా దుఃఖితుడైనాడు. ఈ దృశ్యం చూచి కల్యాణి మాట్లాడకుండా ఉండలేకపోయింది. "ఈమె జీవానంద స్వామివారి ధర్మపత్ని శాంతిమణీదేవి!" అంది.

మహేంద్రుని ముఖంలో ప్రసన్నత గోచరించింది. తరువాతి క్షణంలో అతని ముఖం తిరిగి గంభీరమైంది. కల్యాణి తెలుసుకుని ఇలా అంది.

"ఈమె పూర్ణ బ్రహ్మచారిణి!"

**(వచ్చేవారం ముగింపు)**



# పసితనం మీద పర్యావరణ మార్పు పడగ

ఇది యుద్ధాల యుగం కాదు. అలాగే ప్రపంచ యుద్ధం కూడా జరగడం లేదు. కానీ ప్రపంచంలో బాలల పరిస్థితి మాత్రం రెండో ప్రపంచ యుద్ధం నాటి అనూహ్య పరిస్థితికి సమీపంగా ఉంది. చాలా కారణాల వల్ల వారు ఎంతో విషాదభరితంగా జీవనం సాగిస్తున్నారు. ఇది యునిసెఫ్ (ఐక్యరాజ్య సమితి బాలల నిధి సంస్థ) తాజాగా ఇచ్చిన నివేదిక. ప్రపంచ వ్యాప్తంగా మూడు కోట్ల డెబ్బయ్ లక్షల మంది వరకు బాలలు వలసల కారణంగా నిరాశ్రయులయ్యారని యునిసెఫ్ డిసెంబర్ ఐదున ఇచ్చిన నివేదికలో వెల్లడించింది. 2023 సంవత్సరానికి గాను ఇచ్చిన 'చిన్నారుల కోసం మానవతా కార్యక్రమాల నివేదిక'లో ఆ సంస్థ చాలా విషయాలు తెలియచేసింది.

ప్రపంచ వ్యాప్తంగా చిన్నారులను ఇలాంటి దుస్థితికి నెట్టివేసిన కారణాలలో మొదటిది పర్యావరణ మార్పులు, దాని ఫలితాలు కావడం దిగ్భ్రాంతికి గురి చేస్తుంది. దానితో పాటు నానాటికీ పెరిగిపోతున్న వర్గ సంఘర్షణలు, రాజకీయ అనిశ్చిత స్థితి, కొవిడ్ 19 తెచ్చిన విపత్తుతో వలస పోవడం కూడా ఉన్నాయి. ఇంకా ఉక్రెయిన్ యుద్ధం, ఆహార అభద్రత కూడా కారణాలుగా కనిపిస్తున్నాయి. ఈ ఏడాది ఉక్రెయిన్‌లో చలి, హిమపాతం రికార్డు స్థాయిలో నమోదవుతున్నాయి. అసలే రష్యా యుద్ధంతో కకావికలైన ఉక్రెయిన్ బాలలకు ఇది అదనపు పీడ. అయితే ఉక్రెయిన్, పాకిస్తాన్ పరిణామాల కారణంగా నిరాశ్రయులైన చిన్నారులను యునిసెఫ్ ఈ నివేదికలో చేర్చలేదు. అయినా 2022 సంవత్సరంలో సంభవించిన విపరిణామాల కారణంగా మానవతా సాయం కోసం వేచి ఉన్న వారి సంఖ్య ఇరవై కోట్ల డెబ్బయ్ లక్షలకు చేరుకుంది. పరిస్థితుల కారణంగా ఆఫ్ఘనిస్తాన్, ఉక్రెయిన్‌లలో యునిసెఫ్ బాలలకు అందించవలసినంత సాయం అందించలేక పోతోంది. సిరియా వంటి దేశాలలో చిన్నారుల పరిస్థితి మరొక రకంగా ఉంది. అక్కడ దాదాపు పుష్కరం క్రితమే ఘర్షణ వాతావరణం ఏర్పడింది. అక్కడ నుంచి వలస వస్తున్న వారు ప్రధానంగా టర్కీ, ఇరాక్, ఈజిప్ట్‌లకు చేరుతున్నారు. వలస వచ్చినప్పటికి కూడా ఆయా దేశాలలో వీరికి ప్రతికూల వాతావరణమే ఉంది. స్థానికులు వీరి పట్ల తీవ్ర వ్యతిరేకతతో ఉంటారు. అలాగే ఉక్రెయిన్ పరిస్థితి మరొక విధంగా ఉంది. ఆ దేశానికి వెళ్లడానికి స్వచ్ఛంద సంస్థలను నిబంధనలు ఇబ్బంది పెట్టడం లేదు. ఈ ఏడాది ఫిబ్రవరిలో రష్యా దాడికి దిగిన వెంటనే చాలా పాశ్చాత్య దేశాలు ఆ దేశానికి సాయం అందించడం మొదలుపెట్టాయి. మిగతా దేశాల పిల్లలతో పోలిస్తే ఇక్కడి వారికి సాయం బాగానే అందింది. మంచి వైద్య సహాయంతో పాటు, పదమూడు లక్షల మంది పిల్లలకు శుభ్రమైన తాగునీటిని అందుబాటులోకి తెచ్చారు. నాలుగు లక్షల కుటుంబాలలోని చిన్నారులకు చదువుకు కూడా సాయం అందింది. అయినప్పటికి వారికి ఈ శీతాకాలం ఒక గండమేనని యునిసెఫ్ అభిప్రాయం.

బాలలు ఇలాంటి దుస్థితిలోకి వెళ్లిపోవడం, మానవతా సాయం కోసం ఎదురు చూపులు చూడడం 2015 నుంచి మూడు రెట్లు పెరిగిందని యునిసెఫ్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ మారియా వెరా చెప్పారు. కొవిడ్ అనేక విపత్తులనే కాదు, వైద్య విధానాన్ని కూడా తీవ్రంగా బలహీన పరిచింది. మానవతా సాయం కోసం ఎదురు చూడడం లేదా నిరాశ్రయులుగా మారిపోవడం అనేది ఇంకాస్త పెరిగే సూచనలే మారియా మాటలలో ధ్వనిస్తున్నాయి. ఎందుకంటే ప్రపంచ వ్యాప్తంగా సంఘర్షణలకు ఆలవాలంగా ఉన్న ప్రాంతాలలో నలభయ్ కోట్ల మంది చిన్నారులు ఉన్నారు. ఇందులో కోటి మంది పిల్లలు అలాంటి ప్రమాదానికి మరింత చేరువలో ఉన్నారు. ఆ ప్రాంతాలన్నీ సాయుధ సంఘర్షణలలో మునిగి తేలుతున్నాయి. ఇదంతా పిల్లల సంక్షేమానికి అందే వనరుల మీద, మానవతా దృక్పథం మీద ప్రభావం చూపుతుంది. మరొక విషాదం ఇలా నిరాశ్రయులవుతున్న చిన్నారులలో దాదాపు అరవై లక్షల మంది మీద లైంగిక అత్యాచారాలు, ఇతర దాడులు కూడా జరిగాయి.

పర్యావరణ మార్పులు తెస్తున్న ఫలితాలు ఇప్పటికే ప్రపంచ వ్యాప్తంగా లక్షలాది మంది చిన్నారుల మీద ప్రభావం చూపుతున్నాయి. కొన్ని ఆఫ్రికా దేశాలలో ప్రబలుతున్న దుర్భిక్షం, పాకిస్తాన్‌ను వణికించిన వరదలు ఇందుకు ప్రధాన కారణాలుగా కనిపిస్తున్నాయి. ఇవన్నీ కలిపి మూడు కోట్ల డెబ్బయ్ లక్షల మంది చిన్నారులను నిరాశ్రయులను చేస్తున్నాయి. ఈ సమీప గతంలో ఇలాంటి దారుణ పరిస్థితి సంభవించలేదు. ఇలాంటి బాలలందరికీ మానసిక స్థైర్యం కల్పించడంతో పాటు పరిశుభ్రమైన తాగు నీరు అందించవలసిన అవసరం ఉంది. ఇదేకాదు, ఇంతకాలం ఇలాంటి బాలలకు అందిస్తున్న సేవలు, అందుకు ఉపయోగపడుతున్న వ్యవస్థ ఇప్పుడు ఏ మాత్రం చాలదని యునిసెఫ్ అధికారులు చెబుతున్నారు. అందుకే ప్రపంచ దేశాలు స్పందించి వందకోట్ల డాలర్లు వరకు సాయంగా అందించాలని మారియా కోరుతున్నారు. ★

unicef

**"ప్రకృతి రక్షతి రక్షితః .. ప్రకృతిని మనం రక్షిస్తే, అది మనల్ని రక్షిస్తుంది". కానీ, పర్యావరణంలో మానవ జోక్యం భూమి మీద విధ్వంసం ముప్పును పెంచింది. దీంతో వాతావరణంలో కొన్నిచోట్ల అనూహ్య మార్పులు చోటుచేసుకోగా - మరోవైపు వరదలు, తుపానులు, సముద్రమట్టం పెరగడం, కొండ చరియలు విరిగిపడటం, కార్చిచ్చు, అంటార్కిటికాలో మంచు కరగడం మామూలై పోయింది. ఈ విపరీత పరిస్థితుల మధ్య మానవాళి రక్షణకు పర్యావరణ హిత జీవనశైలి ఒక్కటే మార్గం. ఈ లక్ష్యంతో ప్రధాని నరేంద్ర మోదీ ప్రారంభించిన "మిషన్ లైఫ్" కార్యక్రమం నేడు ప్రపంచ ప్రజా ఉద్యమంగా మారుతోంది. గ్లాస్గో వాతావరణ మార్పు సదస్సు తర్వాత ఈజిప్టులో కాప్-27 సందర్భంగా ప్రపంచానికి భారత్ ఓ సరికొత్త మార్గం చూపింది. కొన్ని దశాబ్దాలుగా ప్రపంచం అనూహ్య విపత్తులను ఎదుర్కొనడాన్ని బట్టి వాతావరణ మార్పు దుష్ప్రభావాలు ఎలాంటివో స్పష్టంగా గుర్తించవచ్చు.**



# పర్యావరణం ద్వారా.. పర్యావరణం కోసం.. పర్యావరణ హిత జీవనం

నేడు మన హిమానీనదాలు కరిగిపోతూండగా సముద్రమట్టం పెరిగిపోతోంది. నదులు ఎండి పోతుంటే వాతావరణం నానాటికీ అనిశ్చితమవు తోంది. ఈ పరిణామాలతో వాతావరణ మార్పు సమస్య పరిష్కారానికి విధాన రూపకల్పన మాత్రమే చాలదనే ఆలోచన ప్రజల్లో కలుగుతోంది. వ్యక్తిగానే కాకుండా ఓ కుటుంబంగా, సమాజంగా, భూమాత పట్ల మన వంతు బాధ్యత నిర్వర్తించాలని ప్రజలు తమంతట తాము గ్రహిస్తున్నారు. భూమాత రక్షణకు వ్యష్టిగా, కుటుంబంగా, సమష్టి కృషితో చేపట్టగల వివిధ చర్యలేమిటో తెలుసుకోవాలనే ఆసక్తి వారిలో కలుగుతోంది. ఈ ప్రశ్నలన్నింటికీ "మిషన్ లైఫ్" జవాబిస్తుంది. "పర్యావరణం కోసం జీవనశైలి" అన్నదే "మిషన్ లైఫ్" తారకమంత్రం. అంటే- పర్యావరణహిత జీవనశైలి. అక్టోబర్ 20న, సర్దార్ పటేల్ 'ఐక్యతా ప్రతిమ' వద్ద ఐక్యరాజ్య సమితి ప్రధాన కార్యదర్శి ఆంటోనియో గుటెరెజ్ సమక్షంలో నరేంద్ర మోదీ "మిషన్ లైఫ్"కు శ్రీకారం చుట్టారు. భూగోళం రక్షణ కోసం ప్రజాబలాన్ని సమ్మిళితం చేస్తూ వారి సమష్టి శక్తియుక్తుల వినియోగం ఎలాగో నేర్పుతుంది. వాతావరణ మార్పులపై పోరును "మిషన్ లైఫ్" ప్రజాస్వామ్యబద్ధంగా విస్తరిస్తూ ప్రతి ఒక్కరూ తమ సామర్థ్యానికి తగినట్లు సహకరించేలా చేస్తోంది. ఒక చిన్న ప్రయత్నం కూడా బలమైన ప్రభావం చూపగలదన్నది "మిషన్ లైఫ్" దృఢ విశ్వాసం. మన దైనందిన జీవనంలో పర్యావరణ పరిరక్షణ ఎలా, ఎంతవరకూ సాధ్యమో "మిషన్ లైఫ్" చూపుతుంది. జీవనశైలిలో మార్పుల ద్వారా పర్యావరణ రక్షణ సాధ్యమేననే నమ్మకాన్ని ప్రోత్సహిస్తుంది. పర్యావరణ హిత జీవన మంత్రం- "మిషన్ లైఫ్" గ్లాస్గోలో నిర్వహించిన కాప్-26 సదస్సులో ప్రధాని 2021 నవంబరు 1న "లైఫ్" (LiFE) భావనను పరిచయం చేశారు. ఈ నేపథ్యంలో 2022 జూన్ 5న ప్రపంచ పర్యావరణ దినోత్సవం నాడు భారతదేశం 'లైఫ్' ప్రపంచ ఉద్యమాన్ని ప్రారంభించడం ద్వారా ఈ ఉద్యమాన్ని ముందుకు నడిపింది. ఇందులో పాలు పంచుకోవాల్సిందిగా విద్యావేత్తలు, పరిశోధకులు, అంకుర సంస్థలకు ఆహ్వానం పలికింది. పర్యావరణ సంక్షోభానికి స్వస్తిపలికే దిశగా సమష్టి కార్యాచరణ సంపూర్ణ సామర్థ్యాన్ని సద్వినియోగం చేసుకునేలా ప్రపంచ వ్యాప్తంగా శాస్త్రీయ పరిష్కార అన్వేషణను ప్రోత్సహించే మార్గాలను కనుగొనాల్సిందిగా కోరింది. ఈ కార్యక్రమానికి రికార్డు స్థాయిలో ప్రపంచ దేశాధినేతల మద్దతు లభించింది. వాతావరణ మార్పుపై ఒడంబడికపట్ల భారత్ నిబద్ధతను ప్రదర్శించే శాస్త్రీయ, నిర్దిష్ట కార్యక్రమం ద్వారా 'లైఫ్' ఆలోచనలు, ఆదర్శాలను 'మిషన్ లైఫ్' ఉద్యమ స్థాయిలో కార్యాచరణగా మలుస్తుంది. ఈ మేరకు పర్యావరణ రక్షణ కోసం 2022-2027 మధ్య భారతీయులు సహా ప్రపంచవ్యాప్తంగా కనీసం 100 కోట్ల మంది పౌరులను వ్యష్టి, సమష్టి కార్యాచరణ దిశగా నడిపించే లక్ష్యంతో 'మిషన్ లైఫ్' రూపొందింది. ఆ మేరకు 2028కల్లా దేశంలోని అన్ని గ్రామీణ, పట్టణ స్థానిక సంస్థలలో కనీసం 80 శాతం పర్యావరణ హితం కావాలన్నది భారత్ నిర్దేశించుకున్న లక్ష్యం. నిరుడు బ్రిటన్‌లోని గ్లాస్గోలో కాప్-26 సదస్సులో ప్రధానమంత్రి తొలిసారి 'మిషన్ లైఫ్'ను ప్రతిపాదించారు. ఈ నేపథ్యంలో ఈజిప్టులోని షర్మ్ ఎల్-షేక్‌లో 2022 నవంబర్ 6-18 మధ్య నిర్వహించిన కాప్-27 సదస్సులో భారత పెవిలియన్ ను 'లైఫ్' ఇతివృత్తంగా ఏర్పాటు చేశారు. దీని గురించి కేంద్ర పర్యావరణ-అటవీ- వాతావరణ మార్పుల శాఖ మంత్రి భూపేంద్ర యాదవ్ మాట్లాడుతూ, సంక్లిష్టమైన వాతావరణ మార్పు సమస్యకు ప్రధాని మోదీ సరళ పరిష్కారం చూపారని పేర్కొన్నారు. పర్యావరణ పరిరక్షణ కార్యాచరణ మూలాల నుంచి, వ్యక్తిగత స్థాయిలో మొదలు కాగలదన్నది భారత్ విశ్వాసమని స్పష్టం చేశారు. అందుకే "పర్యావరణం కోసం జీవనశైలి-లైఫ్" ఇతివృత్తంగా పెవిలియన్ రూపొందించామని వివరించారు. ఇందులో వివిధ దృశ్య-శ్రవణ చిహ్నాలు, 3డి నమూనాలు, ఇతర ఏర్పాట్లు, అలంకరణలు, అనుబంధ కార్యక్రమాల ద్వారా 'మిషన్ లైఫ్' సందేశం వినిపిస్తారు. శతాబ్దాలుగా భారతీయ నాగరికత అనుసరిస్తున్న, ఆచరిస్తున్న సుస్థిర జీవనశైలి ఈ పెవిలియన్ రూపకల్పనకు మార్గదర్శకం. భారతీయ సంస్కృతి అంటేనే పర్యావరణహిత అలవాట్లకు ప్రతిబింబం. సహజ ప్రకృతికి గౌరవమిచ్చే అనేక పద్ధతులు దైనందిన జీవితంలో అంతర్భాగం. వాతావరణ మార్పుపై మన పోరాటంలో ఈ పద్ధతులన్నీ ఎంతో ప్రధానమనే వాస్తవం తప్పక రుజువవుతుంది. వెయ్యేళ్లకు పైగా తరతరాలకూ అందుతున్న ఈ లోతైన సుస్థిర జ్ఞానమే భారత ప్రధాని మోదీకి స్ఫూర్తినిచ్చింది. ఆ మేరకు భూగోళం మనుగడ, శ్రేయస్సుపై గణనీయ సానుకూల ప్రభావం లక్ష్యంగా ప్రపంచానికి 'లైఫ్' తారకమంత్రాన్ని ఆయన అందించారు. అలాగే

ప్రపంచ వాతావరణ సంక్షోభాన్ని ఎదుర్కోవడంలో భారత్ వంతు కృషిలో 'మిషన్ లైఫ్' ఒక భాగం. ఆధునిక ప్రపంచంలో సుస్థిర జీవనశైలిని అనుసరించే వారిని "భూమి సంక్షేమానికి శ్రమించే వ్యక్తులు"గా మార్చడానికి ఇది కృషి చేస్తుంది. ఆ మేరకు పెవిలియన్ చిహ్నంలో భూమికి సంకేతంగా ఆకుపచ్చ రంగు వాడారు. వివిధ ప్రభుత్వ కార్యక్రమాల ద్వారా ప్రకృతితో సమతౌల్యం, సామరస్యం కలిగి ఉండటాన్ని ఇది చూపుతుంది. చిహ్నంలోని కేంద్ర భాగం సూర్యునితో ప్రకృతి సమతౌల్యాన్ని చూపుతుంది. అందులో వృక్షాలు, పర్వతాలు, నీరు, జీవవైవిధ్యం భాగంగా ఉన్నాయి. ఇక దీని నినాదం అందరికీ సుఖజీవనం కాంక్షించే మంత్రం ''సర్వే భవన్తు సుఖినః'' స్ఫూర్తితో రూపొందించారు. కాబట్టే 'మిషన్ లైఫ్'ను ప్రధాని 'పి-3' ('ప్రో ప్లానెట్ పీపుల్') నమూనాగా అభివర్ణించారు. ఇది "భూగోళం ద్వారా... భూగోళం కోసం.. భూగోళం జీవనశైలి" అంటే- 'పర్యావరణం ద్వారా.. పర్యావరణం కోసం.. పర్యావరణ హిత జీవనశైలి' అనే ప్రాథమిక సూత్రాల ఆధారంగా పని చేస్తుంది. పర్యావరణం మీద భారత్ నిబద్ధతపై ఐక్యరాజ్య సమితి ప్రధాన కార్యదర్శి ఆంటోనియో గుటెరెజ్ తన అభిప్రాయం వెల్లడిస్తూ- "పర్యావరణ సంబంధిత విధానాల అమలులో భారత్ నిబద్ధత సంతోషం కలిగించింది. ఈ కార్యక్రమాన్ని ముందుకు తీసుకెళ్లడంలో భారత్‌తో కలసి కృషి చేయడానికి నేనెంతగానో ఎదురు చూస్తున్నాను" అన్నారు.

కాప్-27లో భారత్ ఏం చెప్పిందో దాని అమలుకు సమయం ఆసన్నమైంది. ఆచరణాత్మక విధానం ద్వారా నిర్దిష్ట వ్యవధిలో పరిష్కారాన్వేషణ సాధ్యమేనని భారత్ నాయకత్వం స్పష్టం చేసింది. ఈ వాతావరణ మార్పు సమస్యకు తాను అవరోధం కాదని, ఒక పరిష్కారమని భారతదేశం రుజువు చేసుకుంది. పర్యావరణ పరిరక్షణ ఆవశ్యకత పెరుగుతున్న నేపథ్యంలో వాతావరణ మార్పులపై ప్రపంచం ఎందుకు తీవ్రంగా ఆలోచించాల్సి వచ్చిందో అర్థం చేసుకోవడం కూడా అవసరం. భూతాపం కారణంగా మానవాళి మనుగడకే ముప్పు వాటిల్లుతోంది. భూతాపం 1.5 డిగ్రీల సెల్సియస్ దాకా పెరగవచ్చని శాస్త్రవేత్తలు అంచనా వేస్తున్నట్లు మీడియా కథనాల పేర్కొంటున్నాయి. అయితే, వాతావరణంలో కర్బన ఉద్గారాల పెరుగుదల వేగాన్నిబట్టి చూస్తే 21వ శతాబ్దం చివరి నాటికి భూతాపం పెరుగుదల 3 డిగ్రీల సెల్సియస్ దాకా ఉండవచ్చునని అంచనా.

కాగా, దశాబ్దానికి పైగా పర్యావరణ పరిరక్షణ కృషి కొనసాగుతోంది. అయినప్పటికీ అభివృద్ధి చెందిన, వర్ధమాన, అల్ప ప్రగతి దేశాల అభివృద్ధిలో అసమతౌల్యం వల్ల కచ్చితమైన పరిష్కారం లభించడం లేదు. ఈ అంశంపై మేధోమథనం కోసమే ఐక్యరాజ్య సమితి గత సంవత్సరం గ్లాస్గోలో వాతావరణ మార్పుపై శిఖరాగ్ర సదస్సు 'కాప్-27' నిర్వహించింది. ఈ సందర్భంగా ప్రణాళికల అమలుపై భారత్ తన గళాన్ని గట్టిగా వినిపించడంతో ఈ వాతావరణ సదస్సుకు ప్రాముఖ్యం ఏర్పడింది. మిషన్ లైఫ్ ద్వారా వాతావరణ మార్పు సవాళ్ల పరిష్కారం లేదా పంచామృతం ద్వారా ప్రపంచానికి మార్గనిర్దేశం చేయడంలో భారత్ సదా ఒక ఉదాహరణగా నిలుస్తోంది.

భారతదేశ పునరుత్పాదక ఇంధన సామర్థ్యం



2014లో కేవలం 20 గిగావాట్లకు పరిమితం కాగా, 2022 నాటికి 100 గిగావాట్ల స్థాయికి చేరాలని ప్రధాని మోదీ లక్ష్యం నిర్దేశించారు. అయితే, సదరు గడువుకు ఎంతో ముందుగానే ఈ లక్ష్యాన్ని సాధించడం ద్వారా భారత ప్రపంచానికి సరికొత్త మార్గం చూపింది. అంతేకాదు.. సౌరశక్తి ధర యూనిట్ రూ.16 నుంచి నేడు రూ.2కి దిగివచ్చింది. మరోవైపు 2015లో అంతర్జాతీయ సౌర కూటమి (ఐఎస్ఏ)కి భారతదేశం పునాది వేసింది. సౌరశక్తి అన్నిటికన్నా గొప్ప ప్రత్యామ్నాయం. ఈ నేపథ్యంలో 'ఐఎస్ఏ' పురోగమనం ఫలితంగా ప్రపంచంలో జీవ ఇంధనంతో వాణిజ్య విమానాలు నింగికెగిరిన ఏకైక దేశంగా భారత్ పరిగణనలోకి వచ్చిందనవచ్చు. సౌర శక్తి రంగంలో బ్యాటరీ నిల్వ ఒక సవాలు కాగా, దీని పరిష్కారానికి భారత్ నిర్విరామంగా కృషి చేస్తోంది. అలాగే 2030 నాటికి రైల్వేలను హరిత ఇంధన చోదితం చేయడం లక్ష్యంగా పెట్టుకుంది. తద్వారా 60 మిలియన్ టన్నుల కర్బన ఉద్గారాలను తగ్గించవచ్చు.

ఇక 2050 నాటికి నికరశూన్య ఉద్గార లక్ష్యంతో భారత పరిశ్రమలు సరికొత్త సాంకేతిక పరిజ్ఞానాలను అందిపుచ్చుకుంటున్నాయి. అందువల్ల ప్రధానమంత్రి ఆశించిన మేరకు వంద కోట్ల టన్నుల కర్బన ఉద్గారాల తగ్గింపు లక్ష్యాన్ని భారత్ సులువుగా సాధించే వీలుంది. వ్యక్తులు, సమాజం చేసే సాధారణ కృషి కూడా భారీ ఫలితాలకు దోహదం చేస్తుంది. ఎల్ఇడి బల్బుల వినియోగమే ఇందుకు నిదర్శనం. కేంద్ర ప్రభుత్వం ఎల్ఇడి బల్బుల పంపిణీ పథకం ప్రారంభించినప్పుడు దేశంలోని ప్రైవేట్ రంగం కూడా అందులో 'భాగస్వామి' అయింది. దీంతో స్వల్ప వ్యవధిలోనే దేశపౌరులు తమ ఇళ్లలో 160 కోట్లకు పైగా ఎల్ఇడి బల్బులు అమర్చుకున్నారు. ఈ ప్రభావంతో కార్బన్ డై ఆక్సైడ్ విడుదల 100 మిలియన్ టన్నుల మేర తగ్గింది. ఫలితంగా ఇవాళ ప్రపంచ వార్షిక తలసరి కర్బన ఉద్గారాల సగటు 4 టన్నులతో పోలిస్తే భారతదేశంలో తలసరి సగటు కేవలం 1.5 టన్నులుగా మాత్రమే నమోదవుతోంది.

అయినప్పటికీ, వాతావరణ మార్పు వంటి అంతర్జాతీయ సమస్యల పరిష్కారంలో భారత్ ముందంజలో ఉంది. బొగ్గు, కలప పొగను వదిలించుకునే దిశగా 'ఉజ్వల' పథకాన్ని ప్రారంభించింది. ప్రతి జిల్లాలో 75 అమృత సరోవరాల ఏర్పాటుకు కృషి మొదలైంది. భారత్ ఇవాళ ప్రపంచంలో నాలుగో అతిపెద్ద పునరుత్పాదక ఇంధన సామర్థ్యంగల దేశం కాగా- పవన శక్తిరీత్యా నాలుగో స్థానంలో, సౌర శక్తి రీత్యా ఐదో స్థానంలో ఉంది. ఆ విధంగా నేడు భారతదేశం పురోగమన పథంలో సాగుతూ ప్రకృతితో సామరస్యంగా జీవించే మార్గం రూపొందిస్తోంది. ఇవాళ భారత్ ప్రపంచంలో ఐదో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించింది. మన అటవీ విస్తీర్ణమే కాకుండా వన్యప్రాణుల వైవిధ్యం, సంఖ్య కూడా పెరుగుతోంది.

"ఒకే సూర్యుడు-ఒకే ప్రపంచం-ఒకే గ్రిడ్" నినాదం కూడా మన సంకల్పాలను బలోపేతం చేస్తోంది. ఈ క్రమంలో 'మిషన్ లైఫ్' తదుపరి దశగా ఉంటుంది. గతం నుంచి నేర్చుకోవడం ద్వారానే మనం ఉజ్వల భవిష్యత్తును నిర్మించుకోగలం. భారతదేశానిది వేల ఏళ్లుగా ప్రకృతిని ఆరాధించే సుసంపన్న సంప్రదాయం. మన పూర్వీకులు అనుసరించిన, మన జీవితంలో భాగం చేసుకోదగిన ప్రకృతి పరిరక్షణ హిత జీవనశైలి 'మిషన్ లైఫ్' ప్రోత్సహిస్తుంది.

**'న్యూ ఇండియా సమాచార్' నుండి**

డిసెంబర్ 16 ధనుర్మాసారంభం

సూర్యుడు ధనూరాశిలో ప్రవేశించిన నాటి నుంచి నెలరోజుల కాలాన్ని ధనుర్మాసం అంటారు. ఆహ్లాదం, ఆనందం కలిగించేవి తానేనని శ్రీకృష్ణపరమాత్ముడు చెప్పుకున్న సందర్భంలో 'మాసానాం మార్గశీర్షోహం ఋతూనాం కుసుమాకరః' (భగవద్గీత :10-35) అన్నారు. మార్గశీర్షం ధనుర్మాసం కావడం వల్ల భగవత్సంబంధిత పూజాపునస్కారాలు నిర్వహించడం విదితమే. పంటలు చేతికి వచ్చే ఆనంద దాయక సమయం. ఇంటింటా గొబ్బెమ్మలు పెట్టడం, హరిదాసుల నగర సంకీర్త నలు, గంగిరెద్దుల ఆటలు లాంటివి తెలిసినవే. మార్గశిర ఏకాదశి నాడే భగవానుడు అర్జునుడికి 'గీత' బోధించాడు. సమశీతోష్ణస్థితి నెలకొంటుంది కనుక ఈ మాసం ప్రాణులకు ఆహ్లాదకరంగా ఉంటుంది. లోక శ్రేయస్సుతో పాటు స్వకల్యాణాన్ని అపేక్షించిన గోదాదేవి తమ ఆరాధ్య దైవం శ్రీకృష్ణుడిని ప్రసన్నం చేసుకునేందుకు ధనుర్మాస వ్రతం పాటించి రోజుకొకటి చొప్పున మాసం పాటు ముప్పయ్ కీర్తనలు (తమిళంలో పాశురాలు) ఆలపించడం మరో ప్రత్యేకత.



# విష్ణుదేవుని మాసం

విష్ణుదేవుడే మాస రూపమైన అపురూప సందర్భం ధనుర్మాసం. శ్రీమన్నారాయణుడి ఆరాధనకు అనువైన కాలంగా ప్రసిద్ధి. ఈ మాసంలో విష్ణ్వారాధన చేస్తే వెయ్యేళ్లపాటు చేసే శుభకర్మల ఫలితం లభిస్తుందని బ్రహ్మాండ, స్కంద, ఆదిత్య పురాణాలు పేర్కొంటున్నాయి. దీనికి పరిపూర్ణత్వం కలిగించేదే తిరుప్పావై. ధనుర్మాసం లేదా శ్రీవతంగా ఈ మాసంలో మొదలవుతుంది.

మార్గశీర్షం... 'మార్గం' అంటే దారి. శిరము అంటే తల. మానవ శరీరానికి తల దిశానిర్దేశం చేసినట్లే మార్గశీర్ష మాసం ఆధ్యాత్మికతవైపునకు దారి చూపుతుందని చెబుతారు. ధనుర్మాసం విశిష్టతను బ్రహ్మ మొదట నారదుడికి వివరించినట్లు పురాణ కథనం. బ్రహ్మాండ, ఆదిత్య పురాణాలలోనూ, నారాయణ సంహితలో ధనుర్మాస వ్రతానికి సంబంధించిన అంశాలు కనిపిస్తాయి. బాల్యం నుంచి భక్తి, జ్ఞానాది సుగుణాలు కలిగిన గోదాదేవి తనను భగవంతునికి అర్పించుకునేందుకు 'కాత్యాయని వ్రతం' అనే ధనుర్మాస వ్రతాన్ని నియమనిష్ఠలతో ఆచరించింది.

భారతీయ భక్తి సాహిత్యంలో ఆళ్వార్ దివ్య ప్రబంధాలు అత్యంత ప్రముఖ స్థానాన్ని అలంక రించగా, శ్రీకృష్ణుడిని స్తుతిస్తూ శ్రీఆండాళ్ గానం చేసిన ముప్పయ్ కీర్తనల (పాశురాలు) సంపుటి 'తిరుప్పావై' దివ్యప్రబంధంగా శిఖరాయమానంగా వెలుగొందుతోంది. తిరుప్పావై ఉపనిషత్తుల సారమని, అవి గోదాదేవి నోట సర్వ సులభరీతిలో పాశురాలుగా వెలువడ్డాయని పూర్వాచార్యులు అభివర్ణించారు.

విష్ణుచిత్తుడి (పెరియాళ్వార్) కుమార్తె గోదాదేవి భగవంతుడినే పరిణయమాడాలన్న సంకల్పంతో పాటు సమాజహితం కోసం దీక్ష బూనింది. ఆ క్రమంలోనే ధనుర్మాసంలో వేకువనే మేల్కొని స్నేహితురాళ్లతో కలసి హరి పూజ చేస్తూ, ఆ అనుభవాలను రోజుకు ఒక కీర్తన (పాశురం)గా రాసి శ్రీకృష్ణ అంశ శ్రీరంగనాథుడికి అర్పించింది. 'తిరుప్పావై' అనే ఈ తమిళ పదానికి 'తిరు' అంటే శ్రీ, శ్రీప్రదం, లక్ష్మి, సంపద, శ్రేష్ఠం, ఐశ్వర్యం, మోక్షం అనే అర్థాలు ఉన్నాయి. 'పావై' అంటే పాట(లు) లేక వ్రతమని అర్థం. దీనినే శ్రీ వ్రతం, ధనుర్మాస వ్రతం, సిరినోము అనీ అంటారు.

సమాజానికి హితం కలిగించేదే సాహిత్యమనే ఆలం కారికులు అభిప్రాయం ప్రకారం, గోదాదేవి ఆలపించిన పాశురాలలో సమాజశ్రేయస్సు కనిపిస్తుంది. శ్రీరంగనాథుని పరిణయమాడాలన్న అభిమతంతో పాటు సాహిత్యం ద్వారా సమాజ హితాన్ని కోరిన సౌజన్యమూర్తిగా ఆమె సాక్షాత్క రిస్తారు. కేవలం వ్యక్తిగత ప్రయోజనాలే కాకుండా సమష్టి లబ్ధి చేకూరాలన్న భావన ఇందులో వ్యక్తమవు తుంది. 'ఏడాదికి మూడు పంటలు పండాలి. చాలినంత వర్షం కురవాలి. గోవులు సమృద్ధిగా పాలు ఇవ్వాలి. ఏ సందర్భంలోనూ 'లేదు' అనే మాట వినిపించకూడదు' అని ఒక పాశురంలో ఆకాంక్షించడం గోదా లోక కల్యాణాభి లాషకు ఉదాహరణ. మంచి అలవాట్లతో జీవించాలని, తోటి వారికి సాయపడాలని, భగవంతుడిని ఆరాధించాలని ఈ పాశురాలు ప్రబోధిస్తాయి. వీటిలో పరమాత్ముని తీరు, ఆయనను చేరేందుకు అనుసరించవలసిన మార్గాలు, పల్లెల అందాలు, ఉదయం కాలపు వర్ణనలు ఉంటాయి.

తమిళనాడులోని శ్రీవిల్లిపుత్తూరులో ముకుందా

చార్యులు, పద్మావతి దంపతులకు జన్మించిన భట్టనాథుడు (విష్ణు చిత్తుడు) తన జీవితాన్ని భగవత్ సేవకు అంకితం చేశారు. వటపత్రసాయికి నిత్యం తులసి, పూమాలలను సమర్పిస్తూ, తాను రాసిన పన్నెండు కీర్తనలు (తిరుపల్లాణ్డు) గానం చేస్తూ మంగళం పాడేవాడు.

**'కర్కటే పూర్వ ఫల్గున్యాం తులసీకాననోద్భవామ్**
**పాండ్యే విశ్వంభరాంగోదాం వందేశ్రీరంగ నాయకీమ్'**

రంగనాథ పెరుమాళ్ పుష్పకైంకర్యం కోసం ఆయన పెంచుతున్న పూలు, తులసివనంలో కర్కాటక మాసం, పుబ్బ నక్షత్రంలో చిన్నారి లభించింది. ఆనంతపరవశు డైన ఆయన పూలమాల అని అర్థం వచ్చేలా చిన్నారికి 'కోదై' అని పేరుపెట్టారు. ఆ పదమే 'గోదా' అని సంస్కృతీక మైంది. భూమిని 'గో' అంటారు. ఆండాళ్ భూదేవి అంశ కనుక, 'గోదా' అనే పేరు కలిగిందని వ్యవహారంలో ఉంది. జానకీమాతలా భూజాత అయిన ఆమెను విష్ణుచిత్తులు 'ఆండాళ్' (కాపాడునది) అని సంబోధించారు. 'తనను తరింపచేసేందుకు ఆమె తన కుమార్తెగా లభించిందని ఆయన భావన.

పాలక జనకుడు విష్ణుచిత్తుడు శ్రీకృష్ణ వైభవాన్ని వినిపిస్తుంటే చిన్నారి తనయ గోదాదేవి వైమరచి ఆలకించేది. శ్రీకృష్ణుడి బాల్యంలోని గోపికలలో తాను ఒకరిగా, ఉద్యానవనంలోని తండ్రి కుటీరాన్నే యదునంద నుడి రాజ్యంగా భావించుకునేది. ద్వాపరంలో యాదవ కన్యలు జరిపిన ఉత్సవాలను మానసికంగా తనకు అన్వయించుకుంటూ, ఆ అనుభూతికి అక్షరరూపం ఇచ్చింది. అలా కృష్ణునిపై గల భక్తి ప్రేమగా మారి ఆయనను పతిగా ఊహించుకుంటూ, ఆయన కరుణ కోసం

# మార్గశీర్షం

పూజలు (కాత్యాయనీ వ్రతం) ఆచరించింది. 'పరమాత్ముని పట్ల గల అనన్యభక్తి అమృత స్వరూపం' అంటాడు దేవరుషి నారదుడు. లోకంలో స్త్రీ పురుషుల మధ్య ప్రేమ లౌకికం కాగా, భగవంతుడికి భక్తుడికి మధ్య గల ప్రేమ అలౌకికం. అదే మధురభక్తి. ఆ మార్గంలో భగవంతుడిని సేవించి తరించిన వనిత, దివ్యాంశ సంజాత గోదాదేవి.

స్వామి సేవకోసం పెరియాళ్వారు తయారు చేసిన పూలమాలలను ముందుగా ఆమె ధరించి బావిలోని నీటిలో (బావి శ్రీవిల్లిపుత్తూరులో నేటికీ ఉంది) ప్రతిబింబాన్ని చూసి మురిసిపోయేదట. ఆ సంగతి తెలియని పెరియాళ్వార్ ఆమె 'ధరించి విడిచిన మాలలనే స్వామివారికి సమర్పించేవారు. ఒకరోజు దండలో కనిపించిన శిరోజం కూతురిదిగా గ్రహించి, స్వామి పట్ల తన అపచారానికి కలత చెంది ఆరోజు ఆలయానికి మాలలు పంపలేదు. అదే రోజు రాత్రి విష్ణుచిత్తుడికి కలలో కనిపించిన శ్రీరంగనాథుడు 'గోదా ధరించిన దండలే నాకు ఇష్టం. ఆమెను పరిణయ మాడతాను. నా వద్దకు చేర్చు' అని సూచించి, పాండ్యరాజుకు స్వప్న సాక్షాత్కారం చేసి 'ఆండాళ్ కోసం పల్లకీ పంపవలసిందిగా ఆదేశించాడు. గోదా స్వామి కోసమే అవతరించిన కారణజన్మురాలిగా భావించారు విష్ణుచిత్తులు. స్వామి కబురుతో ఆనందోత్సాహాలతో ఆలయం చేరుకున్న ఆండాళ్ పరిణయమాడి ఆయనలో ఐక్యమైంది. దీక్ష, పట్టుదల, నియమం, అనుష్ఠానం, ఉపవాసం, పారాయణం, పూజాది ధార్మిక కార్యకలాపమే వ్రతమని పెద్దలు నిర్వచించారు. శ్రద్ధ, ఏకాగ్రత, చిత్తశుద్ధితో చేసే వ్రతం చక్కని ఫలితాన్నిస్తుందనేందుకు గోదామాత అనుభవం భక్తకోటికి చాటిచెబుతోంది.

'రంగనాయకి'కి శూడికొడుత్త నాచ్చియార్, ఆముక్తమాల్యద అనే పేర్లు బాగా ప్రాచుర్యంలో ఉన్నాయి. స్వామి కోసం తయారైన పూలమాలలు ఆమె ధరించిన తర్వాతే స్వామికి చేరేవి కాబట్టి ఆమెకు 'శూడి కొడుత్త నాచ్చియార్' (సంస్కృతీకరణ రూపం 'ఆముక్తమాల్యద) అని వ్యవహారంలోకి వచ్చింది. రామానుజాచార్యుల శిష్యులు అనంతా చార్యులు ఆమెను మొదటిసారిగా 'ఆముక్తమాల్యద' అని వ్యవహరించినట్లు ఆయన కావ్యం 'ప్రసన్నా మృతం' పేర్కొంటోంది. అనంతర కాలంలో శ్రీకృష్ణ దేవరాయలు ఆ పేరునే యథాతథంగా స్వీకరించి కావ్యరచన చేశారు.

**తిరుప్పావై.. విధివిధానాలు**

తిరుప్పావై వ్రతానికి కొన్ని విధివిధానాలు నిర్దేశితమయ్యాయి. వేకువజామునే నిద్రలేచి స్నానాదులు ముగించుకుని పాశురాలను, స్వామి కీర్తనలను ఆలపించాలి. దేవదేవేరులకు ఇష్టమైన పుష్పాలు సమర్పించాలి. పొంగలిని నివేదించాలి. ఈ మాసంలో విష్ణువును మధుసూదనుడిగా అర్చించి, మొదటి పక్షం రోజులు చక్కెర పొంగలి లేదా పులగం నివేదిస్తారు. తరువాతి పక్షం పాటు దధ్యోజనం సమర్పిస్తారు. పెళ్లీడు యువతులు ఇళ్ల ముందు గొబ్బిళ్లు పెట్టి పూజలు చేయడం వల్ల కోరిన వారు భర్తలుగా లభిస్తారని విశ్వాసం.

**ఆళ్వారుగా...**

ఆధ్యాత్మిక సాగరంలో మునిగి తేలిన వారిని శ్రీవైష్ణవ సంప్రదాయంలో 'ఆళ్వారులు' అంటారు. అలాంటి పన్నెండు మందిలో విష్ణుచిత్తుడు ప్రథములు (పెరియాళ్వారు). ప్రణవ రూపానికి, ప్రణయ రూపానికి పసిడి సేతువుగా నిలిచిన తిరుప్పావై రూపకర్త్రి ఆండాళ్ ఆళ్వారులలో ఏకైక మహిళ. విశిష్టాద్వైత ప్రవక్త భగవద్రామానుజాచార్యులు ప్రతి విష్ణ్వాలయంలో గోదాదేవి సన్నిధిని ఏర్పరచి ఆమెకు, ఆమె పాశురాలకు ప్రత్యేక స్థానం కల్పించారు. తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో ఈ ధను ర్మాసంలో తిరుప్పావైనే సుప్రభాతంగా వినిపిస్తారు.

మధురభక్తికి ప్రతీక అయిన శ్రీగోదాదేవిని లక్ష్మీదేవి అంశంగా భావించిన పదకవితా



డా॥ ఆరవల్లి జగన్నాథస్వామి

పితామహుడు అన్నమాచార్య 'చూడరమ్మ సతులాల సోబానఁబాడరమ్మ/కూడున్నది పతిఁజూడికుడుత నాచారి' అని కీర్తించారు.

'గోదాదేవి సాక్షాత్తు లక్ష్మీదేవి కనుక ఆమెకు సింగారాలు కొరతా? మన్మథుని తల్లి కనుక చక్కదనాలు కొదవా? చంద్రుని తోబుట్టువు కనుక సొంపైన కళలకు కొదవ? పాల సముద్రపు తనయ కనుక గంభీరాలకు తక్కువా? లోకమాత కనుక దయకు తక్కువా? పద్మనివాసిని కనుక చల్లదనానికి లోటా? దేవవందిత కనుక మహా మహిమలకు కరవా?అమృతానికి చుట్టమైనందున ఆనందాలకు కొదవా?' అని ప్రశ్నించుకుని సమర్థించుకున్నారు. అన్ని ఉన్నత లక్షణాలను కలిగిన ఆమెను చేపట్టేందుకు శ్రీవేంకటేశ్వరుడే వచ్చి పరిణయ మాడాడట. అన్నమయ్య దృష్టిలో ఆయనే రంగనాథుడు. ధనుర్మాసంలో శ్రీవారి సుప్రభాతం బదులు తిరుప్పావై పఠనం ఈ కీర్తనకు నేపథ్యం కావచ్చు.

అన్ని విష్ణ్వాలయాలలో వేకువ జామున దీనిని గానం చేస్తారు. తెల్లవారుజామునే మేల్కొని, నిత్యానుష్ఠానాల ఆచరణ భారతీయ సంప్రదాయం. ధనుర్మాసంలో ఆ సమయంలోనే తిరుప్పావై గానం చేయాలన్న నిబంధన వెనుక పరమార్థం అదే కావచ్చని ఆధ్యాత్మికవేత్తలు అంటారు.

**నైవేద్యం విశిష్టత**

ధనుర్మాస వ్రత నైవేద్యంగా పులగం, పాయసం, దధ్యోజనం సమర్పిస్తారు. చలికాలంలో కడుపులో జఠరాగ్నితో పాటు ఆకలి పెరుగుతుంది. సాత్వికాహార స్వీకరణతోనే జఠరాగ్ని చల్లబడుతుంది. పాలు, పెరుగు, పెసరపప్పులో చలువ చేసే గుణం ఉన్నందున వాటిని ప్రసాదంగా వినియోగిస్తారని చెబుతారు.

భగవంతుడిని భక్తితో వశపరచుకోవచ్చని నిరూపించిన తపస్విని ఆండాళ్, తిరుప్పావై పారాయణం/ గానం / శ్రవణం వల్ల దీర్ఘాయువు, ఆరోగ్యం, సకల ఐశ్వర్యాలు, ముక్తి సిద్ధిస్తాయని ఆఖరి పాశురంలో పేర్కొన్న అంశాలు సకల జనావళికి కలగాలని కోరుకుందాం.

**'స్వోచ్ఛిష్టమాలికాబంధ గంధబంధుర జిష్ణవే**
**విష్ణుచిత్తతనూజాయై గోదాయై నిత్యమంగళమ్'**

వ్యాసకర్త : సీనియర్ జర్నలిస్ట్

కథ

**'తనింటి ముందు కారు ఆగిందేమిటి?' అనుకున్నారు సూర్యనారాయణ గారు. 'ఎవరి కోసమో అయియుంటుందిలే' అనీ అనుకున్నారు. కానీ కారు దిగిన ఇద్దరూ తన వైపే రావటం చూసి కూచున్న కుర్చీలో కొద్దిగా జరిగి, సద్దుకు కూచున్నారు. ఈయన కూచునున్న వసారా మెట్లెక్కుతూ ఆ ఇద్దరూ దణ్ణం పెట్టారు. అందులో ఒకతను.. 'సూర్యనారాయణ భాగవతారు గారు....' అన్నాడు. "నేనే... రండి... కూర్చోండి" అన్నారు తనెదురుగా ఉన్న కుర్చీలు చూపిస్తూ. "మేం భీమవరం నుంచి వస్తున్నాం. నా పేరు దాట్ల వెంకట్రాజు. తను సాగి సత్యన్నారాయణరాజు. మేము ఒక సాంస్కృతిక సంస్థ నిర్వహిస్తున్నాం. దానికి నేను సెక్రటరీ. తను ప్రెసిడెంట్" అన్నాడు వెంకట్రాజు.**

---

సూర్యనారాయణ గారు లోపల్నించి మంచినీళ్లు తెప్పించి ఇచ్చారు. వాళ్లు మంచినీళ్లు తాగి, స్థిమితపడి తమ సంస్థ వివరాలు చెప్పి, ఎందుకొచ్చారో చెప్పారు. దాని సారాంశం వాళ్లు శ్రీరామనవమికి మూడురోజులు హరికథా ఉత్సవాలు చేస్తున్నారు. ఆ ఉత్సవాల ప్రారంభం ఈయన చేతుల మీదుగా జరగాలన్నారు.

"నేనిప్పుడు అనామకుణ్ణి. నేనెవరో ఎవరికి తెలుసు. ఎవరైనా ప్రముఖ వ్యక్తితో చేయిస్తే బావుంటుంది" అన్నారాయన నెమ్మదిగా.

"మీరు కాదనటానికి వీలు లేదు. హరికథ అనగానే, ఇప్పుడున్న వారిలో మీరే ప్రముఖులు. ఈ రంగంలో పితామహులు. మీ చేతి మీదుగానే జరగాలి" అన్నాడు వెంకట్రాజు.

"అంతేకాదు మీ కథాగానం కూడా పెట్టుకుంటున్నాం. దానికీ మీరు ఒప్పుకోవాలి" అన్నారు సత్యన్నారాయణరాజు.

చాలా, చాలా ఏళ్ల తర్వాత హరికథ, ప్రోగ్రాం.. అన్న మాట వినటం. సూర్యనారాయణ గారికి చిన్నపాటి గగుర్పాటు కలిగింది. వెంటనే, ఈ రోజుల్లో హరికథంటే జనం వస్తారా? అన్న సందేహమూ కలిగింది. అదే వాళ్లతో అన్నారు.

"ఆ సందేహం మాకూ వచ్చింది. ఇప్పుడు హరికథలేమిటి? అని మా కమిటీ మెంబర్లే వెనక్కి లాగారు. కానీ మేం తగ్గదలుచుకోలేదండి. ఈ సంస్థ మా తాతగారి జ్ఞాపకార్థం పెట్టాం. ఆయనకి హరికథలంటే ప్రాణం. ఆయన ఉన్నంతకాలం హరిదాసుల్ని ఎందర్నో ఆదుకున్నారు. మా నాన్న గారిక్కూడా హరికథలంటే ఎంతో ఇష్టం. పాండురంగదాసు, కోట సచ్చిదానంద శాస్త్రి.... అని అప్పటి హరిదాసుల పేర్లు ఇప్పటికీ చెబుతుంటారు. మా తాతగారంత కాకపోయినా, మాకూ ఈ సేవ చెయ్యాలని ఉంది. ఎటొచ్చీ కావాల్సింది మీలాంటి పెద్దల ఆశీర్వాదం, సహకారం" అన్నాడు వెంకట్రాజు.

"ఈ ఏడాదే కాదండీ, ప్రతి సంవత్సరం నవమికి ఇలాగే హరికథ ఉత్సవాలు చేస్తామండి... జనం ఈ ఏడాది ఒకవేళ పల్చగా ఉన్నా, రానురాను పెరుగుతారని నమ్మకం. మా కోసం కాకపోయినా, హరికథ తిరిగి పదిమందికి తెలియటానికైనా మీరు ఒప్పుకోవాలి" అన్నారు సత్యన్నారాయణరాజు.




సూర్యనారాయణ గారికి వాళ్ల మాటలు తబ్బిబ్బు కలిగించాయి. తిరిగి హరిదాసులు, హరికథ ప్రజలకి చేరువ అవటం అనుకుంటుంటే పులకింతగా ఉంది. వాళ్లు చెప్పిన హరిదాసుల పేర్లు అప్పటి రోజుల్ని గుర్తుచేశాయి. ఆయన ఓ ఉద్వేగంలోకి వెళ్లిపోయారు.

"మీ మాట కాదనను. అంతేకాదు నేను ఈ మంచి ప్రయత్నానికి చెయ్యగలిగిందంతా చేస్తాను. అప్పటి మహానుభావుల కాలాన్ని తిరిగి తీసుకు రాలేకపోయినా, అప్పటి జ్ఞాపకాల్ని ఇప్పటి వారికి చెబుతాను. ఎందరు మహానుభావులు, ఎటువంటి గొప్ప భాగవతారులు. మీరు ఇందాక చెప్పిన పాండురంగదాసు గారి కథంటే జనం పిచ్చిగా

# పునరుజ్జీవనం

వి. రాజారామ మోహనరావు

**వాకాటి పాండురంగరావు స్మారక దీపావళి కథల పోటీలో విశిష్ట బహుమతి పొందినది**



వచ్చేవారు. ఆ కథ ఎంత జనరంజకంగా ఉండేదో! ముదపాక మల్లేశ్వరరావు భాగవతారే, సంగీతంలో నిధి. ఎవరు ఏ రాగం అడిగితే ఆ రాగం పాడేవారు. ఈ ఊరి వాడే బళ్ల బసవలింగం భాగవతార్. ఆయన ఇల్లే ఓ గురుకులం. ఇంక కోట సచ్చిదానంద శాస్త్రి గారంటే జనప్రియుడు. సంగీత కచేరీకి మంగళంపల్లి బాల మురళీకృష్ణ లాగ....” అంటూ సూర్యనారాయణ గారు ఎన్నెన్నో విషయాలు ఓ ప్రవాహంలా చెప్పుకొచ్చారు. వచ్చిన వాళ్లిద్దరికీ ఎంతో ఆనందమైంది.

* * *

శ్రీరామనవమి నాడు సూర్యనారాయణ భాగవతార్ గారి చేతుల మీదగా, మూడు రోజుల హరికథ ఉత్సవాలు ఆరంభమయ్యాయి. అంతగా కాకపోయినా జనం బాగానే వచ్చారు. సూర్యనారాయణ గారు మంచి భాగవతారే కాక ఎంతో చక్కటి వక్త. మంచి మాటలు, చక్కటి గానం కలగలిపి జనం ముగ్ధులు అయ్యేలా ఉపన్యసించారు.

ఆనాటి కాలాన్ని, హరికథా వైభవాన్ని తిరిగి కళ్ల ముందు నిలిపారు. పాత కళారూపంలోని జవం, జీవం, ప్రశాంతత ఎలాంటివో చెప్పారు. రోజు రోజుకి జనం పెరుగుతూ వచ్చారు. మూడో నాడు అంటే, చివరిరోజు సూర్యనారాయణ గారి కథా గానం... ‘పార్వతీ కల్యాణం’ హాలంతా నిండింది.

ఎన్నో ఏళ్ల స్టేజి అనుభవం ఉన్నా, అన్నేళ్ల తర్వాత కథ చెప్పటానికి గొంతు సవరించుకుంటుంటే, అంతటి ఆయనకి ఒళ్లు ఓ క్షణం ఒణికింది. చాలా ఏళ్ల తర్వాత తిరిగి కథ చెప్పటమే కాదు. అదో సంబరం... అదో ఉత్సవం... ఇంచుమించు మోడైపోయిన హరికథ తిరిగి చిగురులు వేస్తోందన్న ఉత్సాహం. ఆయన గొంతు ఓ ప్రవాహమే అయింది. కథ ఉద్వేగంతో ఉరకలు వేసింది.

డెబ్భై ఏళ్ల వయసు దాటిన ఆయన ఒంట్లో తిరిగి అంత శక్తి ఎలా వచ్చిందో... యువ కిశోరంలా కథ చెప్పాడాయన. కళోత్సాహ మహిమ అదేనేమో!

కథ పూర్తయింది. హాలంతా ఆనందం. వాళ్లందరి ఆనందం ఆయనకి చేరింది. ‘హరికథా కళ అంతరించలేదు.

ఇంకా ఆదరణ ఉంది చాలు. ఈ జన్మకిది చాలు... తన కర్తవ్యం తను నిర్వర్తించగలిగినట్టే అనుకున్నారు.

కొత్తజీవం తలెత్తింది. పాత కళల పునరుజ్జీవనం ఈనాటి సమాజానికి ఎంతో మేలు. ★






# రజాకారులపై 'గుతుపల'

రజకార్ల ఆగడాలకు సహనం కోల్పోయిన ప్రజలు తిరుగుబాటు బాట పట్టారు. స్వయం రక్షణ చర్యలు చేపట్టారు. గృహోపకరణాలనే ఆయుధాలుగా మలచుకున్నారు.

"తలుపు మలుపులు శీరి
బలుపు కర్రలు పట్టి
కొట్టవే ఒక దెబ్బ చెల్లెమ్మా
కణత పగిలేటట్టు అక్కయ్యా
చిట్టెడు కారం గట్టిగా పట్టండి.
కండ్లలో చల్లండి
కత్తితో పొడవండి
ఇంతైన భయమేల చెల్లెమ్మా
భయమేలనే అక్కయ్యా'...

ప్రత్యర్థులపై ప్రతిఘటనలో భాగంగా, అవసర మైతే వారిపై జల్లేందుకు కారం సిద్ధం చేసుకున్నారు. పాలు, పెరుగులో విషం కలిపి వుంచారు. తమ ఇళ్లకు గల తలుపులను చీరి బలమైన కర్రలు చేసి వాటిని ఆయుధాలుగా చేసుకున్నారు. ప్రాణాలను ఫణంగా పెట్టి పోరాటంలో నిలబడ్డారు. ఈ ప్రజా పోరాటం రజాకార సైన్యాన్ని దెబ్బతీసే స్థాయికి చేరింది. అదే సమయంలో రజాకారు సైన్యం ఆధునిక ఆయుధాలతో అశ్వాలపై వచ్చి ప్రజల దెబ్బను కాచుకొనే స్థితికి వచ్చారు.

చేతి కర్రలకు కొన్ని పరిమితులుంటాయి. పశు వుల వంటి వాటిని అదిలించడానికే తప్ప గూండాలను ఎదిరించటానికి అవి ఉపయోగపడవు. ఇందుకు కొత్తరకం కర్రలు కావలసివుంటుందని వాలంటీర్లు భావించారు. చేతితో పట్టుకోవడానికి తగినంత లావు, పొడవు వుండాలని, కర్రతో ఒక దెబ్బవేస్తే ప్రత్యర్థులు లేవకుండా పడాలని వీరి అభిప్రాయం.

వాలంటీర్లు గొడ్డళ్లతో కొట్టి, కర్రలను కాల్చి, వాటిపై గల తోలు తీసివేసి గట్టిపరచి తమకు తగిన పరిమాణంలో కర్రలను తయారు చేసుకున్నారు. ఇలాంటి కర్రలను 'గుతుప' అంటారు. గుతుపలు పట్టుకొని రజాకార్లను ప్రతిఘటిస్తూ నిలిచిన 'గుతుపల సంఘం' ఆ తరువాత జైత్రయాత్ర సంఘంగా మారింది. ఈ దళాలు తమకు లభ్యమైన ఆయుధాలను సమకూర్చుకొన్నాయి. రజాకార్లు చేసే బీభత్సం వల్ల గ్రామాల్లోని స్త్రీలందరూ ఒకే దగ్గర పడుకునేవారు. మల్లారెడ్డి గూడెం తదితర గ్రామాల్లో తమపై జరిగిన అత్యాచారాలతో స్త్రీలలో రజాకార్ల మీద ద్వేషం పెరిగింది. వారిని సమిష్టిగా ఎదుర్కోవడం ప్రారంభించారు. వారు చేపట్టిన దళాల నిర్మాణానికి ప్రజలు అన్ని రకాలుగా సహకరించారు. వక్షస్థలానికి చేటలు కట్టుకుని రజాకార్లకు, నైజాం పోలీసులకూ ఎదురు నిలిచి వడిసెలతో పోరాడారు. ఆ ప్రతిఘటన పోలీసు దళాలపై దాడుల వరకూ వచ్చింది.

రజాకార్ల దాడులను తట్టుకోవడానికి రాత్రులు ఊరు బయట గడిపేవారు. కొన్నిచోట్ల ప్రజలే గ్రామాలకు కాపలా వుండేవారు. శత్రువుల కదలికలపై ప్రజల నిఘా వేయి కళ్లతో పనిచేసింది. రజాకార్లు శిబిరాల నుంచి బయలుదేరే సమాచారం ఎన్నో మైళ్ళ దూరంలో వున్నా అంచెలంచెలుగా అందేది. ప్రజలను హుషారు చేయడానికి పాటలు అందుకునేవారు. ఈ పాట చూడండి.

*'ఓయ్ - హోయ్ - హోయ్ - నైజాం హోయ్*
*ఓయ్ - హోయ్ - హోయ్ - కాశ్మీర్ హోయ్*
*కొండల్లో సింహాల్లా*
*లోయల్లో ఉరుముల్లా*
*వంకర కొంకి - వరలో కత్తి*
*కండ్లకు గంత - కారపు ముంత*
*కావడి బద్దా - రేవడి సుద్దా*
*రాయి రప్పా - తాళం కప్పా*
*గడగడలాడించే*
*జంబియ, పేష్ కప్ - బామ్ తల్వార్*
*వందలు వేల్ - లక్షల కొలది*
*గబగబ దూకిన - గజిబిజి నైజాం*
*లే లే రారా*
*లే లే కనరా పోరుకు రారా ...'*

వీరు మార్చింగ్ పాటలు ఎక్కువ పాడేవారు. దళాలు అడుగు అడుక్కూ ఓ పదం చొప్పున పాడుతూ కదిలేవి. ఇవి వారి కెంతో ఉత్సాహాన్నిచ్చాయి. తమను ప్రేరేపించే ఎలాంటి పాటనైనా మార్చింగ్ పాటగా మార్చుకో గలిగారు. అలాంటిదే...

*'తెలుగు తల్లి బిడ్డలం-తెలంగాణా వీరులం*
*మాతృ దేశ ముక్తికొరకు-పోరు సలుప కదిలినాం*




**కాశింశెట్టి సత్యనారాయణ**
విశ్రాంత ఆచార్యుడు

# ప్రతిఘటన

*తర తరాల నుండి మేము– సాగనంపదలచినాం*
*వెట్టి పనులు కట్టిపెట్టి – జబర్దస్తే నెగరగొట్టి*
*స్వేచ్ఛగాను బ్రతుకు కొరకు–*
*ఐకమత్యమై నిలిచినాం'*... అనే పాట.

చిట్యాల తిలమ్మ అనే చాకలి ఐలమ్మ మల్లంపల్లి మక్తెదార్ కొండలరావు దగ్గర కొంత భూమి కౌలుకు తీసుకుని సాగుచేసింది.అయితే కుప్ప నూర్చి ధాన్యం రాశి పోసే సమయానికి విసునూరి దేశ్‌ముఖ్ రాపాక రామచంద్రారెడ్డి పాలకుర్తి పోలీసు పటేల్ వీరమనేని శేషగిరిరావు సహకారంతో ఆ భూమిని తన పేర రాయించుకున్నాడు. పంట తనకే ఇవ్వాలన్నాడు. అందుకు అంగీకరించకపోవడంతో ఇంటిని తగల బెట్టారు, కూతురు సోమ నర్సమ్మ మీద అత్యాచారం చేశారు. దాంతో తెగించిన ఐలమ్మ మొండిధైర్యంతో రోకలి బండ చేతబట్టి తిరుగుబాటు చేసింది. రామచంద్రారెడ్డి గ్రామం మొత్తం నాశనం చేశాడు. ఆతని చేష్టలతో ప్రజలు భయభ్రాంతులతో వీధుల్లోకి రావడం మానేశారు. ఐలమ్మ భర్త, ఇద్దరి కుమారులపై హత్యానేరం మోపి జైల్లో పెట్టారు.


ఐలమ్మ

ఐలమ్మ పంటను స్వాధీనం చేసుకుంటామని విసునూరి దేశ్‌ముఖ్ మనుషులు ప్రచారం చేయడంతో స్పందించిన ఆంధ్రమహాసభ తన కార్యకర్తలను పాలకుర్తి పంపి పంటను కోయించి నూర్పించి రాశిపోయించింది. అయితే రాత్రి విసునూరి దేశ్‌ముఖ్ గూండాలు వచ్చి పంటను ఎత్తుకు పోయారు. ఆంధ్ర మహాసభ కార్యకర్తలను విసునూరు పోలీసు స్టేషన్‌లో బంధించారు. అరెస్టు అయిన వారిలో భీంరెడ్డి కరుటూరి రామచంద్రారెడ్డి, నరసింహరెడ్డి, చకిలం యాదగిరి రావు, ఇతరులు వున్నారు. వీరి ఆసనంలో కారం పెట్టి చిన్న చిన్న కర్రలను లోపలికి దూర్చి హింసించారు. దాహం వేస్తే మంచినీళ్లకు బదులు ముంతలలో మూత్రం నింపి నోళ్లల్లో పోశారు.

వారి జాడ తెలియడం లేదంటూ ఆంధ్ర మహాసభ, ఆరుట్ల లక్ష్మీ నరసింహారెడ్డిని పాలకుర్తికి పంపగా, ఆయన రఘునాథపల్లిలో తన మిత్రుని కచ్చడం బండిని తీసుకుని పాలకుర్తి బయలు దేరాడు. గ్రామంలో కాపలాకాస్తున్న గూండాలు ఆయన్ను పట్టుకొని కొట్టి, కచ్చడాన్ని పాలకుర్తి చెరువులో పడవేసి బురదలో తొక్కి కనపడనీయ కుండా చేశారు. ఆయన దుస్తులు ఊడదీసి తన్ని వెళ్లగొట్టారు. గ్రామస్థులు భయంతో నిస్సహా యులుగా ఉండి పోయారు. ఆరుట్ల లక్ష్మీ నరసింహారెడ్డి సమీపంలోని బమ్మెర గ్రామానికి చేరుకుని అక్కడి ముఖ్తాదార్‌ను కలసి ఆశ్రయించారు. అన్ని విధాల ఆదుకుని ఆయనను సురక్షితంగా హైదరాబాద్ పంపారు. దాడి ఘటనపై రావి నారాయణరెడ్డి ఆంధ్ర మహాసభ' డైరెక్టర్ జనరల్ అండర్ సన్‌కు వినతి పత్రం అందచేయగా, ఆయన నల్గొండ ఎస్.పి.ని విచారణకు ఆదేశించారు. అయితే ఆంధ్ర మహాసభ కార్యకర్తలే దురుసుగా ప్రవర్తించారని అంతకు మించి ఏమీ జరగలేదని ఎస్పీ తేల్చారు. పైగా ఆంధ్ర మహాసభ 'అరాచక సంస్థ' అని నిందించారు. ఆ శీర్షికతోనే పత్రికలు వ్యాసాలు రాశాయి.

దేవరుప్పల గ్రామం ఆంధ్రమహాసభకు ముఖ్య కేంద్రం. సమస్యల్లో కొట్టుమిట్టాడుతున్న పాలకుర్తికి దేవరుప్పల ప్రజల సహాయసహకారాలు అవసరమని మహాసభ గ్రామపెద్దలతో చర్చించింది. గ్రామానికి చెందిన 'గుతుప సంఘం' వాలంటీర్లు పాలకుర్తిలో మకాం వేసి, ప్రజల్లో చైతన్యం కలిగించి, ఆత్మ విశ్వాసం పెంపొందించి సాక్ష్యాలు ఇప్పించాలనీ, తరువాత అన్ని గ్రామాల నుంచీ వాలంటీర్లను తయారు చేసి గూండాలను ప్రతిఘటించడానికి పూనుకోవాలని అప్పుడే మనం "ఆంధ్రమహాసభ" రక్షించుకోగలమని గ్రామ నాయకత్వానికి నచ్చజెప్పింది. 'ఈ వేళ పాలకుర్తి అయ్యింది. రేపు దేవరుప్పలవుతుంది. మీరు కూడా నిర్భంధానికి గురి కావలసి వస్తుంది. ఈ పరిస్థితుల్లో మీరు వెనుకాడ కూడదు' అని నచ్చచెప్పింది. చివరకు గ్రామపెద్దలు అరవై మంది వాలంటీర్లను పంపేందుకు అంగీక రించింది. అలా 'గుతుప సంఘం' సభ్యులు తమ సామాన్లను రెండు బండ్లలో వేసుకొని పాటలు పాడుకుంటూ మార్గమధ్యలోని మూడునాలుగు గ్రామాల్లో ప్రదర్శనలిస్తూ పాలకుర్తి చేరుకున్నారు. కడివెండి నాయకుడు మోహన్‌రెడ్డి నాయకత్వంలో పెరేడ్ నిర్వహించారు.

**'నైజాము ప్రభుత్వ**
**నాయకత్వ రాక్షసత్వమున్**
**దాన్ని రూపు మాపకున్న**
**మనకు లేదు సౌఖ్యమున్'** అని పాడిన పాటలతో, రెండు రోజుల తరువాత గ్రామస్థులలో కదలిక ప్రారంభమైంది. ఇళ్ల నుంచి వెలుపలికి రాసాగారు.

'ఇంతమంది అంత దూరం నుండి మా కోసం వచ్చారు. మీకు మేము సాయం చేస్తాం' అంటూ స్థానికులు వారిని అనుసరించారు. వాలంటీర్లు ఉన్న ప్రాంతానికి వచ్చిన సి.ఐ. 'ఇక్కడ వుండటానికి వీలులేదు ఎవరి గ్రామాలకు వారు వెళ్లిపొండి' అని చేసిన హెచ్చరికను వాలంటీర్లు లక్ష్య పెట్టలేదు. వారి మాటను గ్రామస్తులు బలపరిచారు. చేసేది లేక పోలీసులు వెళ్లిపోయారు.

వాలంటీర్ల రాకతో గ్రామస్థులలో మనో నిబ్బరం పెరుగుతుండగా, మరోవంక వాలంటీర్లను చూసి గూండాలు భయపడుతున్నారు. ఈ అనుభవాన్ని దృష్టిలో వుంచుకొని విసునూరి ప్రాంతంలోని 40 గ్రామాల్లో వాలంటీరు దళాలను ఏర్పాటు చేసుకున్నారు. అలా సూర్యాపేట, నల్లగొండ, హుజూర్‌నగర్ తాలూకాల్లో ఈ ఉద్యమం బలపడింది. ఈలోగా ఐలమ్మ తరపున కొండా లక్ష్మణ బాపూజీ వాదించగా ఆమెకు అనుకూలంగా తీర్పు వచ్చింది. రజాకార్ల ఉపసేనాపతి రెండుసార్లు కోర్టులో పరాజయం పొందాడు. ఐలమ్మ ప్రజా పోరాటాలకు స్ఫూర్తిగా నిలిచింది. ★



వాలంటీర్ల రాకతో గ్రామస్థులలో మనో నిబ్బరం పెరుగుతుండగా, మరోవంక వాలంటీర్లను చూసి గూండాలు భయపడుతున్నారు. ఈ అనుభవాన్ని దృష్టిలో వుంచుకొని విసునూరి ప్రాంతంలోని 40 గ్రామాల్లో వాలంటీరు దళాలను ఏర్పాటు చేసుకున్నారు. అలా సూర్యాపేట, నల్లగొండ, హుజూర్‌నగర్ తాలూకాల్లో ఈ ఉద్యమం బలపడింది. ఈలోగా ఐలమ్మ తరపున కొండా లక్ష్మణ బాపూజీ వాదించగా ఆమెకు అనుకూలంగా తీర్పు వచ్చింది.

# భిన్న సంస్కృతుల ఏక

**భారతీయ సంస్కృతి సంప్రదాయాల పట్ల అవ్యాజమైన అభిమానం కనపరచినవారంతా వాటిని ఆసక్తిగా తెలుసుకోవడం, వాటిలోని గొప్పతనం.**

**– మహాత్మా గాంధీ**

భారతీయ సంస్కృతి సంప్రదాయాల గురించి చర్చించుకొనే వేళ సంస్కృతి సంప్రదాయాలు వేరువేరు కావని, అనేక అంశాల సమ్మేళనమని గుర్తించాలి. ఇక్కడొక వాదన మనకు వినబడుతుంది. భారతీయ సంస్కృతికి మూలం హిందూమతం. కాని... ఈ వాదన చర్చకు నిలబడదు. మతం మనిషిని, అతని సంస్కృతిని నిర్దేశించలేదు. అలాగయితే రష్యా, అమెరికా, ఆఫ్ఘనిస్తాన్ లాంటి ఒకే మతరాజ్యాలు ఎందుకు ముక్కలు చెక్కలవుతున్నాయి. జైన, బౌద్ధల్లాంటివి అశేష ప్రజాసమూహాలను ఎందుకు ఆకట్టుకోలేక పోయాయి? మతపరమైన స్వేచ్ఛ అంటే ఏమిటి? ఏ ఒక్కరో చెప్పిన మార్గాలను అనుసరించటమా? లేదూ... తనకు నచ్చిన మార్గంలో తాను విచ్చలవిడిగా కొనసాగ డమా? అసలు సంస్కృతిని ఏ మతం నిర్దిష్టంగా నిర్వచించగలిగింది? అనే ప్రశ్నలకు వేదాంతవేత్తలూ సమాధానాలు చెప్పలేరు. ఎందుకంటే ఏ ఒక్క మతం అనేక భిన్న పార్శ్వాలను స్పృశించలేదు కనుక. భారతీయత అలాకాదు. ఇక్కడ అనేక మతాలు, జాతులు, కులాలు, తెగలున్నా ఏకత్వం అనేది అంతఃస్సూత్రంగా నిలచివున్న ఓ పురాతన ధర్మపరమైన నైతికాంశం. కనుకనే అనేక దేశాల వారు ఆకర్షితులవుతున్నారు, ఆచరిస్తున్నారు.

**భారతీయ సంస్కృతికి మూలమేమిటి?**

ప్రపంచంలో అతి ప్రాచీనమైన సంస్కృతి భారతీయుల స్వంతం. అన్ని మతాలకు మూలమైనది. ఏ కాలంలో ప్రారంభమయిందో చెప్పడానికి వీలులేదు. అతి దీర్ఘమైన చరిత్రలో అప్పుడప్పుడు ఏవేవో ఒడుదొడుకులు వచ్చినా, మూలసూత్రాలకు భంగం కలుగకుండా కాలానుగుణంగా సాంఘిక, రాజకీయ నియమాదులలో కొన్ని మార్పులను చేసుకుంటూ అన్నింటిని ఎదుర్కొంటూ, విఘాతం కలిగినప్పుడల్లా ద్విగుణీకృతమైన శక్తితో, దృఢంగా నిలదొక్కుకొన్న మహాశక్తిశాలి (దాదాపు పదమూడు వందల సంవత్సరాల నుంచి అని ఒక అభిప్రాయం) మన సంస్కృతి. 250–300 సంవత్సరాల నుండి పాశ్చాత్యులు భారతీయతలో క్రైస్తవాన్ని శాశ్వతం చేయటానికి నిరంతరం (వర్తమానం వరకు) యత్నిస్తూ ఉన్నారు. ఇందుకనుగుణంగా చాప క్రింద నీరులా ప్రాథమిక స్థాయి నుంచి చరిత్రకు అనేకానేక తప్పుడు అంశాలను చేర్చుతూ వక్రీకరించడం ప్రారంభించారు. భారతీయత స్థిరచిత్తంతో, స్థితప్రజ్ఞతతో నిరంతర ప్రవాహంలా కొనసాగు తున్నది. జర్మనీ చరిత్రకారుడు మాక్సుముల్లర్ తన మిత్రుడు బూరన్ బన్సెస్కు రాసిన లేఖలో, 'పాల్ కాలం నాటికి రోమ్, గ్రీస్ దేశాలలో క్రైస్తవ మత స్థాపనకు ఎంత అనుకూలమైన పరిస్థితులుండేవో అంతకన్నా అనుకూలమైన పరిస్థితులు భారత దేశంలో ఈనాడు ఉన్నాయి' అని పేర్కొన్నాడు.

అయినా భారతీయ సంస్కృతి ఒకటి లేదా అనేక మూకదాడులకు బలియంగా బదులు చెప్పగలిగింది. కారణం.. అనిబిసెంట్ అన్నట్టుగా బలీయమైన సంస్కృతి మూలాలు ఇండియాకు బలం. అది లేకపోతే ఇండియా లేదు. ఇండియా మొదళ్లు వానిలోనే పాతుకొని ఉన్నాయి. అవి వాడిపోతే ఇండియా తప్పక వాడిపోతుంది. ఇంతటి ఉన్నత స్థాయిలో ప్రపంచంలో కీర్తి పతాకాన్ని ఎగురవేయటంలో మన సంస్కృతి మూలాల్లో ఉన్న ధర్మాలు ఒక కారణం. జాతి, వర్ణ, ఆశ్రమాది భేదాలతో పని లేకుండా మానవులు అలవరుచుకోవలసిన సాధారణ ధర్మాలను (Common Duties) అన్నీ స్మృతులు వివరించాయి. ఉపనిషత్తులు, యోగశాస్త్ర గ్రంథాలు కూడా వీటికి అత్యధికమైన ప్రాధాన్యమిచ్చాయి. స్థిరంగా



ఉండటం (ధృతి), ఓరిమి (క్షమ), ఓర్పు, మనసును అదుపులో ఉంచుకోవటం(దమం), ఇతరుల వస్తువులు ఉపహరించకపోవటం (అస్తేయం), పరిశుద్ధత్వం (శౌచం), ఇంద్రియాల అదుపు(నిగ్రహం), జ్ఞానసముపార్జన(విద్య) సత్యం. ఈ లక్షణాలు భారతీయ ఆత్మలో నిబిడీకృతం కావడమే సంస్కృతి పరిరక్షణకు ప్రథమ సోపానమని చెప్పవచ్చు. మనుస్మృతి చెప్పిన పరమ సత్యమిదే! మనుస్మృతి (6.92)లోని ఈ దశసూత్రాలను అదే స్మృతి ఐదింటికి కుదించింది. ధర్మాలు సరళీకృతం చేసుకోవటం మారుతున్న కాలానికనుగుణంగా, సంస్కృతి రక్షణకు కవచంగా భావించిన పూర్వీకుల ముందు చూపు మెచ్చదగినది. అహింసా సత్యమస్తేయం శౌచమిన్ద్రియ నిగ్రహః / ఏతం సామాసికం ధర్మం చాతుర్వర్ణ్యే బ్రవీన్మనుః (మ.స్మృ. 10.63) అహింస, సత్యం, అస్తేయం, బ్రహ్మచర్యం, అపరిగ్రహం. వీటిని యమాలు అంటారు. యోగశాస్త్రంలో వీటికి సార్వభౌముల మహావ్రతం అని పేర్లున్నాయి.

మన సంస్కృతిలో మరో గొప్పతనముంది. మన ప్రాచీన వాఙ్మయంలో సంస్కృతిని ప్రతి అంశాన్ని సమగ్రంగా చర్చించారు. కాలానుగుణ మైన మార్పులను చేసుకొంటూ వెళ్లినా వాటి మూలసూత్రం మార్పులకు లోనుకాక పోవడం, వాటి నైతికత వివరణలు మూలాలు వీడకపోవడం, సత్యమేవ జయతే, ధర్మోరక్షతి

- భమిడిపాటి గౌరీశంకర్

# త్వం భారతీయత

రక్షితః అనేవి సర్వకాలాలకు వర్తించేవి. 'అధర్మం గెలుస్తున్నది కదా? వర్తమానంలో ధర్మానికి తావు లేదు కదా' అనే వారికి మనుస్మృతిలోని ఒక సూత్రం (4.172) ఇలా చెబుతుంది. 'నా ధర్మశ్చరితో లోకే సద్యః ఫలతి గౌరివ, శనైరావర్తమానస్తు కార్తుర్మూలాని కృన్తతి' (ఒకడు అధర్మం ఆచరించాడంటే అది లోకంలో గోవు వలే వెంటనే ఫలమివ్వదు. మెల్లమెల్లగా ఫలోన్ముఖమవుతూ ఆచరించిన వానిని మొదలంటా నాశనం చేస్తుంది). మరో సందర్భంలో 'యదినాత్మని, పుత్రేషు..' (మ.స్మృ 4.173) అనే శ్లోకంలో 'అధర్మం చేసినవాని విషయంలో ఫలించక పోయినా పుత్రులు, పౌత్రులు దాని ఫలం అనుభవించక తప్పదు'. అది ఫలం ఇవ్వకపోవడం అనేది ఉండదు. వర్తమానంలో ఎన్నెన్నో ఉదాహరణలు కనిపిస్తాయి. ఎన్నో సంస్థలు వాటి అధిపతులు అమెరికా అధ్యక్షులతో కూర్చొని ఫోటోలు దిగారు. వారంతా తరువాత రోజుల్లో జైలు పాలు కావటం తెలిసిందే కదా!

సమాజంలో వివిధ కాలాల్లో ఏర్పడిన అనేకానేక సంఘ విద్రోహక సంప్రదాయాలు.. ఉదాహరణకు బహుభార్యత్వం, సహగమనా దులను సంస్కృతి చెప్పలేదు. అది మన సంస్కృతి కాదని, వివిధోపాఖ్యానాల ద్వారా ఈ ధర్మాలు (సామాన్యధర్మాలు)బాల్యం నుంచి ప్రజల మనస్సులలో స్థిరంగా నాటుకొనే లా బోధించ డానికి రామాయణ, భారత, భాగవత, కావ్య నాటకాదులు సంస్కృతి అంతః ప్రవంతి పనిచేశాయి. సత్ప్రవర్తన కలవాడు దేవుడితో సమానమన్నారు (అతడు దేవుడిని నమ్మనవసరం లేదన్నారు). అతి ప్రాచీనమైన సాంఖ్యాదర్శనం, వేదాలు, పూర్వమీమాంసలోనూ ఈశ్వరుని ప్రసక్తి లేదు. మానవుని సత్ప్రవర్తనకి, సత్ప్రయత్నాలకీ, వాటిచే సాధించవలసిన సత్కర్మలకీ మాత్రమే ప్రాధాన్యమిచ్చాయి (బౌద్ధ, జైనాలు కూడా.. ఇవి భారతీయ సంస్కృతికి ప్రత్యాయాలే).. ఇది మనిషిని మనీషిగా గుర్తించి గౌరవించాలనే సౌభ్రాతృత్వాన్ని సూచిస్తుంది.

భారతీయ సంస్కృతిలో ఎందరెందరో తప్పని ఎత్తిచూపిన అంశాలున్నాయి. వాటిలో పాపపుణ్యాలు ఒకటి. ఒకడికి పాపం అనిపించేది మరొకడికి పుణ్యమౌతుంది. ఒకడికి పుణ్యమనేది మరొకరికి పాపమనిపిస్తుంది. ఇదెలా సాధ్యం? అని వితండ వాదం చేసేవారు భారతీయ సంస్కృతిపరమైన ఆత్మను కూలంకషంగా చర్చించి, సమగ్రంగా తెలుసుకోలేదని అర్థమవుతుంది. వేదాలలో (రుగ్వేదం) 'నహినినానిన్యం నిన్తితుం ప్రవర్తతే, అపితుస్తుత్యం స్తోతుమ్' (ఎవరినైనా, దేనినైనా నిందిస్తున్నారంటే దానిలోని ప్రధానోద్దేశ్యం వానిని లేదా దానిని నిందించడం కాదు. ఆ సందర్భంలో స్తుతించాలని అనుకుంటారో దానిని స్తుతించడమే ప్రధానోద్దేశ్యం) అని ఒక న్యాయ సూత్రముంది. పాపపుణ్యాలు చేసేవారు స్వర్గ నరకాలకు పోయి అక్కడ రెండు వేల సంవత్సరాలుంటారని, దీర్ఘమైన, బాధాకరమైన హింసలు శిక్షలుగా ఉంటాయని చెప్పడమంటే అక్కడ ప్రధానంగా పుణ్యాలు లేదా పాపం బాధను చెప్పడమే.

అంతేకాని, వాటిని భూతద్దంలో చూసి భారతీయ సంస్కృతిలో ఇంత 'ట్రాష్' లాంటి అంశాలున్నాయని పరిశోధన పత్రాలు సమర్పించడం కాదు. లోతును అంతరాలను, ఆంతర్యాలను తెలుసుకోకుండా, అంతా పైపైన చదివి మొత్తం సంస్కృతి ఇంతే అనడం వర్తమానంలో ఓ ఫ్యాషనైపోయింది. ఇది తప్పు.

భారతీయ సంస్కృతిని ఎన్నో దేశాలవారు (ఎన్నో మతాలవారు) అనుసరిస్తున్నారు, ఆచరిస్తున్నారు. ముఖ్యంగా మన వైవాహిక వ్యవస్థను ఆదర్శంగా స్వీకరిస్తున్నారు. ఎందుకు.. అని ప్రశ్నించుకుంటే ఎన్నెన్నో పూజ్యనీయమైన అంశాలను మన పూర్వీకులు ఈ వ్యవస్థలో నిక్షిప్తం చేశారు. అనుబంధాలు, ఆత్మీయతలు, కుటుంబం, సమాజం, నైతిక విలువలు, భార్యాభర్తల అన్యోన్యత, స్త్రీ, పురుషుల మధ్య ఆరోగ్యకరమైన మానసిక, శారీరక, కౌటుంబిక వ్యవస్థల ఏర్పాటు వంటివి కనిపిస్తాయి. స్త్రీకి మహోన్నత గౌరవం ఇచ్చారు. ఆమె వల్లనే పురుషునికి పరిపూర్ణత్వం వస్తుంది. 'అర్థోనా ఏషత్మనో యత్పత్నే..' (తైత్తిరీయ సంహిత 6.1.8) భార్య సహధర్మచారిణిగా ఉండి ధర్మకార్యాలు, యజ్ఞయాగాదులు చేయడానికి తగిన అర్హతను కల్పిస్తుందని చెప్పింది (మరేదేశ సంస్కృతిలో ఇటువంటి ఉద్ఘోషణ లేదు). 'ఏతా వానేన పురుషో యజ్ఞయాత్మా ప్రజేతిహ...' (మ.స్మృ.9) ప్రకారం భార్యా, సంతానం, తానూ కలిస్తేనే పురుషుడు పూర్ణ పురుషుడవుతాడు. అర్థోహ వా ఏష ఆత్మనః... అనే స్మృతిలో భార్యను పొంది సంతానం కలిగేంత వరకు పురుషుడు అర్థభాగం మాత్రమేననే అర్థమైంది. వివాహ బంధం శాశ్వతమైనది, అభేద్యమైనదని రుగ్వేదంలోని రుక్కు 'ఇహైవస్తం మా వియౌష్టం విశ్వమాయు ర్వ్యశ్నుమ్..' (10.85.42) చెబుతుంది.

భారతదేశంలోని ప్రతి ఒక్కరు సనాతన ధర్మానికి చెందినవారే. భారతీయ సంస్కృతిలో అంతర్లీనంగా ఉండే ధర్మానికి ఎల్లలు లేవు. ఇది మానవుల వైయక్తిక అభివృద్ధికి, సామాజిక శాంతికి మూలకారణమౌతుంది. అందుచేతనే 'ధారణాత్ ధర్మః' అనే ధర్మార్థం సామాన్య ధర్మాల విషయంలో సార్థకమౌతుంది. ధర్మాన్ని అనుసరించడంలో తారతమ్యం ఉండవచ్చు. జాగ్రత్తగా గమనిస్తే భారతీయ సంస్కృతికి ప్రేరణ పొందని మానవుడు ప్రపంచంలో లేడని చెప్పవచ్చు. సర్వమానవ సౌభ్రాతృత్వం మన సంస్కృతి మూలసూత్రం,

**సర్వేసుఖినః సన్తు సర్వేసన్తు నిరామయాః**
**సర్వే భద్రాణి పశ్యన్తు మా కశ్చి దుఃఖ భాగ్భవేత్**

ఈ లోకంలో అందరూ సుఖవంతులగుదురు గాక, అందరూ ఆరోగ్యవంతులగుదురుగాక, అందరూ కళ్యాణకారకములైన విషయాలే చూచెదరుగాక, ఏ ఒక్కనికి దుఃఖం కలగకుండు గాక. ఇదే భారతీయ వసుధైక కుటుంబ భావన.. ప్రపంచ దేశాలలో మరే దేశ సంస్కృతికి ఇటువంటి భావన ఉందా? అందుకే.. భారతీయ సంస్కృతి ఆధ్యాత్మికంగా ప్రపంచానికి గురు పీఠంగా నిలిచిందనటం అతిశయోక్తి కాదు. ★

భారతదేశంలోని ప్రతి ఒక్కరు సనాతన ధర్మానికి చెందినవారే. భారతీయ సంస్కృతిలో అంతర్లీనంగా ఉండే ధర్మానికి ఎల్లలు లేవు. ఇది మానవుల వైముక్తిక అభివృద్ధికి సామాజిక శాంతికి మూలకారణ మౌతుంది. అందుచేతనే 'ధారణాత్ ధర్మః' అనే ధర్మార్థం సామాన్యధర్మాల విషయంలో సార్థక మౌతుంది. ధర్మాన్ని అనుసరించడంలో తారతమ్యం ఉండవచ్చు. జాగ్రత్తగా గమనిస్తే భారతీయ సంస్కృతికి ప్రేరణ పొందని మానవుడు ప్రపంచంలో లేడని చెప్పవచ్చు.



# నావికాదళంలో

ఎక్కడ ఏ విజయమైనా, ఎంతటి వెలుగైనా ధీరహృదయులకే సొంతం. వెలుగు పంట అనేది ఎప్పుడైనా సరే, కటిక చీకటి పాలిట పెనుమంట. ఆ ప్రకాశం, వికాసం సదా దీపకాంతులు, సర్వదా ధైర్యజ్యోతులే అవుతాయి. సూర్యుడు పగటి దీపమైతే, చంద్రుడు రాత్రి దివ్వె. ఈ సృష్టిలో పురుషులూ మహిళలూ అంతే. ధైర్యసాహస ప్రదర్శనల్లో ఇద్దరూ సమానులే. నిజానికి ప్రకృతే మానవాళికి విలక్షణ బహూకృతి. అందులో భాగమైన ఆ ఉభయులూ ఒకరు సూర్యకాంతి అయితే, మరొకరు చంద్రకాంతి. నరనారీ సమానత సూచికగానే భారత ప్రభుత్వం తాజాగా చక్కని చరిత్ర సృష్టించింది. త్రివిధ దళాలైన పదాతి, వైమానిక, నావిక విభాగాల్లో సమధిక స్థాయిలో వనితల నియామకాలను చేపడుతోంది. అగ్నివీర్ పథకం అందరికీ తెలిసిందే. తొలిసారిగా పడుతులను నౌకారంగంలోకి తీసుకున్నామని నేవీ చీఫ్ అడ్మిరల్ హరికుమార్ చేసిన ప్రకటన దేశమంతటా సరికొత్త ఆశల్ని రేకెత్తిస్తోంది. మొట్టమొదటగా అతివలను నావికులుగా ప్రవేశపెడుతున్నామనడం నారీభేరిని ప్రతిధ్వనింపచేస్తోంది. నిస్సందేహంగా ఇదొక పతాక స్ఫూర్తి.

మన సాయుధ దళాలు తిరుగులేనివి. పటిమలో సాటిలేనంత మేటివి. అన్నీ రక్షణ మంత్రిత్వశాఖ నిర్వహణలో ఉంటాయి. మొత్తం ప్రపంచంలోని పేరొందిన సైనిక బృందం మనకుంది. ఇది అత్యంత శక్తిమంతం. త్రివిధ ప్రధాన దళాలకూ అధిపతులున్నారు. సమన్వయ బాధ్యతలను సంయుక్త ప్రధాన సైన్యాధికారి వహిస్తున్నారు. వీరధీర సైనికులను సత్కరించుకునే కార్యక్రమమూ వార్షికంగా డిసెంబరులోనే. ముచ్చటైన మూడు విభాగాలూ దేశ సరిహద్దులను పరిరక్షిస్తూ వస్తున్నాయి. దేశం లోపల ఎక్కడ ఏ విపత్కరస్థితి తలెత్తినా, రంగంలోకి దిగి రక్షణ విధులు నిర్వర్తిస్తున్నాయి. ప్రత్యేకించి సాయుధదళాల పతాక దినోత్సవం ఎనలేని ప్రాధాన్యం సంతరించుకుంది. మనందరి భద్రతకు పరిపూర్ణ భరోసానిచ్చే సిబ్బంది సంక్షేమం ఒక్క ప్రభుత్వ కర్తవ్యం మాత్రమే కాదు, పౌరుల ఉమ్మడి విధి కూడా. రక్షణ వ్యవస్థలో కీలకమైన నావికాదళం వేలాది సిబ్బందితో నిండి ఉంది. యుద్ధ సమయాలతోపాటు ప్రకృతి వైపరీత్యాల వేళల్లోనూ రంగ ప్రవేశం చేసి తన సత్తా చాటుకుంటుంది. ఒకసారి ఆరు దశాబ్దాల వెనక్కి వెళ్దాం. అప్పట్లో 'ఆపరేషన్ విజయ్' చరిత్రాత్మకం. భారత వాణిజ్య నౌకలమీద విదేశీ సైన్యం దాడులకు దిగిన సందర్భమది. ఆ వెంటనే నావికాదళం బరిలోకి దూకింది. శత్రుసేనల్ని తిప్పి కొట్టి తానేమిటో నిరూపించుకుంది.అటు తర్వాత పాకిస్థాన్‌తో పోరులోనూ, మన తీరప్రాంతాల పరిరక్షణ నేవీ చేతుల్లోనే! అలాగే కొన్నేళ్ల కిందట దక్షిణాదిన సునామీ సంభవించినప్పుడు, రక్షణచర్యలు చేపట్టిందీ నావికా విభాగమే. గంటల వ్యవధిలోనే అనేకానేక నౌకలు, యుద్ధ విమాన సంబంధమైనవి, హెలికాప్టర్లు సైతం తరలివచ్చి సహాయ కార్యక్రమాలు సాగించాయి. ఇదంతా నేవీ ఘనతర చరిత్ర.



**చైతన్య దీపిక**

ఇటీవలి కాలంలో నేవీ నూతన పతాకను స్వీకరించింది. ఇందులో విలక్షణత ఛత్రపతి శివాజీ రాజముద్ర! పతాకాన్ని ప్రధాని నరేంద్రమోదీ ఆవిష్కరించారు. దానిలో ఒకవైపు జాతీయ పతాకం. ఆ పక్కనే అష్టభుజాకారం. అవి నీలం, బంగారు వర్ణాలు. చిహ్నంలో 'సత్యమేవ జయతే' ఉంటుంది. అక్షరాల దిగువనే నౌకాదళ నినాదం. దానికి అర్థం 'వరుణుడా! అంతా శుభం కలగాలి' అని. ఎనిమిది భుజాల ఆకారం దళానికి సంబంధించిన కార్యాచరణ సామర్థ్యానికి సంకేతం. అవన్నీ దిశల పరిధిని సూచిస్తుంటాయి. నీలం అనేది సముద్ర సూచకం. వేరొకటి స్థిరత్వానికి ప్రతిబింబం. తెలుపు వర్ణం శక్తియుక్తుల సమాహారం. శివాజీ పాలనలో నౌకాదళం దృఢంగా ఉండేది. దేశీయంగా నిర్మాణమైన ఇండియన్ నేవీషిప్ (ఐఎన్ఎస్) విక్రాంత్‌ను కూడా అదే ఆవిష్కరణోత్సవంలో



# నారీమణులు

జలప్రవేశం చేయించారు. ఇది పూర్తి స్వదేశీ సాంకేతిక పరిజ్ఞానంతో రూపుదిద్దుకున్న విమాన వాహకనౌక అని ప్రధాని అభివర్ణించారు. రక్షణ రంగంలో స్వావలంబనకు ఇది ప్రత్యక్ష నిదర్శనమనీ విశదీకరించారు. దళంలో పురుషులతోపాటు వనితలకీ సమాన ప్రాధాన్యం కలిగించాలన్నది అన్ని విధాలా హర్షణీయం. నూతనంగా కొన్ని వేలమందిని నియమించుకుంటే, వారిలో అనేకులు స్త్రీలు కావడం అగ్నివీర్ ప్రశస్తిని చాటి చెప్తోంది. ఆత్మనిర్భర భారత్ అంటే ఇది కాక మరేమిటి? విక్రాంత్ ఆరంభం ఓ మైలురాయి. అదే కోవలో మహిళా ప్రాతినిధ్యం ఆ కీర్తి కిరీటంలో కలికితురాయి.

**తీరును చాటే పేర్లు**

భారత నౌకాదళం కార్యాచరణ దృఢత్వాన్ని ఏనాడో సాధించింది. తొలి నుంచీ సముద్రం భద్రతకే ప్రాధాన్యమిస్తూ వస్తోంది. ఇతర దేశాల సైనిక, పరిశోధక నౌకల రాకపోకల మీద విస్తృత నిఘా ఉంచుతోంది. ప్రత్యేకించి మనదైన వాణిజ్య వ్యవహారం, ఇంధన అవసరం మహాసముద్రాల ద్వారా తీరుతోంది. ఆ కారణంగానే సముద్ర జలాల భద్రతకు ప్రత్యేక ప్రాముఖ్యమిస్తోంది ప్రభుత్వం.

ఇదే సందర్భంలో తెలుగునాట విశాఖ వేదికగా ఏర్పాటైన నావికా దినోత్సవాల నిర్వహణనూ ప్రస్తావించి తీరాలి మరి. తూర్పు నౌకాదళం ఆధ్వర్యాన ఈ మధ్యనే పలు విన్యాసాలను నిర్వహించారు. సమర సమయంలో ఏ విధంగా స్పందిస్తామో, ఏ రీతిన బరిలోకి దిగుతామో, ఎటువంటి స్థాయిలో ఎదురు దాడులు సాగిస్తామో ప్రదర్శించి చూపారు. దేశంలోని మరో మూడు 'కమాండ్'ల కేంద్రాలు ముంబయి, కోచి, పోర్ట్‌బ్లెయిం. విక్రాంత్‌తో పాటే విరాట్, విక్రమాదిత్య, ప్రహార్, తరంగిణి, అశ్విని అనేవీ విశిష్టంగా రూపొందినవే. తరంగిణి అనేది నావికాదళంలో కొత్తగా చేరినవారికి శిక్షణనిచ్చేది. నౌకలో ఉంటుందీ కార్యక్రమం. నావికులకు వైద్యసేవ, సహాయం అందించేది అశ్విని. భారతీయ నౌకాదళానికి సొంత రేవుగా ప్రసిద్ధి చెందింది 'కదంబ'. ఇదైతే ఆసియా ఖండంలోనే అత్యాధునిక స్థావరం. కర్ణాటకలో సహజసిద్ధంగా నెలకొన్న కార్వార్ ఓడరేవు దగ్గర దీన్ని అభివృద్ధి చేశారు. ఇక శిఖ్రా అనేది మొట్టమొదటి నౌకాదళ హెలికాప్టర్ స్థావరం. దీన్ని ప్రారంభించింది ముంబయిలో. తీర ప్రాంతం నుంచి దాడి నిర్వహణకు అనువుగా రూపుదిద్దిన నౌక 'జలాశ్వ'. వందలాది సాయుధ దళాలు,




**జంధ్యాల శరత్‌బాబు**

సీనియర్ జర్నలిస్ట్


హెలికాప్టర్లు, ఎయిర్‌క్రాఫ్టులను తరలించే సామర్థ్యం దీనికి పుష్కలం. ఈ పేర్లన్నీ స్వభావ సిద్ధంగానే శక్తిసంపన్నతను ప్రతిఫలిస్తున్నాయి.

**విశిష్టతకు నిదర్శనాలు ఇవీ**

మరిక తొలి గూఢచార యుద్ధనౌక గురించి తెలుసుకోవాలని ఉందా? దాని పేరు శివాలిక్. విభూతి పేరుతో ప్రఖ్యాతి చెందింది. సంపూర్ణ దేశీయ సాంకేతిక పరిజ్ఞానంతో రూపొందించిన క్షిపణి నౌక. తొట్టతొలి యుద్ధ నౌక 'సావిత్రి' మరెంతో విశిష్టతను ప్రస్ఫుటీకరిస్తోంది. జాతీయ ప్రయోజనాలే పరమ లక్ష్యమని ప్రకటించిన హరికుమార్.... 'వివిధ సవాళ్లను ఎదుర్కోవడం పైనే దృష్టి సమస్తం కేంద్రీకరించాం' అని అన్నారు. నిషాంక్, కోరా, రణవీర్ వంటి యుద్ధనౌకలను 'కమాండ్' చేసిన ప్రత్యేక ఘనత ఆయనిది. పరమ విశిష్ట, అత్యంత సేవా విశిష్ట పతకాలు సంపాదించిన పోరాట యోధుడు. నేవిగేషన్, డైరెక్షన్ బాధ్యతల నిర్వహణలో ప్రవీణుడు. స్వరాష్ట్రం కేరళ. తిరువనంతపురంలో విద్యాభ్యాసం. దళంలో మహిళల ప్రాముఖ్యం పెరగాల్సిన అవసరాన్ని గుర్తించి, అందుకు అనుగుణమైన జాగ్రత్తలు తీసుకున్నారు. పర్యవసానంగానే అగ్నివీర్‌లో నియామకాల పరంపర. భారత నావికాదళం నానాటికీ బలోపేతమవుతోందని తెలుగునాట పర్యటనలో రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ప్రశంసించడం అభినందనీయం. ఎప్పుడు ఎలాంటి సవాళ్లు ఎదురైనా ఎదుర్కొనేందుకు సంసిద్ధమని ప్రకటించారు. వీటన్నింటి నేపథ్యంలో, దళంలో అతివల చేరిక ఎంతైనా శ్లాఘనీయం. ఆశించి, అది సాధించేందుకు తపించి, పోటీపడి కృషి సాగించి, విజయాన్ని అందుకోవడమే జీవితం. పట్టుదలతో వ్యవహరిస్తే, కాలమే ఉత్తమ ఫలితాలనిస్తుంది. పరిశీలన, అనుశీలన జత కూడితే వ్యూహరచన. అందులోనూ, కార్యాచరణ పరంగానూ అగ్రభాగాన నిలిచిన ముదితలు తామేమిటో లోకానికి చాటారు. ప్రత్యేకమైన అభిరుచి, అవిశ్రాంత సేవ ఉంటే తప్ప సాయుధ దళాలలోకి ప్రవేశించలేరెవరూ. అంతటినీ సుసాధ్యం చేసిన మహిళా విజేతలను హృదయపూర్వకంగా అభినందించాల్సి ఉంది. సాహసమే పథమైనప్పుడు, గట్టిపట్టు ప్రధానమైనప్పుడు, ఆశయమే సాధనంగా మారుతుంది. తెలివి, శ్రమ తోడైనప్పుడే అతివల ప్రవేశం నూతన ఆశా జ్యోతులను వెలిగిస్తోంది. నారీలోకమణులంటే అక్షరాలా వారే!

ఆ ధీరశక్తి ఇతరులందరికీ స్ఫూర్తి ప్రదాయకం. భారతీయతా దీప్తిమంతానికి ప్రత్యక్ష సాక్ష్యం. అవును కదూ! ★



**స్వాతంత్ర్య అమృత కాలంలో అభివృద్ధి చెందిన దేశంగా మారే లక్ష్యం వైపు భారత్ వేగంగా పురోగతి చెందుతోంది. ఈ అభివృద్ధియాత్ర బహుముఖమైనది. సామాన్యుడి అవసరాలతో పాటు ఆధునిక మౌలిక సదుపాయాలు, సమ్మిళిత అభివృద్ధి ద్వారా మన వారసత్వ సంపదను అందంగా తీర్చిదిద్దటం కూడా ఇందులో కలిసి ఉంది. ఈ తరహా అభివృద్ధి దార్శనికత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దక్షిణాది పర్యటనలో ప్రతిబింబించింది. నవంబర్ 11,12 తేదీలలో జరిగిన ఈ పర్యటన బెంగళూరులో మహర్షి వాల్మీకికి, శ్రీనాదప్రభు కెంపెగౌడకు, కవిసాధువు శ్రీ కనకదాసుకు నివాళులర్పించటంతో మొదలైంది. అదే సమయంలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, తమిళ నాడు, రాష్ట్రాలకు సుమారు రూ.25,000 కోట్ల అభివృద్ధి ప్రాజెక్టులు కూడా అందాయి. అందులో దక్షిణ భారతదేశానికి వందేభారత్ ఎక్స్‌ప్రెస్ రైలు, ఒక కొత్త విమానాశ్రయ టెర్మినల్, 6 వరుసల గ్రీన్ ఫీల్డ్ ఎకనామిక్ కారిడార్, ఒక ఎరువుల కర్మాగారం తదితర ప్రాజెక్టులు ఉన్నాయి.**

# దేశ ప్రగతిలో 'దక్షిణాది' కీలకం

భారత సాంస్కృతికాభివృద్ధికి, దేశాభివృద్ధిలో కూడా దక్షిణ భారతదేశం పాత్ర చాలా ముఖ్యం. పూర్వకాలం మొదలుకొని ఇప్పటిదాకా దక్షిణాదికి చెప్పుకోదగినంత చారిత్రక, రాజకీయ, సాంస్కృతిక ప్రభావం యావద్దేశం మీద ఉంది. నాలుగు రాష్ట్రాల పర్యటన సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ దేశాభివృద్ధిలో ఈ రాష్ట్రాల ప్రాధాన్యాన్ని కూడా నొక్కి చెప్పారు.

బెంగళూరులో నాదప్రభు కెంపెగౌడ 108 అడుగుల కాంస్య విగ్రహాన్ని కూడా ప్రధాని నరేంద్ర మోదీ ఆవిష్కరించారు. 98 టన్నుల కంచు, 120 టన్నుల ఉక్కు ఉపయోగించిన ఈ విగ్రహాన్ని తీర్చిదిద్దింది కూడా 'సమైక్యతా విగ్రహ' శిల్పి అయిన రామ్ వి. సుతార్. 16 వ శతాబ్దంలో విజయనగర సామ్రాజ్యాన్ని పరిపాలించిన కెంపెగౌడను బెంగళూరు వ్యవస్థాపకునిగా పరిగణిస్తారు. నగరంలో సాగునీటికి, తాగునీటికి ఆయన సుమారు 1000 చెరువులు నిర్మించినట్టు ప్రతీతి. దక్షిణ కర్ణాటకలోని ఆధిపత్య వ్యవసాయ వర్గమైన వొక్కళిగ సామాజిక వర్గానికి చెందినవాడు కెంపెగౌడ.

బెంగళూరులోని క్రాంతివీర సంగోలి రాయన్న రైల్వే స్టేషన్ నుంచి జెండా ఊపి చెన్నై–మైసూరు మధ్య వందేభారత్ ఎక్స్‌ప్రెస్ రైలును ప్రారంభించారు. దేశంలో ఇది ఐదవ వందేభారత్ ఎక్స్‌ప్రెస్ రైలు. బెంగళూరు నుంచి వారణాసి (కాశీ) వెళ్లే యాత్రికుల కోసం 'భారత్ గౌరవ కాశీ దర్శన్' రైలును జెండా ఊపి ప్రారంభించారు. ఈ యాత్ర రైలు ప్రారంభమైన మొదటి రాష్ట్రం కర్ణాటక. ఈ రైలు యాత్ర ఈ ప్రాంత ప్రయాణికులను కాశీ, అయోధ్య, ప్రయాగ రాజ్ లాంటి చారిత్రక ప్రదేశాలకు చేరవేస్తుంది.

కర్ణాటక, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలలో రూ. 25,000 కోట్ల అభివృద్ధి ప్రాజెక్టులను కూడా ప్రధాని నరేంద్ర మోదీ ప్రారంభించారు.

తెలంగాణలోని రామగుండంలో ఎరువుల కర్మాగారాన్ని జాతికి అంకితం చేశారు. ఈ ప్రాజెక్టు ఆగస్టు 7, 2016న ఆయన శంకుస్థాపన చేశారు. ఈ కర్మాగారం ఎరువుల తయారీలో స్వయం సమృద్ధిని సాధించే లక్ష్య సాధనలో కీలకపాత్ర పోషిస్తుంది. రామగుండం కర్మాగారంలో ఏటా 12.7 లక్షల మెట్రిక్ టన్నుల వేప పూతతో కూడిన యూరియా తయారవుతుంది. రామగుండం సభలో ఆయన ప్రసంగిస్తూ, సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ (ఎస్.సి.సి.ఎల్), వివిధ బొగ్గు గనుల విషయంలో సాగుతున్న పుకార్లకు ఫుల్‌స్టాప్ పెట్టారు. 'దేశం అభివృద్ధి చెందుతున్నప్పుడు అభివృద్ధి పనులు వేగం పుంజుకుంటాయి. కొన్ని సార్లు రాజకీయ ప్రయోజనాల కోసం కొంతమంది వంకరబుద్ధితో పుకార్లు ప్రచారం చేస్తుంటారు. అలాంటి పుకార్లే ఈ మధ్య సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ మీద, మరికొన్ని బొగ్గు గనుల మీద తెలంగాణలో ప్రచారం చేస్తున్నారు.." అన్నారు. "ఎస్.సి.సి.ఎల్ లో రాష్ట్ర ప్రభుత్వానికి 51 శాతం వాటా ఉంది. భారత ప్రభుత్వానిది మిగిలిన 49 మాత్రమే. ఎస్.సి.సి.ఎల్‌ను ప్రైవేటీకరించాలంటే కేంద్ర ప్రభుత్వం తనంత తానుగా నిర్ణయం తీసుకోవటం కుదరదు. ఎస్. సి.సి.ఎల్ ను ప్రైవేటుపరం చేసే ప్రతిపాదన గాని, అలాంటి ఉద్దేశం గాని కేంద్ర ప్రభుత్వానికి లేదు' అని స్పష్టం చేశారు.

రూ. 1000 కోట్లతో పూర్తి చేసిన భద్రాచలం రోడ్– సత్తుపల్లి రైల్ లైన్ క్రాసింగ్‌ను కూడా ప్రధాని ఆవిష్కరించారు. రూ. 2200 కోట్లకుపైగా విలువచేసే రోడ్డు ప్రాజెక్టులకు ఆయన శంకుస్థాపన చేశారు.

*('న్యూ ఇండియా సమాచార్' నుంచి)*



# చారిత్రక వైభవానికి సాక్ష్యం

**శతాబ్దాల చరిత్ర ఉన్న మెట్ల బావులు మన సంస్కృతిలో భాగం. అయితే కొన్ని దశాబ్దాలుగా ఈ బావులు నిరాదరణకు గురై, రూపురేఖలు కోల్పోతున్నాయి. మెట్ల బావుల పునరుద్ధరణకు తెలంగాణ ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. హైదరాబాద్ చారిత్రక వైభవానికి సజీవ సాక్ష్యాలుగా నిలిచే మెట్లబావుల పరిరక్షణకు ప్రణాళికాబద్ధంగా కార్యాచరణ చర్యలు చేపట్టింది. అందులో భాగంగా బన్సీలాల్‌పేట మెట్ల బావి పునరుద్ధరణ పనులు చేపట్టింది. సహిత స్వచ్ఛంద సంస్థ సహకారంతో ఈ బావిని జీహెచ్ఎంసీ పునరుద్ధరించింది. పురాతన బావికి మరమ్మతులు చేసి ఆధునీకరించారు. దీంతో ఇది కొత్త అందాలు సంతరించుకుంది. డిసెంబర్ 5న రాష్ట్ర పురపాలక, ఐటీ మంత్రి కేటీఆర్ దీనిని ప్రారంభించారు.**

చెత్తాచెదారంతో పూడుకుపోయిన ఈ బావి పునరుద్ధరణ పనులను ఆగస్ట్ 15, 2021న ప్రారంభించారు. సుమారు 3,800 మెట్రిక్ టన్నుల వ్యర్థాలను 800 ట్రిప్పులతో తొలగించారు. విద్యు ద్దీపాలు అలంకరించి.. ఆకర్షణీయంగా తీర్చిదిద్దారు. కళ్లు చెదిరేలా పర్యాటక హంగులు కల్పించారు. సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణకు వీలుగా అంఫీ థియేటర్, పూడికతీత తొలగింపు సందర్భంగా లభ్యమైన వివిధ రకాల పరికరాల ప్రదర్శన కోసం గ్యాలరీ, చక్కటి పచ్చదనంతో కూడిన గార్డెన్‌ను ఏర్పాటు చేశారు. ప్రస్తుతం 53 అడుగుల మేర ఊట నీరుతో మెట్లబావి కళకళలాడుతున్నది. బావి చుట్టు పక్కల ప్రాంతాలలో బోర్లన్నీ భూగర్భ జలాలతో నిండుగా ఉన్నాయని స్థానికులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

**అసఫ్-జాహీ కాలంలో నిర్మాణం**

సికింద్రాబాద్ ప్రజల తాగునీటి కోసం బన్సీలాల్ పేటలోని మెట్ల బావిని అసఫ్-జాహీ వంశస్తులు ఆరు అంతస్తుల లోతు, మెట్లు, స్తంభాలతో నిర్మాణం చేశారు. ఊటనీరుతో నిండి మోట ద్వారా నీటిని పైకి లాగడానికి ఏర్పాట్లు కూడా ఉండేవి. ఈ బావి సామర్థ్యం 22 లక్షల లీటర్లు. నీళ్లు ఎంత కిందికి వెళ్లినా.. మెట్ల ద్వారా కిందకు దిగి.. కుండ లేదా బిందెతో మంచి నీళ్లు తోడుకునే వీలుండేది. అయితే కాలక్రమేణా ఇది చెత్తా చెదారంతో నిండిపోయింది. ఆంగ్లేయుల కాలంలో సికింద్రాబాద్ పాలనాధికారి, రెసిడెంట్ అధ్యక్షుడు టీహెచ్ కీస్ ఈ బావిని 1933లో పునరుద్ధరించారు. అందుకు సేట్ బన్సీ లాల్ అనే వ్యాపారి ఆర్థిక సహకారం అందించారని, అనంతరమే ఆ ప్రాంతానికి బన్సీలాల్‌పేట్ అని నిలిచిపోయింది.

**ఇదే స్ఫూర్తితో మరికొన్ని..**

108 ఎకరాల్లో విస్తరించి ఉన్న కులీకుతుబ్‌షాహీ టూంబ్స్ వద్ద ఆరు మెట్ల బావులను ఇదే పద్ధతుల్లో ఆగాఖాన్ ఫౌండేషన్ వారు ఆధునీకరించారు. వాటికి యునెస్కో నుంచి అవార్డు వచ్చింది. అదే విధంగా మొజాం జాహీ మార్కెట్, మీరాలం మండి, స్టేట్ సెంట్రల్ లైబ్రరీ, షేక్‌పేట్ సరాయి.. వంటి వాటిని ఇంతే అద్భుతంగా, పూర్వ వైభవం సంతరించుకునేలా ఆధునీకరిస్తామని, హైదరాబాద్‌లో మన చరిత్రకు, వారసత్వానికి, సంస్కృతికి నిదర్శనంగా నిలిచే కట్ట డాలను పునరుద్ధరించడం లక్ష్యంగా పెట్టుకున్నామని, నగరానికి యునెస్కో ప్రపంచ వారసత్వ సంపద కలిగిన నగరంగా కూడా గుర్తింపు తెస్తామని కేటీఆర్ ఈ సందర్భంగా స్పష్టం చేశారు. ★

కథ

**వాకాటి పాండురంగరావు స్మారక దీపావళి కథల పోటీకి ఎంపికైనది**

# కళ్యాణము

"అల్లునితోనే గిల్లుడన్నట్లు నేనెందుకురా? 'పానకంలో పుడక లెక్క ఈడేందిరా బై' అనుకోదారా సత్య? నేన్రాన్రా!" అప్పటికి అది వందోసారి సాయి, ప్రవీణ్‌తో అనడం.



ప్రవీణ్, సాయి ఇద్దరూ రూమ్మేట్స్. మంచిమిత్రులు. యూఎస్ లో ఇద్దరూ ఒకేచోట ఎమ్మెస్ చేశారు. ఆరేళ్ల నుంచీ ఉద్యోగాలు చేసే కంపెనీలు వేరే అయినా ఇద్దరూ కలిసే ఊళ్లు మారుతున్నారు. ఒకచోటే ఉంటున్నారు. ప్రస్తుతం టెక్సాస్‌లో ఉన్నారు. సాయిది ఖమ్మం. ప్రవీణ్ వాళ్ళది ఎప్పుడో యాభయ్యేళ్ల క్రితం నూజివీడు నుంచి హైదరాబాద్ వచ్చిన కుటుంబం. ప్రవీణ్ కన్నా సాయి రెండేళ్లు చిన్న.

ప్రవీణ్‌కి కాబోయే భార్య సత్యప్రభ. హైదరాబాద్‌లోనే సాఫ్ట్‌వేర్ ఉద్యోగిని. ఇద్దరికీ ఒకరికొకరు నచ్చడంతో, ఆలస్యం చేయకుండా ఆన్‌లైన్‌లోనే నిశ్చితార్థం చేసేశారు పెద్దవాళ్లు. మరో నెల రోజుల్లో పెళ్లి ముహూర్తం.

నూటొక్కటోసారి సాయి అభ్యర్థనను తిరస్కరించేసి ఇండియాకి బయల్దేరదీశాడు ప్రవీణ్.

"అమ్మా చూడవానే? ప్రవీణ్ గాడి ప్రీ వెడ్డింగ్ షూట్ వీడియో వచ్చింది. రారా..!" తల్లిని లాక్కొచ్చి కంప్యూటర్ ముందు కూలేశాడు సాయి.

"మీ బాపుని కూడా పిలువు!" అంటూనే "ఇగో..ప్రవీణ్ వీడియో రారాదండీ?" భర్తని పిలిచింది స్వరూప.

"నాతోని గాదులే! సెన్సార్ చెయ్యని దృశ్యాలు మస్తుంటాయండ్ల! రేపు టౌన్ హాల్ల ఉపన్యాసముంది నాకు" అంటూ దాశరథిగారి 'మాయ జలతారు' పుస్తకాన్ని తీసుకుని వరండాలోకి వెళ్ళిపోయాడు దేవేందర్.

"ఈయనెప్పటికి మారడే! ఎట్లా బతుకుతున్నవే ఈ మొరటోనితోని? వచ్చెయ్ పోదాం అమెరిక." నవ్వుతూనే తండ్రిని విసుక్కుని స్నేహితుడి వీడియోలను డౌన్‌లోడ్ చేశాడు సాయి.

తనకి పెళ్లి పనులు ఉండడంతో ఎడిటింగ్ బాధ్యతని సాయి మీద పెట్టాడు ప్రవీణ్. నేపథ్య గీతాల ఎంపిక కూడా చేయాల్సి ఉంది.

ప్రీ-వెడ్డింగ్ చిత్రీకరణ కోసం కాబోయే వధూవరులనిద్దరినీ జలపాతాల దగ్గరకి, కొండలు, గుట్టలు, పార్కులు రిసార్ట్స్.....ఇలా చాలా ప్రదేశాలకి తీసుకెళ్లాడు ఫోటోగ్రాఫర్. వందల్లో ఉన్నాయి ఫోటోలు, వీడియోలు. వాటిలో ప్రవీణ్ సత్యలిద్దరూ చాలా సన్నిహితంగా ఉన్నట్లు రకరకాలుగా పోజులిచ్చారు.

వరంగల్ దగ్గరి బొగతా జలపాతంలో





# చూతము రారండీ!

## నందిరాజు పద్మలతాజయరాం













జంటగా తడిసి మురిపాలు పంచుకుంటూ, అమీన్‌పూర్ లేక్‌లో సరిగంగ స్నానాలాడుతూ, గోల్కొండకోటలో దాగుడు మూతలాడుతూ, రామోజీ ఫిలిం సిటీలో డ్యూయట్ పాడుతున్నట్లూ వీడియోలు, ఫోటోలు. చౌ మొహల్లా పాలస్ లో ఇద్దరూ భగ్న ప్రేమికుల లాగా చెరో చోటా కూర్చుని విరహగీతాలు పాడుకుని, ఆ తర్వాత ఖరీదైన స్యూట్‌లో ఒకరిలో ఒకరు ఒదిగిపోతూన్నట్లు జీవించేశారు. ఆఖరుకి కుతుబ్ షాహీ సమాధుల దగ్గర కూర్చుని 'రేపెప్పుడైనా చావు వస్తే, ఇద్దరం కలిసే పోతాం' అన్నట్లు బ్రహ్మాండంగా నటించేశారు ప్రవీణ్, సత్య.

పొట్ట చెక్కలయ్యేలా నవ్వుతూనే ఉన్నాడు సాయి మొదటినుంచీ ఆఖరు దాకా.

"మై గాడ్! ప్రవీణ్ గాడికి ఆస్కార్ అవార్డిచ్చినా చాలదు కదమ్మా!" అంటూ ప్రక్కకి తిరిగి చూస్తే, ఆవిడ కన్పించలేదు.

"ఏందమ్మా నడిమిట్ల చెక్కేసినవ్? నేనొక్కడ్నే ఎట్లా సెలెక్ట్ చేయలేస్తనే?" వంటింట్లోకొచ్చి తల్లితో కోపంగా అన్నాడు సాయి.

"అది తల్లీకొడుకులు కూసుని, చూసేతట్లున్దారా? పెళ్లికి ముందే అన్ని ముచ్చట్లవసరమా? మీ పోరలు చదువు కుంటున్నరు గానీ సభ్యత మరుస్తున్నర్రా!" సకినాల పిండి కలుపుకుంటూ, కొడుకు వైపు తలెత్తి చూడడానికి కూడా సిగ్గు పడింది స్వరూపరాణి.

"మీ జెనరేషన్ ఎప్పటికి ఎదగదా? వాళ్లు ఆలుమగలే గదనే! తప్పేముంది?"

"ఆలుమగలయిన్రారా? ఏమోలే తియ్యి! మమ్ములనిట్లనే బతుకనియ్యి!" అనేసింది తల్లి.

'నాకేమీ అంత అసభ్యత కన్పించలేదే! అమ్మకెందుకట్లా అన్పిస్తోందబ్బా?' ఆలోచనలో పడ్డాడు సాయి.

* * *

పూలమాలలతో పెళ్లి మండపం కళకళ లాడుతోంది. కళ్యాణ వేదిక ఇంకా సిద్ధం కాలేదు.

పెళ్లికొడుకు సాకేత్ చేత అనేక ప్రాయశ్చిత్తాలు చేయించి, శుద్ధి మంత్రాలు చెప్పించాక, గోత్ర ప్రవరలు చదివారు పురోహితులవారు.

"అయ్యా! స్నాతకం పూర్తయ్యింది. వధువు తలిదండ్రుల్ని, అన్నదమ్ముల్నీ పిలిస్తే , వరుడి కాశీ యాత్రా కార్యక్రమం మొదలవుతుంది. అమ్మా! ఏవీ పావుకోళ్లు, గొడుగు వగైరాలు?"

వధువు స్వాతి వైపు వారు ఆయన అడిగినవి అందించసాగారు.

స్వాతి, సాయికి పెద్దమ్మ కూతురు, చెల్లెలు వరుసవుతుంది. ఆ అమ్మాయి పెళ్లికి, ప్రవీణ్ పెళ్లి పుణ్యమా అని భారత్‌కి రావడం వలన హాజరవగలిగాడు సాయి. ప్రవీణ్‌ని, అతనికి కాబోయే భార్య సత్యప్రభని తన తరపున పెళ్ళికి ఆహ్వానించి, తమతో పాటే ఖమ్మం తీసుకుని వచ్చాడు.

"సాయీ? ఏంటి కాశీయా? నిజంగానే?" ఆశ్చర్యంగా అడిగింది సత్య.

"లేదు ఇదొక అంశం పెళ్లిలో. ఇప్పుడు చూడు, మా సంతోషన్న బామ్మరిది హోదాలో పెళ్లికొడుకును సంజాయిస్తడు. 'బావా..మా చెల్లి నీ కొరకే ఎదురు చూస్తున్నది. మంచిగా పెళ్లి చేసుకొని, పిల్లలను కని, ఆ తర్వాత ఇద్దరు కలిసి కాశీకి పోదురు' అని

"నైస్ ముందు రక్తి, తర్వాతే భక్తన్నమాట" నవ్వాడు ప్రవీణ్.

"కాదు బాబూ! భక్తి, రక్తి, ముక్తి అన్నింటికీ వివాహం అవసరం. పిల్లా, పిల్లవాడూ కలవడానికి కాదు, రెండు కుటుంబాలు కలవడానికి పెట్టిన సిస్టమాటిక్ ప్రొసీజర్ పెళ్లి" చెప్పారు పురోహితుడు.

అప్పటికి మధ్యాహ్నం ఒంటిగంటవుతోంది. ఆ కార్యక్రమం అయ్యాక అరిటాకుల్లో విందుభోజనం. స్వాతి, సాకేత్ ఇద్దరికీ అల్పాహారం తప్ప భోజనం పెట్టలేదాపూట.

సాయంత్రం ఆరవుతూండగా పెళ్లి సంరంభం

మొదలయ్యింది. వేదిక మీద పచ్చని చిలకల పందిరి వేసారు.

పెళ్లికొడుకును వరపూజకి, పెళ్లికూతుర్ని గౌరీ పూజకి సిద్ధం కమ్మని ఆదేశించాడు పురోహితుడు.

"ప్రవీణ్ హల్దీ, మెహిందీ, సంగీత్ ఇవన్నీ ముందే అయిపోయాయా?" అమాయకంగా అడిగింది ప్రవీణ్‌ని సత్య.

"ఇంకా నయం, బ్యాచిలర్స్ పార్టీ ఎప్పుడు, బ్రైడల్ షవర్ ఎప్పుడూ అని అడిగావు కాదు. సాయి వాళ్ళ నాన్న మనల్ని ఉతికారేసేవాడు వింటే" సత్య తలమీద మొట్టికాయ వేశాడు ప్రవీణ్.

"ఇదీ ఇంటరెస్టింగానే ఉందిలే..!" అంది సత్య.

"పెళ్లి క్రతువంతా చూడండి. రండి. ఇప్పుడు ఎదుర్కోలు కార్యక్రమం." తీసుకెళ్లాడు సాయి.

వధూవరుల బంధువులు చెరో వైపు కూర్చున్నాక, ఇరుపక్షాల పురోహితులు మంగళ వచనం చేసి, శుభలేఖలు చదివారు. పానకం బిందెలు, సారె అందించిన వధువు తరపువారు అందరినీ పెళ్లికి రమ్మని కుంకుమ, చందన, తాంబూలాల తో సగౌరవంగా ఆహ్వానించారు.

"ఇదేంటి? పెళ్లి కొడుకున్నాడు, మీ చెల్లి లేదే ఇక్కడ?" అడిగింది సత్య.

"జీలకర, బెల్లం పెట్టే సుముహూర్తం దాకా వధూవరులు ఒకర్నొకరు చూసుకోవడం, తాకడం పద్ధతి కాదు. కన్యాదానం అయ్యేవరకు వధువు వాళ్ల అమ్మానాన్నల ఆస్తి. ఇంతకు ముందు పంతులుగారు చెప్పినట్లు వివాహమంటే కుటుంబ వ్యవహారం." సాయి తండ్రి దేవేందర్ అన్నాడు సత్యతో.

తల పంకించింది సత్య. మరో

సత్య ప్రవీణ్ చేతిని గట్టిగా పట్టుకుంది."ఇంకా వెళ్దామా అందరూ అక్షింతలు చల్లి భోజనాలకి వెళ్తున్నారు. మీ వాళ్లు ఎదురు చూస్తూ ఉంటారేమో, భోజనం చేసి వెళ్లిపోదాం." "ప్రవీణ్ ప్లీజ్. చూడాలనుంది నాకు. అమ్మకి నేను ఫోన్ చేసి చెప్తాను" కాదనలేక పోయాడు ప్రవీణ్.

ఆశ్చర్యమేమిటంటే, ఫోటోగ్రాఫర్స్ స్టిల్స్ తీస్తామని అడగడం, కార్యక్రమంలో అడ్డుపడడం జరగడం లేదు.

"సాయి వాళ్ల పెద్దనాన్న ఫోటోగ్రాఫర్స్‌కి ముందే చెప్పారట సత్యా.! 'చూడండి, పెళ్లి జరిగేది ఫోటోల కోసం కాదు. జరుగుతున్నపుడు పిక్స్ తీసుకోండి' అని" చెప్పాడు ప్రవీణ్.

పెళ్లి అయేసరికి ఆలస్యమవుతుందని, హైదరాబాద్ తిరిగెళ్లిపోదామన్నాడు ప్రవీణ్. కానీ, సత్యకి వేడుక మొత్తం చూడాలన్న కోరిక. కాదనలేక పోయాడు ప్రవీణ్.

గోరింట పూచిన చేతుల నిండుగా గాజులు, మెళ్లో హారాలు, పారాణి పాదాలకు వెండి మువ్వల పట్టీలు , ముంగురులు ముసురుతున్న ఫాలభాగాన చక్కని కళ్యాణతిలకం...పెళ్లికళతో పెళ్లికుమార్తె స్వాతి సాక్షాత్తూ లక్ష్మీదేవిలా ఉంది.




ఆమెను పద్మం ఆకారంలో ఉన్న గంపలో కూర్చోబెట్టి గౌరీపూజ చేయిస్తున్నారు. అక్కడే తనూ కూర్చుని వధువు పూలజడ సర్దడంలో సహాయం చేస్తోంది సత్య. పూజ పూర్తయ్యాక , అక్కడికి వరుడి వైపు మగవారిని తీసుకువచ్చారు పురోహితులు. వరుని వంశాన్ని, గుణ గణాలని వర్ణించి 'మదర్థం కన్యా వృణీధ్యం' ( ఈ కన్యను నాకిచ్చి వివాహం చేయమని వారిని అర్థించండి) అంటూ వరుడు కబురు పంపడం, వధువు వంశానుక్రమాన్ని, ఆమె గుణగణాల్ని వధువు తండ్రి చేత చెప్పించడం అయ్యాక, పెళ్లి కూతుర్ని సువర్ణపుష్పాన్ని పూసజ్జలో ఉంచినంత పవిత్రంగా ఆమె మేనమామలు భుజాలపై తీసుకెళ్లి పెళ్లిపీటలపై కూర్చో బెట్టడం అద్భుతంగా అనిపించింది సత్యకి. ఆడపిల్లకి ఇంతటి గౌరవం ఇస్తుందా మన ధర్మం అనుకుని గర్వపడింది కూడా.

పెళ్లివేదికపైన అప్పటికే తెర పట్టుకుని ఉన్నారు కన్నెపిల్లలు. తల్లితండ్రుల నడుమ ఒద్దికగా కూర్చొని ఉంది వధువు స్వాతి. పలుచని తెర వెనుక ఉన్న తనను చూసేందుకు వృథా ప్రయత్నం చేస్తున్న సాకేత్‌ని చూసి కొంటెగా నవ్వుతోంది స్వాతి.

"లెక్క ప్రకారం, పెళ్లికూతురు, పెళ్లికొడుకు ఇంతదంకా ఒకర్నొకరు చూసుకోలేదన్నట్లు" నవ్వుతూ అన్నాడు సాయి.

ప్రవీణ్, సత్యా కూడా చిరునవ్వు నవ్వి, చాలా ఆసక్తిగా చూడసాగారు.

'ధర్మ ప్రజ్ఞా సంతతి వృధ్యర్థం స్త్రియ ముద్వాహే' అంటూ ఈ కన్యను నేను ధర్మం కోసం, సంతానం కోసం వివాహం చేసుకుంటున్నాను అని వరుడి చేత అనిపించాక, వధూవరులు లక్ష్మీనారాయణుల స్వరూపం అంటూ మహాసంకల్పం చెప్పారు పురోహితులు. ఆ తర్వాత స్వాతి తండ్రి సాకేత్‌కి కాళ్లు కడిగాడు. బాజాభజంత్రీలు ఒక్కసారిగా మోగాయి. సుముహూర్తం దాటకుండా, ఒకరి తలపై మరొకరు జీలకర్ర,బెల్లం పెట్టుకున్నారు వధూవరులు. తెర తొలిగింది. కన్నులు కలిశాయి.

సత్య ప్రవీణ్ చేతిని గట్టిగా పట్టుకుంది."ఇంకా వెళ్దామా అందరూ అక్షింతలు చల్లి భోజనాలకి వెళ్తున్నారు. మీ వాళ్లు ఎదురు చూస్తూ ఉంటారేమో, భోజనం చేసి వెళ్లిపోదాం."

" ప్రవీణ్ ప్లీజ్. చూడాలనుంది నాకు. అమ్మకి నేను ఫోన్ చేసి చెప్తాను" కాదనలేక పోయాడు ప్రవీణ్.

'కన్యాం సాలంకృతాం సాధ్వీం సుశీలాయ సుధీమతే ప్రయతోహం ప్రయచ్ఛామిచ్ఛామి ధర్మ

కామార్థ సిద్ధయే' 'నీతో ధర్మార్థ కామాలకు నా ఈ సాధ్వి, శీలవతి, సౌందర్యవతి, బుద్ధిమతి అయిన ఈ నా కుమార్తె సిద్ధంగా ఉంది అంటూ అల్లుడికి కన్యాదానం చేయడం 'నాతి చరామి' అని వరుడు నీవు లేకుండా ఎక్కడా, ఏమీ చేయను సుమా అని హామీ ఇవ్వడం అపురూపంగా అన్పించింది ప్రవీణ్ కి కూడా.

"సో, తల్లిదండ్రులకు తమ కూతురి మీద హక్కు పూర్తిగా పోయినట్లేనా?" దిగులు ధ్వనించింది సత్య గొంతులో.

"కాదు తల్లీ..! వధువు తండ్రి 'న మమ' అంటే 'ఈమె ఇక మాది కాదు' అనడు. ఇక నుంచీ నీది కూడా అని చెప్పి భర్తకు అప్పగిస్తాడు." సాయి తండ్రి దేవేందర్ సత్య అనుమానం తీర్చాడు.

"పదరా ప్రవీణ్! రా సత్యా! భోం చేసొద్దాం." అంటూ వచ్చాడు సాయి.

చకచకా భోజనం చేసి మళ్లీ కళ్యాణవేదిక దగ్గరకు వచ్చారిద్దరూ. 'యోక్త్ర బంధనం' జరుగుతోందక్కడ.

"ఇదేంటి అంకుల్?" సత్య ప్రశ్నకి నవ్వాడు దేవేందర్.

"ఇంతకు ముందు మీరు సంప్రదాయబద్ధంగా జరిగే పెళ్లిళ్లకు వెళ్ళనేలేదా ఎట్లా?"

"సరిగ్గా టైంకి వెళ్లడం, గిఫ్ట్ ఇచ్చి విందు భోంచేసి వెళ్లి పోవడం. అంతే జరిగేది." చెప్పింది సత్య.

"మా ఇళ్లల్లో, పెళ్లికి ఇంత హంగామా ఉండదు అంకుల్. మొత్తం గంటలో ఫినిషయిపోతుంది." చెప్పాడు ప్రవీణ్.

"యోక్త్రం అంటే 'దర్భలతో అల్లిన త్రాడు' అని అర్థం. అబ్బాయి అమ్మాయి నడుముకు కట్టి ఆమెకు, మంచి సంతానం కొరకు , ప్రక్కన కూర్చుని యజ్ఞం చేయడం కొరకు అధికారం ఇస్తున్నడన్నట్లు" చెప్పాడు దేవేందర్.

మళ్లీ పెద్దఎత్తున బాజాలు మోగాయి. అందరి చేతుల్లోకి అక్షింతలు వచ్చాయి. సూత్రధారణ కార్యక్రమం మొదలవబోతోంది.

"మాంగల్యం తంతునానేనా 'నాకు తెలిసి మ్యారేజ్ అంటే ఇంతే! అఫ్ కోర్స్ తలంబ్రాలు. ఇవి తప్ప మిగిలిన ఏ కార్యక్రమాలు నేనింతవరకూ చూడలేదు." మూడుముళ్ల దృశ్యాన్ని చూస్తూ సత్యతో అన్నాడు ప్రవీణ్.

"పోనీలే! ఇప్పటికయినా చూసినారు. లేకుంటే, పెళ్లి పీటల మీదనే ఒకర్నొకరు ముద్దులు పెట్టుకొనుడు, కేక్ కటింగ్, షాంపేయిన్ వంటియన్నీ ఆచారంలో భాగం అనుకునేవాళ్లు మీరు" ఆట పట్టించాడు సాయి.

"బాబూ మాంగల్యధారణ అనేది నిజానికి వివాహక్రతువులో భాగమే కాదు తెలుసా! నల్లపూసలు కూడా ఏ మంత్రాల్లోనూ రాదు. ఫలానా అమ్మాయి వివాహిత అని తెలియడం కోసం మన వాళ్లు ఏర్పాటు చేసిన తెలివైన ఆడిషన్ ఇది." పక్కగా కూర్చున్న తెలుగు పండితుడొకాయన కల్పించుకున్నాడు.

ఆశ్చర్యంగా చూసారు సత్య, ప్రవీణ్.

క్రమంగా తలంబ్రాలు, కొంగుముడి, సప్తపది అన్నింటినీ వీడియో తీయసాగింది సత్య.

"ఎక్కడ ఏది మిస్సయితనో అన్నట్లు ఈ పిల్లలు అన్నం కూడా సరిగా తినలే! ఇదిగో.. స్వీట్, ఐస్క్రీం తెచ్చిన. తినండి." అంటూ తెచ్చిచ్చింది సాయి తల్లి స్వరూపరాణి.

మొహమాట పడుతూనే తీసుకున్నారిద్దరూ.

"ఇంక పోదామా? లేకపోతే వాళ్ళని గదిలోకి పంపి అప్పుడు వెళ్దామా?" ప్రవీణ్ గుసగుసగా అన్న మాటలకి సిగ్గుపడింది సత్య.

ఇద్దరూ వేదిక మీదికి ఎక్కబోతూంటే

మళ్లీ పెద్దఎత్తున బాజాలు మోగాయి. అందరి చేతుల్లోకి అక్షింతలు వచ్చాయి. సూత్రధారణ కార్యక్రమం మొదలవబోతోంది. "మాంగల్యం తంతునానేనా 'నాకు తెలిసి మ్యారేజ్ అంటే ఇంతే! అఫ్ కోర్స్ తలంబ్రాలు. ఇవి తప్ప మిగిలిన ఏ కార్యక్రమాలు నేనింతవరకూ చూడలేదు." మూడుముళ్ల దృశ్యాన్ని చూస్తూ సత్యతో అన్నాడు ప్రవీణ్.



పెద్దాయన వారించి వాళ్లచేత చెప్పులు విప్పించాడు.

"ఏమనుకోవద్దమ్మా! పెళ్లి మండపం దేవతలను ఆవాహన చేసిన ఒక యజ్ఞశాల. చెప్పులతో అపవిత్రం చేయొచ్చా? "

"ఓహ్ సారీ!" అన్నారు ప్రవీణ్ సత్య ఇద్దరూ.

"మా పెళ్లి ఈ నెల పద్దెనిమిదిన. మీ ఆయన్ని తీసుకుని రాకపోతే ఊరుకోను." వేదికనెక్కి తాము తెచ్చిన బంగారు ఉంగరం స్వాతికి తొడుగుతూ చెప్పింది సత్య. నవ్వుతూ తల ఊపారు స్వాతి సాకేత్.

"ఆంటీ..అన్నీ అయినట్లేగా ?" అడిగింది సత్య సాయి తల్లిని.

"అప్పుడేనా? ఇంకా స్థాలీపాకం అంటే ఇద్దరూ కలిసి వడ్లు దంచి అన్నం వండుడు, సన్నికల్లు త్రొక్కుడు అంటే శత్రువులను ఎదుర్కొనే ధైర్యం తెచ్చుకో తల్లీ అని ఆమెకు శక్తిని ధైర్యాన్ని ప్రసాదించుడు, నాకబలి.. దాన్నే నాగవల్లి అంటరు. సదస్యం అంటే పెళ్లికి వచ్చి దీవించిన పెద్దలకు నమస్కరించి ఆశీర్వచనం తీసుకొనుడు, అరుంధతి నక్షత్రం చూపెట్టుడు, మొట్టమొదటి సారి ఇద్దరు కలిసి చేసే యజ్ఞం రాజహోమం, ఆడబిడ్డకు బొమ్మనప్పగించుడు.. అదయినంక అప్పగింతలు. తెల్లారుతది.. ఇవన్నీ అయ్యే వరకు." నవ్వింది స్వరూపరాణి.

"డోంట్‌వర్రీ నీకేం లోటు లేకుండా, మొత్తం వీడియో నీకు పంపిస్తా సత్యా!" చెప్పాడు సాయి.

"నిజానికి, తెలంగాణలో రాత్రి పూట పెళ్లిళ్లు ఉండవు. కానీ, ఖమ్మం అంటే ఆంధ్రా బోర్డర్ కదా అందుకే సంప్రదాయాలు కలుస్తాయి." సత్యకి బొట్టుపెట్టి బట్టలు పెడుతూ చెప్పింది స్వాతి తల్లి.

అందర్నీ తమ పెళ్ళికి రమ్మని ఆహ్వానించి వీడ్కోలు తీసుకున్నారు ప్రవీణ్, సత్య.

"ప్రవీణ్! ఒకటడగనా?"

"నువ్వడిగేదేంటో నేను చెప్పనా?"

"చెప్పు?"

"ప్రవీణ్.మన పెళ్లి కూడా ఇలాగే, సంప్రదాయబద్ధంగా జరగాలి. ఆడంబరాలు, ఆర్భాటాలు వద్దు అని. ప్రీ వెడ్డింగ్ వీడియో పూర్తిగా మన పర్సనల్, దాన్ని ప్రదర్శించొద్దు అని. అంతేనా?" తన భుజం మీద వాల్చిన సత్య తల నిమురుతూ అన్నాడు డ్రైవ్ చేస్తున్న ప్రవీణ్.

"అవును. ప్రతి మంత్రమూ అద్భుతం. ఎంత అర్థం ఉంది కదూ! సప్తపదిలో మంత్రానికి అర్థం విన్నావా? 'ఓ ప్రియతమా! మనం కలిసి నడచిన ఈ ఏడు అడుగులూ ఆహారం కోసం, బలం కోసం, పుణ్యం కోసం, స్నేహం కోసం, సంతానం కోసం, సంపద కోసం, పెద్దల ఆశీస్సుల కోసం' అని. పెళ్లంటే సెలబ్రేషన్ కాదు. ఒక కమిట్మెంట్ అన్పిస్తోంది నాకు.

"నాకూ అలాగే అనిపించింది. మా నాన్నకి , మీ నాన్నకి చెప్పి సాయి వాళ్ల బాపుతో మాట్లాడమని చెబ్దాం... సరేనా" సత్య చేతిలో తన చేయి వేసి హామీ ఇచ్చాడు ప్రవీణ్. కారు మెత్తగా హై వే మీద సాగిపోయింది. ★



# ఒక మతం... రెండు వ్యాఖ్యలు

ఎన్నికలలో పోటీ చేయడానికి ముస్లిం మహిళలకు ఎవరు టికెట్లు ఇచ్చినా అది ఇస్లాంకు విరుద్ధమేనట. అంతేనా ఇస్లాంను బలహీనపరిచే చర్య కూడానట. గుజరాత్ రాజధాని అహ్మదాబాద్‌లో ఉన్న జామా మసీదు షాహీ ఇమామ్ షబ్బీర్ అహ్మద్ సిద్దికి అభిప్రాయమిది. అక్కడ ఇటీవలనే శాసనసభ ఎన్నికలు జరిగాయి. ఆ ఎన్నికల పోలింగ్ జరగడానికి కాస్త ముందే ఆయన ఇలా వాక్రుచ్చారు. అంతేకాదు, ఎన్నికలలో పోటీ చేయించడానికి ఇక పురుషులే మిగల్లేదా? అని సవాలుతో కూడిన పురుషాధిక్యజాల ప్రశ్నని సంధించారు. 'నమాజ్ చేసేవాళ్లని మీరు చాలామందిని చూడగలరు. కానీ వాళ్లలో ఎప్పుడైనా ఒక మహిళ నమాజ్ చేయడం చూశారా?' అని కూడా ఆయన ప్రశ్నించారు. ఇక్కడ ఆయన భావం, నమాజ్‌లో ముందుండేది పురుషులు. కానీ ఇప్పుడు ఎన్నికలలో నిలబడడానికి టికెట్లు ఇస్తే, అలా వారిని, అనగా మహిళలని జనం ముందుకు రావడానికి అనుమతిస్తే రేపు మసీదులోకి వెళ్లకుండా కూడా ఆపలేం అని ఆయన హెచ్చరించారు. కాబట్టి ఎవరైతే ముస్లిం వనితలకి ఎన్నికలలో పోటీ చేయడానికి టికెట్లు ఇస్తున్నారో వారంతా ఇస్లాం మీద తిరుగుబాటు చేసేవారి కిందే లెక్కని ఆయన తేల్చారు. ఎలాంటి ప్రత్యేక వత్తిడి లేకున్నా మహిళలని ఎమ్మెల్యేలూ, కౌన్సిలర్లుగా ఎంపిక చేస్తే రేపటి రోజున హిజాబ్‌కి ఇక రక్షణ ఎక్కడ అని కూడా ఆయన ఆక్రోశించారు పాపం. గత శాసనసభ ఎన్నికల మాదిరిగానే ఈ ఎన్నికలలో కూడా ఏదో ఒక పార్టీకే ఓటు వేయాలని ఆయన ఉచిత సలహా పడేశారు.

> 'ముస్లిం సోదరీమణులారా! మీరు నాకు ఓటేసినా వెయ్యకపోయినా పరవాలేదు. మిగిలిన విషయాలలో అజ్మల్ మాటలు నమ్మకండి. కానీ ఇద్దరు పిల్లల సందేశాన్ని మాత్రం పాటించండ'ని హిమంత చెప్పారు.

అతడి కంటే ఘనుడు ఆచంట మల్లన్న అని ఒక పద్యపాదం చెబుతుంది. ఎన్నికలలో టికెట్లు ఇస్తే అపచారమని గుజరాతీ గురువు చెప్పగా, హిందువులు కూడా ఇస్లాం మాదిరిగా ఆడపిల్లలకి త్వరగా పెళ్లిళ్లు చేసి పిల్లలను కనిపెట్టే బాధ్యతలో వారిని ఉంచాలని అస్సాం కేంద్రంగా పనిచేసే బంగ్లా వలస ముస్లింల పార్టీ అఖిల భారత యునైటెడ్ డెమాక్రటిక్ ఫ్రంట్ నాయకుడు బద్రుద్దీన్ అజ్మల్ సలహా ఇచ్చారు. దీనికి ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి హిమంత బిశ్వశర్మ కాస్త ఘాటుగానే స్పందించారు. మాతృగర్భం అంటే పంట పొలం కాదు కదా అని అజ్మల్‌కి తెలియచెప్పే ప్రయత్నం చేశారు. అన్నట్టు అజ్మల్ పార్లమెంట్ సభ్యుడు. ఆ మాట హిందూ జీవన విధానంలో ఆయన జోక్యం ఎందుకు అన్న ప్రశ్న తెచ్చే మాట నిజమే అయినా, ముస్లింలు కూడా ఇద్దరు పిల్లలతో సరిపుచ్చి వాళ్ల విద్యాబుద్ధుల గురించి ఎక్కువ పట్టించుకోవాలని కూడా చెప్పడం బాగానే ఉంది. నేల పదునుగా ఉన్నప్పుడే బీజం పడితే మంచి పంట వస్తుందని కాస్త మొరటుగానే అజ్మల్ చెప్పారు. అయినా ఇదైనా ఆయన మనసులో నుంచి వచ్చిందా అన్నది సందేహమే. హిందూ బాలికలు పెందరాళే పెళ్లిళ్లు చేసుకుని, ముస్లిం వనితలలాగే గంపెడు సంతానం కనాలని చెప్పడం ఏమిటో! నిజానికి ఈ మాట ఆయనని ఇరకాటంలో పడేసింది. కాంగ్రెస్ నేతతో సహా పలువురు ఆ వ్యాఖ్యను ఆధారం చేసుకుని పోలీసు కేసు పెట్టారు. ఇక, ముస్లిం వనితాలోకం ఓట్ల కోసం వచ్చేవారిని నమ్మరాదని అజ్మల్ చెప్పారు. అందులో ఆయన కూడా ఉన్నారేమో తెలియదు. దీనికి హిమంత బిశ్వ శర్మ సమాధానం బావుంది. ముస్లిం సోదరీమణులారా! మీరు నాకు ఓటేసినా వెయ్యకపోయినా పరవాలేదు. మిగిలిన విషయాలలో అజ్మల్ మాటలు నమ్మకండి. కానీ ఇద్దరు పిల్లల సందేశాన్ని మాత్రం పాటించండని చెప్పారు.

అయినా హిందూ మహిళ ఎంతమంది పిల్లలను కనాలో చెప్పడానికి అజ్మల్ ఎవరు అని బిశ్వశర్మ సరిగానే ప్రశ్నించారు. ఇంతకీ ముస్లిం వనితలు గంపెడు మంది పిల్లలను కనడానికీ, వాళ్లని సరైన పౌరులుగా తీర్చిదిద్దడానికి మధ్య ఉన్న అగాధం గురించి అజ్మల్ గ్రహించారని అనుకోవాలా? వద్దా? ★

ప్రపంచ క్రీడ ఫుట్‌బాల్ అనగానే నాటితరం పీలే నుంచి నేటితరం ఎంబప్పే వరకూ కలకాలం గుర్తుంచుకోదగ్గ అతికొద్ది మంది ఆటగాళ్లు మాత్రమే మనకు కనిపిస్తారు. తమ ఆటతీరుతో సంవత్సరాల తరబడి రాణిస్తూ అభిమానులను ఓలలాడిస్తున్న ధృవతారలలో ఒక్కొక్కరిదీ ఒక్కో కథ, విలక్షణమైన విజయగాథ.




# ప్రపంచ ఫుట్‌బాల్‌లో ధృవతారలు

లాటిన్ అమెరికా, యూరోప్, ఆఫ్రికా, ఆస్ట్రేలియా,ఉత్తర అమెరికా, ఆసియా దేశాలలో విశేష జనాదరణ పొందుతున్న ఈ క్రీడను తలచు కోగానే బ్రెజిల్ ఆణిముత్యం పీలే, అర్జెంటీనా థండర్ డియాగో మారడోనా, ఇటలీ థండర్ పాలో రోసీ, మ్యూలర్, రూడ్ గిల్ట్, డేవిడ్ బెకామ్, రొమారియో, బెబిటో, ఇబ్రహీమోవిచ్ లాంటి ఎందరో గత తరం దిగ్గజ ఆటగాళ్లు గుర్తుకొస్తారు. అయితే నేటితరం అభిమానులను ఉర్రూతలూగిస్తున్న ఆటగాళ్లలో పోర్చుగల్ డైనమైట్ క్రిస్టియానో రొనాల్డో, అర్జెంటీనా మాంత్రికుడు లయనల్ మెస్సీ, ఫ్రెంచ్ మెరుపు వీరుడు కీలాన్ ఎంబప్పే ప్రముఖంగా కనిపిస్తారు. వీరు ఫీల్డ్‌లోకి దిగారంటే చాలు, అసాధారణ ప్రతిభకు అపూర్వ నైపుణ్యం జోడించి మెరుపు వేగంతో దూసుకుపోతూ కన్ను మూసి తెరిచే లోగానే గోల్స్ కొట్టేస్తుంటారు.

నాలుగేళ్లకోసారి జరిగే ప్రపంచ కప్, ఖండాంతర ఫుట్‌బాల్ టోర్నీలలో పాల్గొంటూనే అంతర్జాతీయ ప్రొఫెషనల్ లీగ్ టోర్నీలలో వివిధ క్లబ్ జట్ల తరపున ఆడుతూ నేటితరం ఆటగాళ్లు వందల కోట్ల రూపాయలు అలవోకగా ఆర్జిస్తూ ఉండటం సాధారణ విషయమే. ప్రపంచ ఫుట్‌బాల్ ప్రస్తుత సూపర్ స్టార్ ప్లేయర్లు క్రిస్టియానో రొనాల్డో, లయనల్ మెస్సీ ఏడాదికి 500 నుంచి 700 కోట్ల రూపాయల వరకూ సంపాదిస్తున్నారు.

ఖతర్ వేదికగా జరుగుతున్న 2022 ఫిఫా ప్రపంచ కప్ టోర్నీలో అర్జెంటీనాకు లయనల్ మెస్సీ, పోర్చుగల్‌కు క్రిస్టియానో రొనాల్డో, ఫ్రాన్స్‌కు ఎంబప్పే, బ్రెజిల్‌కు నైమార్ మూలవిరాట్టులుగా ఉంటూ తమ జట్లను విజయపథంలో నడిపిస్తున్నారు. 37 ఏళ్ల క్రిస్టియానో రొనాల్డో తన కెరియర్‌లో ఐదో ప్రపంచ కప్‌లోనూ, 35 ఏళ్ల లయనల్ మెస్సీ నాలుగో ప్రపంచ కప్‌లోనూ పాల్గొంటున్నారు. 23 సంవత్సరాల ఎంబప్పేకు మాత్రం ఇది రెండో ప్రపంచ కప్ మాత్రమే. ప్రస్తుత ప్రపంచ కప్ ప్రీ-క్వార్టర్ ఫైనల్స్ వరకూ.. ఎంబప్పే ఐదు గోల్స్‌తో అత్యధిక గోల్స్ సాధించిన మొనగాడిగా నిలిచాడు. లయనల్ మెస్సీ 3 గోల్స్ సాధించడం ద్వారా తన జట్టును క్వార్టర్ ఫైనల్స్‌కు చేర్చాడు. 2006, 2010, 2014, 2018, 2022 ప్రపంచ కప్ టోర్నీలలో పాల్గొంటూ వస్తున్న రొనాల్డో వరుసగా ఐదు ప్రపంచ కప్ టోర్నీలలో గోల్స్ సాధించిన తొలి, ఏకైక ఆటగాడిగా చరిత్ర సృష్టించాడు. ఐదు ప్రపంచ కప్ టోర్నీలలో రొనాల్డో 9 గోల్స్, నాలుగు ప్రపంచ కప్ టోర్నీలలో మెస్సీ 8 గోల్స్, కేవలం రెండు (2018, 2022) ప్రపంచకప్ టోర్నీలలోనే ఎంబప్పే 9 గోల్స్ సాధించడం విశేషం.

## రికార్డుల వీరుడు ఎంబప్పే

కీలాన్ ఎంబప్పే ప్రస్తుత ప్రపంచ ఫుట్‌బాల్‌లో మెరుపులు మెరిపిస్తున్నాడు. 19 సంవత్సరాల చిరుప్రాయంలోనే ఫ్రాన్స్ జట్టులో సభ్యుడిగా 2018 ఫిఫా ప్రపంచ కప్ పతకం అందుకొన్న ఎంబప్పే ప్రస్తుత 2022 ప్రపంచ కప్‌లో సైతం తన ట్రేడ్ మార్క్ సాకర్‌తో అద్భుతాలు చేస్తున్నాడు. 23 సంవత్సరాల వయసుకే ప్రపంచ కప్‌లో ఎనిమిది గోల్స్ సాధించిన ఆటగాడు ఎంబప్పే మాత్రమే. 24 సంవత్సరాల వయసుకే 8 గోల్స్ సాధించిన పీలే రికార్డును ఎంబప్పే అధిగమించాడు. 23 సంవత్సరాల వయసుకే రెండు ప్రపంచ కప్ టోర్నీలలో పాల్గొన్న ఎంబప్పే రానున్న కాలంలో మరో నాలుగు ప్రపంచ కప్ టోర్నీలలో అలవోకగా పాల్గొనే అవకాశాలున్నాయి.

క్రిస్టియానో రొనాల్డో, లయనల్ మెస్సీలకు ఇదే ఆఖరి ప్రపంచ కప్ అన్న ప్రచారం జోరుగా సాగుతోంది. అదే జరిగితే అలనాటి దిగ్గజాలు పీలే, మారడోనా; క్రిస్టియానో రొనాల్డో, లయనల్ మెస్సీ, సౌరెజ్, థియరీ హెన్రీ, రివాల్డో, మారియో కెంపెస్‌ల పేరుతో ఉన్న పలు రకాల రికార్డులను ఎంబప్పే బద్దలు కొట్టడం ఖాయమని ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. ★



క్రీడా కృష్ణ, 84668 64969
సీనియర్ జర్నలిస్ట్

# నైజాం విముక్త స్వాతంత్ర్య అమృతోత్సవాల యువ సమ్మేళనాలు

**యువతకు చరిత్ర పట్ల అవగాహన కలిగిస్తూ, భవిష్యత్తులో వారికి తమ కర్తవ్యం గురించి తెలియజేస్తూ నైజాం విముక్త స్వాతంత్ర్య అమృతోత్సవాల సమితి ఆధ్వర్యంలో తెలంగాణ అంతటా డివిజన్ వారీగా యువసమ్మేళనాలు జరుగుతున్నాయి. వాటిలో కొన్ని విశేషాలు.**






**వికారాబాద్ :** నవంబర్ 27న అనంతగిరిలోని తేజ కన్వెన్షన్ హాల్‌లో జరిగిన యువ సమ్మేళనం వేదికపై ప్రసంగిస్తున్న కాచం రమేష్ (ప్రాంత కార్యవాహ), నైజాం విముక్త స్వాతంత్ర్య అమృతోత్సవాల జిల్లా సమితి గౌరవాధ్యక్షులు రఘునాథ్‌రావు, కార్యదర్శి మాణిక్‌రెడ్డి, జిల్లా సంఘచాలక్ సత్యనారాయణగౌడ్. 2900 యువత పాల్గొన్న ఈ కార్యక్రమంలో వనవాసీ కళ్యాణ పరిషత్ అఖిల భారతీయ అధికారి రామచంద్రయ్య మార్గదర్శనం చేశారు.

---




**జనగాం :** నవంబర్ 29న జనగాంలోని సాయిరామ్ కన్వెన్షల్ హాల్‌లో జరిగిన యువ సమ్మేళనం వేదికపై ప్రసంగిస్తున్న సహ ప్రాంత ప్రచారక్ ప్రభుకుమార్, ఇతిహాస సంకలన సమితి గ్రేటర్ హైదరాబాద్ ప్రధాన కార్యదర్శి ముదిగొండ ఇందుశేఖర్, ఉత్సవ సమితి జిల్లా అధ్యక్షులు డా॥ కల్నల్, మాచర్ల భిక్షపతి, కార్యదర్శి ప్రముఖ రచయిత డా॥ మోహనకృష్ణ భార్గవ. కార్యక్రమంలో మొత్తం 300 మందికి పైగా యువతీ యువకులు పాల్గొన్నారు.

---






**హనుమకొండ :** డిసెంబర్ 1న హనుమకొండలోని విష్ణుప్రియ గార్డెన్స్‌లో జరిగిన యువ సమ్మేళనం వేదికపై ప్రసంగిస్తున్న కాచం రమేష్ (ప్రాంత కార్యవాహ), నైజాం విముక్త స్వాతంత్ర్య అమృతోత్సవాల సమితి తెలంగాణ కార్యదర్శి బాబూరావు, ఉత్సవ సమితి అధ్యక్షులు ఆచార్య దామోదర్, వర్కింగ్ ప్రెసిడెంట్ ప్రొ॥ విజయబాబు, ప్రధాన కార్యదర్శి సుధీర్ ఆర్యా, కోశాధికారి వేణురెడ్డి, ఉపాధ్యక్షులు పాక శ్రీనివాస్, కార్యదర్శులు అమరేందర్‌రెడ్డి, బుచ్చిబాబు, మల్లేశం, సభ్యులు డా॥రాజేందర్, డా॥ రమాకాంత్, సి.హెచ్. సత్యనారాయణ, విభాగ్ సంఘచాలక్ సంజీవ్, మహానగర సంఘచాలక్ బి. మోహన్‌రావు. ఈ కార్యక్రమంలో మొత్తం 5483 మంది యువతీ యువకులు పాల్గొన్నారు.




**పాలమూర్ :** నవంబర్ 30న పాలమూర్ వైట్‌హౌస్ కన్వెన్షన్ హాల్‌లో జరిగిన యువ సమ్మేళనంలో వేదికపై ప్రసంగిస్తున్న ఆర్‌ఎస్‌ఎస్ అఖిలభారత కార్యకారిణి సభ్యులు రాంమాధవ్, ఉత్సవ సమితి అధ్యక్షులు ఎస్. నాగేందర్, కార్యదర్శి అనంతరెడ్డి (అడ్వకేట్), ఉత్సవ సమితి సభ్యులు శ్రీలత, డా॥ మురళి, కుమారస్వామి. విభాగ్ సంఘచాలక్ ఏమిరెడ్డి శ్రీనివాసరెడ్డి, జిల్లా సంఘచాలక్ వసంతపు వెంకటేశ్వర్లు, ఈ కార్యక్రమంలో పాల్గొన్న యువత 8270.

---




**ఉప్పల్ :** నవంబర్ 23న ఉప్పల్ భాగ్ ఆధ్వర్యంలో మేడిపల్లిలోని బండి గార్డెన్స్‌లో జరిగిన యువ సమ్మేళనం వేదికపై ఉత్సవ కమిటీ అధ్యక్షులు అంకం శంకర్, ప్రధాన కార్యదర్శి డా॥ గుల్లపెల్లి కుమార్‌స్వామి, ఆర్‌ఎస్‌ఎస్ ఉప్పల్ భాగ్ కార్యవాహ చిన్నంరాజు, విభాగ్ సంపర్క ప్రముఖ్ బ్రహ్మయ్య చౌదరి, విభాగ్ ప్రచారక్ జగన్నాథ్, విభాగ్ సహ కార్యవాహ భరతపూడి శ్రీనివాస్. ఈ కార్యక్రమంలో మొత్తం 1400 మంది యువతీ యువకులు పాల్గొన్నారు.

---




**ఖమ్మం :** నవంబర్ 27న ఖమ్మంలోని భక్త రామదాసు కళాక్షేత్రంలో జరిగిన యువ సమ్మేళనం వేదికపై ప్రసంగిస్తున్న యాదిరెడ్డి (విశ్వహిందూ పరిషత్ ప్రాంత సంఘటన కార్యదర్శి), నైజాం విముక్త స్వాతంత్ర్య అమృతోత్సవ జిల్లా సమితి సభ్యులు. ఈ కార్యక్రమంలో మొత్తం 1400 మంది యువతీ యువకులు పాల్గొన్నారు.

---




**సూర్యాపేట :** నవంబర్ 26న సూర్యాపేటలో జరిగిన యువ సమ్మేళనం వేదికపై ప్రసంగిస్తున్న జిల్లా సమితి అధ్యక్షులు అప్పం శ్రీనివాస్, ప్రాంత ప్రచారక్ లింగం శ్రీధర్. వేదికపై ఆసీనులైన ముఖ్య అతిథి డా॥ ముత్యాల రాజు, జిల్లా ఉత్సవ సమితి సభ్యులు. ఈ కార్యక్రమంలో మొత్తం 1150 మంది యువతీ యువకులు పాల్గొన్నారు.




# ఎరకేశ్వర ఆలయం-పిల్లలమర్రి

తెలుసుకుందాం



తెలంగాణలోని సూర్యాపేట జిల్లా, పిల్లలమర్రి గ్రామానికి సమీపంలో మూసీ నది ఒడ్డున ఈ దేవాలయం కొలువుదీరింది. దీనిని 1208లో కాకతీయులకు సామంతులైన రేచర్ల కుటుంబానికి చెందిన బాటిరెడ్డి భార్య ఎరకసాని నిర్మించినట్లుగా చెబుతారు. ఈ ఆలయ నిర్మాణ శైలి రామప్ప ఆలయాన్ని పోలి ఉంటుంది. ఈ నిర్మాణంలో ఉపయోగించిన రాయిని నాణెంతో తట్టినప్పుడు లోహం వలె శబ్దం వస్తుంది.

కథ

# గురుదక్షిణ



నందగిరి రాజు మహేంద్రుడికి ఒక పర్యాయం తన గురువు వేదనాథుడు జ్ఞప్తికి వచ్చాడు.

గురువు బోధనల వల్లనే విజయవంతంగా రాజ్యపాలన చేస్తున్నాననే ఎరుక అతనిలో కలిగింది.

గురువును సత్కరించడం విధిగా భావించి గురుకులానికి వెళ్లాడు. తన మనసులోని మాటను చెప్పి, వేదనాథుడిని సగౌరవంగా సభకు ఆహ్వానించాడు.

శిష్యుని కోరికను వేదనాథుడు కాదనలేకపోయాడు. రాబోయే 'గురుపౌర్ణమి' నాడు వస్తానని మాట ఇచ్చాడు.

చెప్పిన సమయానికి కొందరు శిష్యులతో కలిసి నందగిరి బయల్దేరాడు వేదనాథుడు.

వారు వెళ్లేసరికి చీకటిపడింది. మహేంద్రుడు పట్టపురాణితో కలిసి గురువుకు సాదర స్వాగతం పలికాడు.

పాదపూజ అనంతరం వేదనాథుడిని ఉన్నతాసనంపై కూర్చోబెట్టారు రాజు దంపతులు. ఓ భారీ పూలదండను గురువు మెడలో అలంకరించారు. వెనువెంటనే పరివారం ఓ పట్టువస్త్రపు మూటను ఆయన చేతిలో ఉంచారు.

'ఏమిటిది?' ఆశ్చర్యపోతూ అడిగారు గురువుగారు.

'నా ఉన్నతికి దోహదపడిన మీకు నా

## పద్యము

పని తొడవులు వేరు బంగారమొక్కటి
పరగ ఘటలు వేరు ప్రాణమొక్కటి
అరయ తిండ్లు వేరు ఆకలి యొక్కటి
విశ్వదాభిరామ వినుర వేమ

**భావం :** వృత్తి కళాకారుని పనితనంలో రూపొందే ఆభరణాలు ఎన్నో రకాలు, కానీ దానికి వాడే మూల వస్తువు బంగారం ఒక్కటే. శరీరాలు వేర్వేరు కాని వాటిలో కదలాడే ప్రాణం ఒక్కటే. ఆహారాలు అనేక మైనా వాటిని కోరే ఆకలి మాత్రం ఒక్కటే అని అర్థం.

## సూక్తిరత్నం

రుణానుబంధ రూపేణ

'రుణానుబంధరూపేణ
పశుపత్ని సుతాలయాః
రుణక్షయే క్షయం యాంతి
కా తత్ర పరిదేవనా'

**భావం :** పశువులు, భార్యాపుత్రులు, ఇళ్లు వాకిళ్లు రుణానుబంధంగా వచ్చినవి. రుణం తీరిన వెంటనే అన్ని వదిలి వెళ్లిపోతాయి. అలాంటి వారి గురించి ప్రాజ్ఞులు విచారించరు.

## జత పరచండి

ఇక్కడున్న పదాలకు పక్కనున్న పదాల్లో ఏవి సరిపోతాయో కనుక్కోండి.

| | |
|---|---|
| ఈడు | వాకిలి |
| ఉలుకు | అలము |
| అందం | జోడు |
| ఇల్లు | చందం |
| ఆకు | పలుకు |

జవాబులు : ఈడు-జోడు, ఉలుకు-పలుకు, అందం-చందం, ఇల్లు-వాకిలి, ఆకు-అలము

## భారత స్వాతంత్య్ర సమరయోధులు

### సీకే నారాయణరెడ్డి



ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు. పూర్తి పేరు చల్లా కృష్ణనారాయణరెడ్డి. పీలేరు గాంధీగా సుప్రసిద్ధులు. హైదరాబాద్ బుక్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు. చిత్తూరు జిల్లా పీలేరు సమీపంలోని రొంపిచర్ల మండలం చల్లావారి పల్లెలో ఆగస్ట్ 1, 1925న జన్మించారు. క్విట్ ఇండియా ఉద్యమంలో చురుగ్గా పాల్గొన్నారు. ఎప్పుడూ ఖద్దరు వస్త్రాలనే ధరించేవారు. సెప్టెంబర్ 5, 2013న తుదిశ్వాస విడిచారు.

## జనరల్ నాలెడ్జ్

1. త్రివిధ దళాల నూతన అధిపతిగా ఇటీవల ఎవరు పదవీ బాధ్యతలు చేపట్టారు?
2. ఐక్యరాజ్య సమితి అవతరణ దినోత్సవం ఏ రోజున జరుపుకుంటారు?
3. మన దేశంలో కరెన్సీ నోట్లు జారీ చేసే అధికారం ఎవరికి ఉంది?

సమాధానాలు : 1. లెఫ్టినెంట్ జనరల్ అనిల్ చౌహాన్; 2. అక్టోబర్ 24; 3. భారతీయ రిజర్వ్ బ్యాంక్.



గురుదక్షిణ' వినయంతో అన్నాడు మహేంద్రుడు.

'చిరుకానుకే.. దయచేసి స్వీకరించండి' అంటూ మూట విప్పి చూపింది రాణి.

బంగారు నాణేలు, వజ్రవైఢూర్యాలు లెక్కకు మిక్కిలిగా ఉన్నాయందులో!

ఆ మూటను మహేంద్రునికే తిరిగిస్తూ, 'ఒక గురువుగా ఇచ్చే గుణం తప్ప తీసుకుని ఎరుగను. నీవు ప్రజల కోసం ఖర్చు చేసే ప్రతి పైసా గురుదక్షిణగానే భావిస్తాను. నా అంతరంగం నీకు అర్థమైందనే భావిస్తాను.' గంభీర స్వరంతో చెప్పాడు వేదనాథుడు.

గురుపౌర్ణమి నాడు గురువు తనకో నూతన పాఠాన్ని బోధించాడని భావించిన మహేంద్రుడు, ఆ సొమ్మును ప్రజల శ్రేయస్సుకే వినియోగించాడు. ★

## మెదడుకు మేత

ఒకే అగ్గిపెట్టెలో ఇద్దరు పోలీసులు, ఏమిటది?

జవాబు : వేరుశెనగ

## మంచిమాట

తటస్థంగా ఉండటమనేది మానసిక బలహీనతకు ఓ సంకేతం!



# వారఫలాలు

12-18 డిసెంబర్ 2022



సింహంభట్ల సుబ్బారావు
6300674054

**మేషం : అశ్విని, భరణి, కృత్తిక 1వ పాదం**

ముఖ్యమైన కార్యక్రమాలు చకచకా పూర్తి కాగలవు. బంధువర్గంతో వివాదాలు పరిష్కరించు కుంటారు. ఆకస్మిక ప్రయాణాలు ఉంటాయి. విద్యార్థులు, నిరుద్యోగులకు సంతోషకరమైన సమాచారం రావచ్చు. వ్యాపారులకు లాభాలు. రాజకీయవేత్తల ప్రయత్నాలు సఫలమై ఉత్సాహంగా గడుపుతారు. రచయితలు, క్రీడాకారులకు ఆహ్వానాలు. 12, 13 తేదీల్లో వృథాఖర్చులు. అనారోగ్యం. దత్తస్తోత్రం పఠించండి.

**వృషభం : కృత్తిక 2,3,4 పాదాలు, రోహిణి, మృగశిర 1,2 పాదాలు**

చేపట్టిన పనులు కొంత నిదానంగా పూర్తిచేస్తారు. విద్యార్థులకు ఒక సమాచారం ఉత్సాహాన్నిస్తుంది. ఆరోగ్యం కుదుటపడుతుంది. ఇంటి నిర్మాణాలపై దృష్టి సారిస్తారు. బాకీలు వసూలవుతాయి. వ్యాపార లావాదేవీలు ఊపందుకుంటాయి. ఉద్యోగులకు పని ఒత్తిడులు తగ్గుతాయి. క్రీడాకారులు, వైద్యులకు ప్రోత్సాహం. 15, 16 తేదీల్లో దూరప్రయాణాలు. మానసిక ఆందోళన. ఆంజనేయ దండకం పఠించండి.

**మిథునం : మృగశిర 3, 4 పాదాలు, ఆర్ద్ర, పునర్వసు 1, 2, 3 పాదాలు**

ముఖ్యమైన పనులు ముందుకు సాగవు. ఆకస్మిక ప్రయాణాలు. రుణ ఒత్తిడులు తప్పవు. ఎంత కష్టించినా ఆశించిన ఫలితం కనిపించదు. ఆశయాల సాధనలో వెనుకబాటు. ఆధ్యాత్మిక కార్యక్రమాలలో పాల్గొంటారు. ఉద్యోగ వర్గాలకు బాధ్యతలు పెరుగుతాయి. రచయితలు, పరిశోధకులకు చికాకులు ఎదురుకావచ్చు. 14,15 తేదీల్లో శుభవార్తలు. ప్రముఖులతో పరిచయాలు. సుబ్రహ్మణ్యాష్టకం పఠించండి.

**కర్కాటకం: పునర్వసు 4వ పాదం, పుష్యమి, ఆశ్లేష**

ఉద్యోగ యత్నాలు సఫలం. విందువినోదాలు, శుభకార్యాలలో పాల్గొంటారు. ఆదాయం మరింత పెరుగుతుంది. పుణ్యక్షేత్రాలు సందర్శిస్తారు. వ్యాపారులు విస్తరణ కార్యక్రమాలు వేగవంతంగా చేస్తారు. ఉద్యోగ వర్గాలకు విధులు సక్రమంగా సాగిపోతాయి. కళాకారులకు పురస్కారాలు జరుగుతాయి. 17,18 తేదీలలో ఆకస్మిక ప్రయాణాలు. అనారోగ్యం. ఆదిత్య హృదయం పఠించండి.

**సింహం : మఖ, పుబ్బ, ఉత్తర 1వ పాదం**

ఎంతటి కార్యాన్నైనా పట్టుదలతో పూర్తిచేస్తారు. అందరిలోనూ విశేష గుర్తింపు లభిస్తుంది. ఉద్యోగ, వివాహ యత్నాలలో కదలికలు. రాబడి మెరుగుపడుతుంది. ఇంటి నిర్మాణాలు చేపడతారు. ఉద్యోగులకు సంతోషకర సమాచారం. రచయితలు, క్రీడాకారులకు అవకాశాలు అప్రయత్నంగా లభిస్తాయి. 12, 13 తేదీల్లో అనుకోని ప్రయాణాలు. మానసిక అశాంతి. శివ స్తోత్రం పఠించండి.

**కన్య : ఉత్తర 2, 3, 4 పాదాలు, హస్త, చిత్త 1,2 పాదాలు**

హామీలు నిలుపుకుని విశ్వసనీయత చాటుకుంటారు. విద్యార్థుల్లోని ప్రతిభ వెలుగులోకి వస్తుంది. ఆర్థిక పరిస్థితిని మెరుగుపరుచుకుంటారు. ఆస్తి వివాదాల పరిష్కారం. ఇంట్లో శుభకార్యాల నిర్వహణ. కష్టం ఫలించే సమయం. వ్యాపారులకు ఒడిదుడుకులు, సమస్యలు తొలగుతాయి. కళాకారులకు అవకాశాలు. 16,17 తేదీలలో వృథా ఖర్చులు. కుటుంబంలో చికాకులు. నవగ్రహ స్తోత్రం పఠించండి.

**తుల : చిత్త 3,4 పాదాలు, స్వాతి, విశాఖ 1,2,3 పాదాలు**

కార్యక్రమాలు చకచకా సాగుతాయి. ఆర్థిక పరిస్థితి మెరుగుపడుతుంది. భూ, గృహ యోగాలు. కోర్టు వ్యవహారాలు కొలిక్కి వస్తాయి. ఉద్యోగులు విధి నిర్వహణపై శ్రద్ధ వహిస్తారు. పారిశ్రామికవేత్తలకు చిక్కులు తొలగుతాయి. క్రీడాకారులు, వైద్యుల ఆశయాలు నెరవేరతాయి. 15, 16 తేదీల్లో అనుకోని ప్రయాణాలు. కుటుంబ సమస్యలు చికాకు పరుస్తాయి. ఆదిత్య హృదయం పఠించండి.

**వృశ్చికం : విశాఖ 4వ పాదం, అనూరాధ, జ్యేష్ఠ**

రాబడిపై మీ అంచనాలు నిజం కాగలవు. దీర్ఘకాలిక రుణబాధలు తీరతాయి. ఆప్తులు, సన్నిహితులతో ఆనందంగా గడుపుతారు. వాహనాలు, ఆభరణాలు, స్థిరాస్తులు కొంటారు. ఉద్యోగులకు అనుకోని మార్పులు ఉండవచ్చు. రాజకీయవేత్తలు కొత్త పదవులు దక్కించుకుంటారు. రచయితలు, కళాకారులకు శుభవార్తలు. 12,13 తేదీల్లో మానసిక అశాంతి. దక్షిణామూర్తి స్తోత్రం పఠించండి.

**ధనుస్సు : మూల, పూర్వాషాఢ, ఉత్తరాషాఢ 1వ పాదం**

రాబడిపై సంతృప్తి. కొంత సొమ్ము అనూహ్యంగా అందే అవకాశాలు. ధార్మికవేత్తలను కలుసుకుని వారి సూచనలు గ్రహిస్తారు. ఆరోగ్యం కుదుట పడుతుంది. ఆస్తి వివాదాల పరిష్కారానికి యత్నాలు ఫలిస్తాయి. వ్యాపారులకు లాభాలు. ఉద్యోగులకు అవాంతరాలు తొలగుతాయి. రచయితలు, వైద్యులు శ్రమకు ఫలితం. 13, 14 తేదీల్లో కుటుంబ సమస్యలు. వ్యయ ప్రయాసలు. శ్రీకృష్ణ స్తోత్రం పఠించండి.

**మకరం : ఉత్తరాషాఢ 2,3,4 పాదాలు, శ్రవణం, ధనిష్ఠ 1, 2 పాదాలు**

కొన్ని కార్యక్రమాలు నెమ్మదించినా ఎట్టకేలకు పూర్తిచేస్తారు. ఆర్థిక పరిస్థితి మెరుగ్గా ఉండి అవసరాలు తీరతాయి. ఆరోగ్యం కుదుట పడుతుంది. పుణ్యక్షేత్రాలు సందర్శిస్తారు. ఉద్యోగులకు అనుకూల మార్పులు. పారిశ్రామికవేత్తలు విదేశీ పర్యటనలు చేస్తారు. క్రీడాకారులు, పరిశోధకులకు శుభవార్తలు అందుతాయి. 16, 17 తేదీల్లో వృథా ఖర్చులు. మానసిక అశాంతి. హయగ్రీవ స్తోత్రం పఠించండి.

**కుంభం : ధనిష్ఠ 3,4 పాదాలు, శతభిషం, పూర్వాభాద్ర 1,2,3 పాదాలు**

ఆర్థిక పరిస్థితిని చక్కబర్చుకునే పనిలో నిమగ్నమవుతారు. ఉద్యోగ యత్నాలు అనుకూలిస్తాయి. వ్యాపారులు లాభాలు అందుకుని ఉత్సాహంగా గడుపుతారు. ఉద్యోగులు విధులు చక్కబెట్టడంలో ప్రశంసలు అందుకుంటారు. రాజకీయవేత్తలకు పదవీయోగం. కళాకారులు, రచయితల యత్నాలు సఫలం. 17,18 తేదీలలో మనశ్శాంతి లోపిస్తుంది. బాధ్యతలు పెరుగుతాయి. శివాష్టకం పఠించండి.

**మీనం : పూర్వాభాద్ర 4వ పాదం, ఉత్తరాభాద్ర, రేవతి**

కొత్త పనులు ప్రారంభిస్తారు. ఆలోచనలు కార్యరూపంలో పెడతారు. ఆదాయానికి ఇబ్బందులుండవు. కొన్ని సమస్యలు తీరి మనశ్శాంతి చేకూరుతుంది. విలువైన వస్తువులు కొంటారు. దేవాలయాలు సందర్శిస్తారు. మీ కష్టం ఫలించే సమయం. వాహనాలు, ఇల్లు కొంటారు. నిర్ణయాలు కొన్ని మార్చుకుంటారు. ఉద్యోగులకు చికాకులు తొలగుతాయి. 13,14 తేదీల్లో ఆరోగ్య సమస్యలు. అనుకోని ప్రయాణాలు. వేంకటేశ్వరస్వామి స్తోత్రం పఠించండి. ★

# పదరసం-394

## ఆధారాలు

**అడ్డం**

1. ఏప్రిల్ 14, 1939న జన్మించిన ఓ సినీ నటుడు రచయిత (4)
3. గెలుపు + అమృతం ఓ సినీనటి (4)
6. మండూకము (2)
8. పలకపై దీనితో రాస్తాం (3)
9. మినహాయింపు (3)
11. కెరటం (2)
12. రోజులు (4)
13. అటుగా భోజుడు ముందే పోయాడు (2)
14. కృష్ణుడే నారీ నారీ నడుమ..... (3)
16. ప్రసిద్ధ చిత్రకారుడు, సినీ దర్శకుడు సత్తిరాజు లక్ష్మీనారాయణ (2)
19. సూర్యుడు (2)
21. పువ్వు (3)
22. రాశి కన్నా ఇది ముఖ్యం (2)
24. కలయిక (2)
25. దిశ (2)
26. రీతి తోడిది (3)
27. అటుగా శృంగార హాస్యాదులు (3)
29. ఇన్సూరెన్సు (2)
31. అరవై సెకన్ల కాలం (3)
32. మదత మంచం కాదు మరోటి (5)

**నిలువు :**

1. మిక్కిలి శక్తి అనే! (5)
2. సుమాల చప్పరము (5)
4. కీర్తి (3)
5. భారతంలో మెత్తని పులి (4)
7. నిప్పులుమిసే దిగంబర కవి (4)
10. భీతి (3)
15. అయోధ్యలో నిర్మితమైనది (6)
16. నుయ్యి (2)
17. శిశిరం అంటే ఈ కాలం (4)
18. ఓ సముద్ర తీర ప్రాంతం పర్యాటక ప్రసిద్ధం (2)
20. వచన కవితా పితామహుడు (3)
23. విజయనగరంలో జరిపే ప్రసిద్ధ ఉత్సవం (4)
28. వేశ్య (2)
30. చెట్టు (2)

మా చిరునామా : పదరసం, జాగృతి వారపత్రిక, 3-4-228/4/1, కాచిగూడ, హైదరాబాద్-27

| | | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|---|
| ✠ | 1 | | 2 | | ✠ | 3 | 4 | | 5 |
| 6 | | ✠ | | ✠ | 7 | ✠ | | ✠ | |
| ✠ | 8 | | | ✠ | | ✠ | 9 | 10 | |
| 11 | | ✠ | 12 | | | | ✠ | 13 | |
| ✠ | 14 | 15 | | ✠ | | ✠ | 16 | | ✠ |
| 17 | ✠ | | ✠ | 18 | ✠ | 19 | | ✠ | 20 |
| 21 | | | ✠ | 22 | 23 | ✠ | ✠ | 24 | |
| | ✠ | 25 | | ✠ | 26 | | | ✠ | |
| 27 | 28 | | ✠ | 29 | | ✠ | ✠ | 30 | ✠ |
| ✠ | 31 | | | ✠ | 32 | | | | |

పదరసం – 394

పేరు : ..............................................................................................

చిరునామా:..............................................................................................

..............................................................................................

పిన్‌కోడ్ : .................. మొబైల్ : ..................................................

**సమాధానాలను** పైగడులలో పూరించి, కత్తిరించి కవర్‌పై పదరసం నెం. వేసి 2022 డిసెంబర్ 26 లోగా జాగృతికి పంపండి. సరైన సమాధానాలు రాసిన వారిని విజేతలుగా ప్రకటిస్తాం. ఒకరిని లాటరీ ద్వారా ఎంపికచేసి నగదు బహుమతి అందచేస్తాం. తుది నిర్ణయం జాగృతి యాజమాన్యందే.

## పదరసం - 390 సమాధానాలు

| | | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|---|
| ✠ | 1 భా | 2 వ | క | 3 వి | ✠ | 4 వా | 5 యు | లీ | 6 నం |
| 7 ఆ | ✠ | ల | ✠ | భ | ✠ | ✠ | క్తి | ✠ | గ |
| 8 డ | బ్బు | ✠ | 9 పై | వ | రు | 10 స | ✠ | 11 చై | నా |
| పా | ✠ | 12 దా | ✠ | ము | ✠ | 13 ర్దా | జ | ✠ | చి |
| 14 ప | 15 లా | శ | ✠ | ✠ | ✠ | ర్ | ✠ | 16 చే | ✠ |
| ✠ | 17 గు | ర | క | ✠ | 18 దుం | ప | ✠ | 19 ప | 20 స |
| 21 ఉ | ✠ | ఖి | ✠ | ✠ | ✠ | 22 టే | కు | ✠ | నా |
| 23 రి | క్క | ✠ | 24 ము | ఖ | 25 మ | ల్ | ✠ | 26 సుం | త |
| కం | ✠ | 27 అం | ✠ | ✠ | హ | ✠ | 28 వెం | ✠ | నం |
| 29 బం | కిం | చం | ద్ర | ✠ | 30 తి | రు | ప | తి | ✠ |

**విజేతలు:** సి.జి.శంకరరావు, పి.నాగేశ్వర శర్మ, టి.విశాలక్ష్మి, సుమీత్‌జైన్, ఎం.విజయ లక్ష్మి, జి.ఆనంద్, సి.రాజేశ్వరి–హైదరాబాద్, వి.రామలింగాచారి–యాదగిరిగుట్ట, కె.సత్యనారాయణ–విశాఖపట్నం, టి.వి.ఎం.కృష్ణప్రసాద్–నెల్లూరు, వి.ఉమా మహేశ్వరశర్మ–అనంతపురం, కె.కాంతా మణి–భువనేశ్వర్.

**విజేత: టి.వి.ఎం.కృష్ణ ప్రసాద్-నెల్లూరు**

# విజయం సరే, 'హిట్–2'లో విషయం లేదు!

**తెలుగులో సీక్వెల్ చిత్రాలు విజయం సాధించినంతగా ఫ్రాంచైజ్ మూవీస్ మెప్పించలేకపోతున్నాయి. అవి డబ్బులు తెచ్చిపెట్టడం లేదని కాదు, కానీ మొదటి చిత్రంతో పోల్చితే రెండో సినిమా ఆ స్థాయిలో ప్రేక్షకులను ఆకట్టుకోలేకపోతోంది. ఆ మధ్య వచ్చిన 'ఎఫ్ 3' మాదిరి గానే తాజాగా విడుదలైన 'హిట్ –2' కూడా కంటెంట్ పరంగా తేలి పోయింది. అయితే మొదటి సినిమా ఘన విజయం సాధించిన నేపథ్యంలో ఈ రెండు సినిమాలు నిర్మాతలకు సేఫ్ ప్రాజెక్ట్స్ అయ్యాయి.**



హీరో నాని నిర్మాతగా మారి తొలుత 'అ' అనే సినిమా తీశాడు. అది కమర్షియల్‌గా గ్రాండ్ సక్సెస్ సాధించకపోయినా, అవార్డులను అందుకుని, నానికి మంచి పేరు తెచ్చిపెట్టింది. అదే ఊపుతో 2020లో 'హిట్' మూవీని విశ్వక్‌సేన్ హీరోగా నిర్మించాడు. ఆ సినిమా హిట్ టాక్ తెచ్చుకుని థియేటర్లలో సందడి చేస్తున్న సమయంలోనే కరోనా ఫస్ట్ వేవ్ కారణంగా సినిమా హాల్స్ మూతపడ్డాయి. దానికి సీక్వెల్ ఉంటుందని చెప్పిన నాని, ఆ తర్వాత మనసు మార్చుకుని ఫ్రాంచైజ్ మూవీ చేశాడు. అదే 'హిట్ –2'. ఈ తాజా చిత్రంలో అడివి శేష్ హీరోగా నటించాడు. 'మేజర్' తర్వాత ఈ యేడాది విడుదలైన అడివి శేష్ రెండో సినిమా ఇది. 'హిట్'ను తెరకెక్కించిన డాక్టర్ శైలేష్ కొలను ఈ సినిమానూ డైరెక్ట్ చేశాడు.

కృష్ణదేవ్ (అడివి శేష్) తనను తాను కేడీ అని చెప్పుకోవడానికి ఇష్టపడుతుంటాడు. విశాఖపట్నంలో పోలీస్ సూపరింటెండెంట్‌గా పనిచేస్తుంటాడు. పోలీసుల తెలివితేటలతో పోల్చితే నేరస్తులది కోడి బుర్ర అని అతని భావన. అలాంటి కేడీకి ఓ టిపికల్ కేసు తగులుతుంది. పబ్‌లో పనిచేసే ఓ అమ్మాయిని ఒకడు అతి దారుణంగా హత్య చేస్తాడు. తల మాత్రం ఆమెది ఉంచి, మిగిలిన శరీర భాగాలను వేరే అమ్మాయిలవి పెడతాడు. అతి దారుణంగా ఈ హత్యలు చేసిన వ్యక్తిని కృష్ణదేవ్ ఉరఫ్ కేడీ ఎలా ఛేజ్ చేసి పట్టుకున్నాడన్నదే ఈ చిత్రం. తనను తక్కువగా అంచనా వేశాడనే కసితో ఒకానొక సమయంలో ఆ హంతకుడు కేడీ భార్యనూ కిడ్నాప్ చేస్తాడు. దాంతో డ్యూటీ కాస్త, పర్సనల్ రైవలరీగానూ మారిపోతోంది. సీరియల్ కిల్లర్‌ను కనిపెట్టడం ఒక ఎత్తు అయితే, వాడి నుండి తనను, తన భార్యను రక్షించుకోవడం కేడీకి మరో ఎత్తుగా మారుతుంది. ఈలోగా అతని ప్రవర్తన సరిగా లేదని డిపార్ట్‌మెంట్ నుండి సస్పెన్షన్‌కు గురవుతాడు. కాబట్టి సోలోగా ఈ కేసును కేడీ ఎలా సాల్వ్ చేశాడనేదే ముగింపు.

నిజం చెప్పాలంటే... సినిమా ప్రారంభం నుండి ముగింపు వరకూ చాలా ఆసక్తికరంగా సాగింది. కిల్లర్ ఎవరనే విషయంలో ప్రేక్షకుల ఊహకు సైతం అందకుండా దర్శకుడు చాలా రకాలుగా కథను మలుపు తిప్పాడు. అయితే కిల్లర్‌ను రివీల్ చేసిన తర్వాత మూవీ గ్రాఫ్ ఒక్కసారిగా పడిపోయింది. పైగా అతను సైకోగా మారడానికి చూపిన కారణం మరీ పేలవంగా ఉంది. తన తండ్రికి మహిళా సంఘాల వల్ల జరిగిన అన్యాయానికి ప్రతీకారంగా కొడుకు కిల్లర్‌గా మారడం అనేది ఏ రకంగానూ సబబుగా అనిపించదు. పైగా దానిని ఎస్టాబ్లిష్ చేసే సీన్స్ కూడా ఏవీ లేవు. దీనికి తోడు పోలీస్ సూపరింటెండెంట్ తాను ప్రేమించిన అమ్మాయిని పెళ్లిచేసుకోకుండా సహజీవనం చేయడం, ఆమె గర్భవతి అని తెలిసిన తర్వాత పెళ్లి పీటలు ఎక్కడం అనేది దారుణంగా ఉంది. బాధ్యత లేని కుర్రవాళ్లు అలా చేశారంటే ఓకే కానీ సమాజానికి ఆదర్శంగా నిలవాల్సిన పోలీస్ అధికారిని అలా చూపడం సరికాదు. ఇలాంటి లోటుపాట్లు చాలానే ఉన్నాయి. అయితే కథనంతో దర్శకుడు మెప్పించడంతో వీటిని ఎవరూ పెద్దంత పట్టించుకోని పరిస్థితి ఉంది. నటీనటుల విషయానికి వస్తే, గత కొంత కాలంగా యాక్షన్ సినిమాలు చేస్తున్న అడివి శేష్... తన శరీర దారుఢ్యాన్ని జాగ్రత్తగా కాపాడుకుంటున్నాడు. అందువల్ల ఇందులో పోలీస్ ఆఫీసర్ పాత్రలో చక్కగా ఉన్నాడు. ఇప్పటికే రెండు సినిమాలతో తెలుగువారికి చేరువైన మీనాక్షి చౌదరి ఆర్య పాత్రలో ఒదిగిపోయింది. కేడీకి కుడిభుజంగా ఉండే వర్ష పాత్రను కోమలి ప్రసాద్ సమర్థవంతంగా పోషించింది. అలానే ఇతర ప్రధాన పాత్రలను శ్రీనాథ్ మాగంటి, భరణి, రావు రమేశ్, పోసాని, హర్షవర్ధన్, శ్రీకాంత్ అయ్యంగార్, కేదార్ శంకర్, బ్రహ్మాజీ, గీత భాస్కర్ తదితరులు చేశారు. ఈ సినిమాలో ప్రత్యేకంగా చెప్పుకోవాల్సింది సుహాస్ గురించి. 'కలర్ ఫోటో'లో హీరోగా నటించిన సుహాస్ ఆ తర్వాత ప్రాధాన్యమున్న పాత్రలను చేస్తున్నాడు. ఆ మధ్య ఓటీటీలో వచ్చిన 'ఫ్యామిలీ డ్రామా'లో షాకింగ్ పెర్ఫార్మెన్స్ ఇచ్చాడు. బహుశా అది చూసే అతన్ని ఈ సినిమాలోని ఈ పాత్రకు ఎంచుకుని ఉండొచ్చు. అలానే మూవీ చివరిలో నాని గెస్ట్ అప్పియరెన్స్ ఇచ్చాడు. 'హిట్ 3' హీరో అతనే అనే విషయాన్ని దర్శకుడు ముగింపులో ఆ రకంగా రివీల్ చేసేశాడు. ఇందులో ఉన్న రెండు పాటల్లో ఒకదానికి శ్రీలేఖ, మరోదానికి సురేశ్ బొబ్బిలి స్వరాలు సమకూర్చారు. జాన్ స్టేవర్ట్ ఈడూరి అందించిన నేపథ్య సంగీతం బాగుంది. సంభాషణలూ ఆసక్తికరంగానే ఉన్నాయి. నాని, ప్రశాంతి తిపిర్నేని సంయుక్తంగా నిర్మించిన 'హిట్ –2' వారికి లాభాలు తెచ్చిపెట్టవచ్చు కానీ కంటెంట్ పరంగా వీక్షకులకు మొదటి సినిమాతో పోల్చితే నిరాశనే కలిగించింది. విశేషం ఏమంటే.. ఇదే వారం నాని తన సోదరి దీప్తి గంటాతో నిర్మించిన ఆంథాలజీ 'మీట్ క్యూట్' సోనీ లైవ్‌లో స్ట్రీమింగ్ అయ్యింది. కాబట్టి, ఈ యేడాది నాని నటుడిగా కంటే నిర్మాతగా బిజీ అని చెప్పుకోవచ్చు.

*వ్యాసకర్త : సీనియర్ జర్నలిస్ట్*

ఆసక్తి కలిగించే విశ్లేషణలు.. జాగృతపరిచే కథనాలు..
చైతన్యం నింపే వాస్తవాలు.. స్ఫూర్తిని నింపే రచనలతో
ఇపుడు జాగృతి వారపత్రిక మరింత కొత్తగా మీ ముందుకు వస్తున్నది.




రండి..
జాతీయభావాల వేదిక
జాగృతి చందాదారులుగా
చేరుదాం.. చేర్పిద్దాం!

**ఏప్రిల్ 1, 2023 తేదీ నుండి జాగృతి వార్షిక, 5 సంవత్సరాల చందా పెరగనున్నది. ఆ లోగా చందా కట్టేవారికి పాత ధరలే వర్తిస్తాయి త్వరపడండి...**

జాగృతి చందాను ఆన్‌లైన్‌లో పంపుటకు కిందనున్న క్యు.ఆర్. కోడ్‌లను మీ మొబైల్‌తో స్కాన్ చేయండి.. లేదా లింక్ ద్వారా చందా చెల్లించండి!

ఒక సంవత్సర చందా రూ.650/-
http://payit.cc/S18970

**Jagriti Bank A/c details :**
Jagriti Prakashan Trust,
A/c No.920010061405325,
Axis, Kothapet Branch, Hyderabad.
IFSC : UTIB0002157, PAN : AAATJ3829L

ఐదు సంవత్సరాల చందా రూ.3000/-
http://payit.cc/S18973

3-4-228/4/1, Kachiguda, Hyderabad-500027.
Ph : 040-27561453, 9959997013. email : jagritiweeklysub@gmail.com

From: JAGRITI Telugu Weekly
Jagriti Bhavan, H.No.3-4-228/4/1, Lingampally,
Kachiguda, Hyderabad-500027; email: jagritiweekly@gmail.com

Publishing on Every Thursday; Posting on Every Friday & Saturday
Postal Regn. No. HSE/1052/2021-2023; RNI Regd. No. 3270/57.
Volume : 75 Issue : 08


# జాతీయ భావాలను మేల్కొల్పే ఉత్తమ సాహిత్యం
# మీరు తప్పక చదివి, పదిమందిచే చదివించదగిన పుస్తకాలు


వెల : ₹.200/-


వెల : ₹.200/-


వెల : ₹.390/-


వెల : ₹.300/-


వెల : ₹.75/-


వెల : ₹.399/-


వెల : ₹.200/-


వెల : ₹.200/-


వెల : ₹.250/-


వెల : ₹.250/-



వెల : ₹.599/-



వెల : ₹.499/-



వెల : ₹.695/-



వెల : ₹. 799/-



వెల : ₹.549/-

**పై పుస్తకములకు మరియు క్రొత్త, పాత నవయుగ భారతి ప్రచురణలకై సంప్రదించండి**

ఫోన్ ద్వారా మీకు కావలసిన పుస్తకాలు తెలియజేయండి! రిజిష్టరు పోస్టులో అందుకోండి!!
సాహిత్య నికేతన్ : 3-4-852, కేశవనిలయం, బర్కత్‌పురా, హైదరాబాద్ -27.
040-27563236, 9290127329
సాహిత్య నికేతన్ : ఏలూరు రోడ్, గవర్నరు పేట, విజయవాడ - 2, దూరవాణి : 63035 41244